నేతాజీ సుభాష్ చంద్రబోస్
రూ॥70/-
పేజీలు:68

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ప్రజలకోసం పరితపించే నాయకులను కోల్పోవడం... సమాజానికి, ప్రజలకు తీరని లోటు
పాకిస్థాన్‌లో 16 మంది కార్మికులు కిడ్నాప్
లెబనాన్ అధ్యక్షుడుగా జోసెఫ్ ఔన్
లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 43 | శుక్రవారం | 10-01-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో గ్రామస్థాయిలోనూ

# సకాలంలో వేతనం



గ్రీన్ ఛానెల్ ద్వారా చెల్లించాలి

అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన

జాతీయ ఉపాధిహామీ పథకం కింద రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను పూర్తిచేయాలని ఆదేశం

సిఎం ఆస్ట్రేలియా పర్యటన రద్దు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఇకపై నెల నెలా చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రీన్ ఛానెల్ ద్వారా గ్రామస్థాయి ఉద్యోగుల జీతాలను ప్రతీ నెలా ఎప్పటికప్పుడు చెల్లించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న బకాయిలను పూర్తిగా చెల్లించాలని సిఎం అధికారులను ఆదేశించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి దాదాపు 1.26 లక్షల ఉపాధి పనులు జరిగాయని, వీటికి సంబంధించిన మొత్తం బిల్లులను చెల్లించాలని సిఎం

తరువాయి 2లో

## ఆరున్నర గంటలపాటు

# కెటిఆర్‌పై ప్రశ్నల వర్షం



ఫార్ములా ఈ-రేస్ కేసులో ఎసిబి విచారణకు హాజరైన మాజీమంత్రి

క్వాష్ పిటిషన్ తక్షణ విచారణకు 'సుప్రీం' నిరాకరణ

ప్రజాపక్షం/ హైదరాబాద్

ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారక రామారావు గురువారం ఎసిబి ముందు విచారణకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు విచారణ ప్రారంభం కాగా సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగింది. దాదాపు ఆరున్నర గంటల పాటు ఎసిబి అధికారులు కెటిఆర్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎసిబి అధికారులు కెటిఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎసిబి కార్యాలయంలో

తరువాయి 2లో

## ఒకే వేదికగా...

# 'ఏకమవుదాం' రండి

విడివిడిగా పోరాటాలు వద్దు

దేశంలో రైతు సంఘాలకు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

13న రైతు వ్యతిరేక ముసాయిదా ప్రతుల దగ్ధం

26న పంజాబ్ వ్యాప్తంగా ట్రాక్టర్ ర్యాలీలు



**చండీగఢ్ :** దేశంలోని రైతు సంఘాలన్నీ ప్రత్యేకించి పంజాబ్‌లోని రైతు సంఘాలన్నీ ఒకే వేదికపైకి వచ్చి ఏకం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపు ఇచ్చింది. ఒకే సమస్యలపై రైతు సంఘాలు ఎవరికి వారే విడివిడిగా పోరాటాలు చెయ్యొద్దని, దీనివల్ల అనుకున్న డిమాండ్లను సాధించలేమని స్పష్టమైన సందేశం ఇచ్చింది. పంజాబ్ రాష్ట్రం మోగా జిల్లా కేంద్రంలో గురువారంనాడు ఎస్‌కెఎం మహాపంచాయత్ జరిగింది. రైతులు పండించిన పంటలన్నింటికీ కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత, పంట రుణాల రద్దు సహా ఇతర కీలక డిమాండ్ల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని సవాలు చేసేందుకు ఏకం కావాలని అన్ని రైతు సంఘాలకూ మోగా మహాపంచాయత్ పిలుపు ఇచ్చింది. పంజాబ్ రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది రైతులు ట్రాక్టర్లు, బస్సులు, ఇతర వాహనాలలో మోగాలో జరుగుతున్న కిసాన్ పంచాయత్‌కు ఉదయం నుండే తరలి వచ్చారు. 2020–21 లో ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాదికాలంపాటు జరిగిన రైతు మహా ఉద్యమానికి సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వం వహించింది. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదా ప్రతులను ఈనెల 13న రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాలు దగ్ధం చేయాలని, భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26వ తేదీన రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంజాబ్ రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాలు ట్రాక్టర్ ర్యాలీలు నిర్వహించాలని మహాపంచాయత్ పిలుపు ఇచ్చింది. ఎస్‌కెఎం జాతీయ కౌన్సిల్ ఢిల్లీలో ఈనెల 24,25 తేదీలలో సమావేశమై భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందిస్తుంది. అదేవిధంగా శుక్రవారంనాడు (ఈ నెల 11న) ఆరుగురు ఎస్‌కెఎం సభ్యుల ప్రతినిధులతోపాటు 101మందితో రైతు జాతా ఖనౌరీ సరిహద్దుల్లోకి వెళ్ళి కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ మోర్చా, సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) నాయకత్వాన్ని కలిసి సంఘీభావం ప్రకటించి ఈ సందేశాన్ని తెలియజేయాలని కూడా మహాపంచాయత్ నిర్ణయించింది. ఎస్‌కెఎం

తరువాయి 2లో

## శంభు సరిహద్దులో

# రైతు ఆత్మహత్య



**పాటియాల :** శంభు సరిహద్దుల్లో ఆందోళనలో పాల్గొన్న 55 ఏళ్ల రైతు గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. అన్నదాతలు చేస్తున్న ఆందోళన ప్రదేశంలో మూడు వారాల్లో రైతుల ఆత్మహత్య ఘటనలు జరగడం ఇది రెండవ సారి అని రైతులు పేర్కొన్నారు. తరన్ తరన్ జిల్లా పహువింద్‌కు చెందిన రేషమ్ సింగ్ పంజాబ్, హర్యానా మధ్య ఉన్న శంభు సరిహద్దు వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. పంటలకు కేంద్రం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) హామీ ఇవ్వాలని ఒత్తిడి చేస్తూ రైతులు దాదాపు ఏడాది కాలంగా నిరసన తెలుపుతున్నారు. కాగా, రేషమ్ సింగ్‌ను పాటియాలాలోని రాజేంద్ర ఆసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ ఆయన మరణించారని రైతులు తెలిపారు. తాము సుదీర్ఘంగా నిరసన

తరువాయి 2లో

# ఒకే యాప్‌తో పలు టికెట్లు...

'మీ టికెట్' యాప్'ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్



ఆర్‌టిసి, మెట్రో, పార్కులు, రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో దర్శనం, ఇతర సేవలకు సంబంధించిన అన్ని టికెట్లను ఒకే వేదిక ద్వారా పొందేలా రూపొందించిన " మీ టికెట్'యాప్''ను ప్రభుత్వం అందుబాటులోనికి తీసుకొచ్చింది. తెలంగాణ డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరీ(ఇఎస్‌డి ) రూపొందించిన 'మీ టికెట్' యాప్‌ను ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హైదరాబాద్, సచివాలయంలో గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక స్థలాల్లో క్యూలైన్లలో నిరీక్షించాల్సిన అవసరం లేకుండా ఎంట్రీ టికెట్లను ఒకే ఒక్క క్లిక్ తో మీసేవ రూపొందించిన టికెట్ యాప్ లో బుక్ చేసుకోవచ్చన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించాలన్నదే సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, టెక్నాలజీ సాయంతో పౌర సేవలను ప్రజల ముంగిటకు చేరవేస్తున్నామని చెప్పారు. ఈ ప్రక్రియలో సంబంధిత నిపుణులను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. అన్ని రకాల టికెట్ బుకింగ్స్‌కు ఒకే ప్లాట్ ఫామ్‌పైకి తెచ్చేందుకు వీలుగా ఈ యాప్ ను రూపొందించామని, రాబోయే రోజుల్లో ఇలాంటి తరహా యాప్ లను మరిన్ని అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు. ఈ యాప్ లో తెలంగాణ

తరువాయి 2లో

# 'భూ భారతి'కి గవర్నర్ ఆమోదం

వీలైనంత త్వరలోనే అమలు

ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందిస్తాం

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్



శాసనసభ ఉభయ సభలు ఆమోదించిన చరిత్రాత్మకమైన భూభారతి బిల్లుపై గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆమోదముద్ర వేశారు. భూభారతికి సంబంధించిన మార్గదర్శకాలను రూపొందించి, త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం 'భూభారతి చట్టాన్ని ' అమలులోనికి తీసుకురానుంది. ఈ మేరకు గవర్నర్ ఆమోదించిన భూభారతి బిల్లును రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి హైదరాబాద్, సచివాలయంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ గురువారం అందజేశారు. ఈ చట్టాన్ని త్వరలోనే అమలులోనికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలనే ఆశయంతో భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టామని, రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా ఈ చట్టాన్ని రూపొందించామని వివరించారు. రెవెన్యూ చట్టం2020 వల్ల తెలంగాణ రాష్ట్రంలో సామాన్య ప్రజలు, రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నా రని, ఈ చట్టం తీసుకొచ్చి మూడు సంవత్సరాలు గడచినప్పటికీ, దీనికి సంబంధించి విధి విధానాలను రూపొందించలేదని,

తరువాయి 2లో



# 6,432 ప్రత్యేక బస్సులు

సంక్రాంతికి ప్రయాణికులను సొంతూళ్ళకు చేర్చేందుకు టిజిఆర్‌టిసి సన్నద్ధం

టిక్కెట్ ధరలను సవరించిన యాజమాన్యం

ప్రజాపక్షం/హైదరాబాద్

సంక్రాంతి నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ (టిజిఆర్‌టిసి) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు ప్రధానంగా ఈ నెల 10, 11, 12 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండడంతో 6432 ప్రత్యేక బస్సులను నడపాలని ఆర్‌టిసి యాజమాన్యం నిర్ణయించింది. అలాగే తిరుగు ప్రయాణం కోసం ఈ నెల 19, 20 తేదీల్లో రద్దీకి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజిబిఎస్, జెబిఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్‌బి నగర్ క్రాస్‌రోడ్స్, కెపిహెచ్‌బి, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. వివిధ ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం,

తరువాయి 2లో

# చత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ముగ్గురు నక్సలైట్లు హతం

**న్యూఢిల్లీ :** చత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. సుక్మా జిల్లాలో బీజాపూర్ సరిహద్దు వద్ద భద్రతా బలగాలు, నక్సలైట్లకు మధ్య గురువారం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. భద్రతా సిబ్బంది గురువారం ఉదయం సుక్మాబీజాపూర్ సరిహద్దులోని అటవీప్రాంతంలో నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు నక్సలైట్లు హతమయ్యారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సుక్మా ఎస్‌పి కిరణ్ చావన్ తెలిపారు. కాగా, మూడు రోజుల క్రితం చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడిన విషయం తెలిసిందే. జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులకు పేలుళ్లకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లా భేద్రే కుట్రు రహదారిలో ఐఇడి పేలుళ్లకు మావోయిస్టులు పాల్పడ్డారు. ఐఇడి పేలిన సమయంలో పోలీసుల వాహనంలో 15 మంది డిఆర్‌జి జవాన్లు ఉన్నారు. ఈ దుశ్చర్యలో 8 మంది జవాన్లతో పాటు డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి.

# ఎగ్జిక్యూటివ్, శాసన వ్యవస్థలదే నిర్ణయం

కోటా ప్రయోజనాలు పొంది ఒకస్థాయిలో ఉన్నోళ్లకు రిజర్వేషన్లు ఉండాలా? వద్దా? అనే విషయంపై 'సుప్రీం' స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** రిజర్వేషన్ల ప్రయోజనాలను పొంది, ఇతరులతో పోటీపడే స్థితిలో ఉన్న వ్యక్తులను రిజర్వేషన్ల నుంచి మినహాయించాలా? వద్దా ? అనేది కార్యనిర్వాహక, శాసనవ్యవస్థలు నిర్ణయిస్తాయని గురువారం సుప్రీంకోర్టు పేర్కొంది. గత ఏడాది ఆగస్టులో ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్. గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జిమాసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.'గత 75సంవత్సరాల కాలాన్ని పరిగణనలోనికి తీసుకుని మేం మా అభిప్రాయాన్ని తెలియజేశాం. ఇప్పటికే ప్రయోజనాలను పొంది ఇతరులతో పోటీపడే వ్యక్తులను రిజర్వేషన్ల నుంచి మినహాయించాలనే అభిప్రాయాన్ని మేం ఇవ్వడం జరిగింది. కానీ ఎగ్జిక్యూటివ్, శాసనసభ ద్వారా తీసుకోవాల్సిన పిలుపు' అని జస్టిస్ గవాయి అన్నారు. రాజ్యాంగ ధర్మాసనం మెజారిటీ

తరువాయి 2లో

# విస్తరించిన దావానలం



బ్యాంకులు, స్కూళ్ళు, కేఫ్‌లు, మార్కెట్లు దగ్ధం

ఎల్.ఎలో ఐదుగురు మృతి

ఇళ్ళు ఖాళీచేసిన 1.37 లక్షలమంది

1000 భవంతులు భస్మం : నీటి కొరత

**లాస్‌ఏంజెల్స్ :** అమెరికా లాస్ ఏంజెల్స్ (ఎల్.ఎ)లో దావానలం గురువారంనాటికి మరింత విస్తరించింది. ఈ దావానలంలో ఇప్పటివరకూ ఐదుగురు మరణించగా అనేక మంది గాయపడ్డారు. 1,37,000 మంది నివాసితులను ఇళ్ళు ఖాళీ చేయించి ఇతర ప్రాంతాలకు తరలించారు. పసిఫిక్ పాలిసేడ్స్‌లో దావానల భీతావహం కారణంగా 1000 భవంతులు భస్మీపటలమయ్యాయి. ''శాంతా అనా విండ్స్'' గంటకు ఆరవై కి.మీ వేగంతో గాలులు వీస్తూ ఉండటంతో కార్చిచ్చు శరవేగంగా విస్తరిస్తోంది. హాలీవుడ్‌హిల్స్‌లో మాత్రం గంటకు 130 కి.మీ వేగంతో గాలులు వీస్తున్నాయి. బ్యాంకులు, స్కూళ్ళు, కేఫ్‌లు, సూపర్ మార్కెట్లు, మాల్స్, కార్లు, ఇతర వాహనాలు, పలు ఇతర కీలక నిర్మాణాలను దావానలం మింగేసింది. గొలుసు దుకాణాలు, కార్పొరేట్ చైన్ మార్కెట్లన్నీ భస్మమయ్యాయి. భయంకరమైన అగ్నికీలలకారణంగా లాస్ ఏంజెల్స్‌లో అస్తమించే సూర్యుడు అతిపెద్ద అగ్నిగోళంగా కనిపించాడని ప్రత్యక్షసాక్షులు చెప్పారు. ఇళ్ళు ఖాళీచేసేందుకు పెద్దసంఖ్యలో వృద్ధులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. హాలీవుడ్‌కు కార్చిచ్చు పెద్ద ముప్పుగా పరిణమించింది. పాలిసేడ్స్‌లో 17,200 ఎకరాలు, ఈటెన్‌లో 10,600 ఎకరాలు, హర్ట్స్‌నగరంలో 855 ఎకరాలు,

తరువాయి 12లో

## తిరుపతి తొక్కిసలాట ఘటన

# ఇద్దరు అధికారులపై వేటు

మరో ముగ్గురి బదిలీ

న్యాయ విచారణకు ఎపి సిఎం చంద్రబాబు ఆదేశం

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, ఇంటికో ఉద్యోగం



**తిరుపతి:** తిరుపతిలో బైరాగి పట్టెడ పార్కు వద్ద బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. అక్కడ విధుల్లో నిర్లక్ష్యం వహించిన డిఎస్‌పి రమణ కుమార్, గోశాల ఇంఛార్జ్ హరినాథ్‌రెడ్డిలను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. దుర్ఘటనలో పర్యవేక్షణ లోపాన్ని గుర్తించి... ఎస్‌పి సుబ్బరాయుడు, టిటిడి జెఇఒ గౌతమి, సివిఎస్‌ఒ శ్రీధర్ లను బదిలీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొక్కిసలాట ఘటనపై న్యాయ విచారణకు ఆదేశిస్తున్నట్లు వెల్లడించారు. బుధవారం రాత్రి పద్మావతి పార్క్ వద్ద తిరుమలలో వేంకటేశ్వరస్వామి వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల కోసం జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మతి చెందిన సంగతి తెలిసిందే. దీనిపై తొలుత అమరావతి నుంచే సమీక్షించిన సిఎం చంద్రబాబు గురువారం మధ్యాహ్నం తిరుపతికి

తరువాయి 12లో

# యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు

నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆరోగ్యశ్రీ చర్చలు సఫలం

ప్రజాపక్షం/హైదరాబాద్

'ప్రైవేట్,కార్పొరేట్' హాస్పిటల్స్‌లలో ఆరోగ్యశ్రీ సేవలు యథావిధిగా కొనసాగనున్నాయి. నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఆరోగ్య శ్రీ సిఇఒ శివ శంకర్ గురువారం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. సేవలను అందించేందుకు హాస్పిటల్స్ ప్రతినిధులు అంగీకరించారు.పెండింగ్ బకాయిలను చెల్లించే వరకు ఆరోగ్య శ్రీ వైద్య సేవలను నిలిపివేస్తున్నట్టు నెట్‌వర్క్ హాస్పిటల్స్ స్పష్టం చేశాయి. గత ప్రభుత్వం నుంచి బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని

తరువాయి 2లో

# గాజా సమస్యకు దగ్గరలోనే పరిష్కారం?

**గాజా :** గాజాలో యుద్ధ విరమణకు వీలుగా జరుగుతున్న చర్చలు కాల్పుల విరమణ ఒప్పందానికి చేరువ అవుతున్నాయని చర్చల్లో ఉన్న అమెరికా మధ్యవర్తిత్వ ప్రతినిధులు చెప్పారు. డోనాల్డ్ ట్రంప్ మరో పది రోజుల్లో అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపడతారు. ట్రంప్ కోరుకున్నట్లుగా లోపే ఒక ఒప్పందం జరిగే అవకాశాలు కనిపిస్తున్నప్పటికీ హమాస్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు ఏమాత్రం సడలలేదు. వారిమధ్య పరస్పర దాడులవల్ల ఆటంకాలు ఎదురవుతున్నాయి. ముగ్గురు ఇజ్రాయెల్ సైనికులను హమాస్ ఉగ్రవాదులు సంహరించగా, ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో డ్రోన్ దాడి చేసి ముగ్గురు పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ సైన్యం చంపింది. మరోవైపు గత ఏడాది అక్టోబరులో హమాస్ బందీగా తీసుకుపోయిన ఇజ్రాయెలుకు చెందిన యూసుఫ్ కుమారుడు గాజా టన్నెల్‌లో శవమై కనిపించాడు. అతడి మృతదేహాన్ని ఇజ్రాయెల్ సైన్యం స్వాధీనం చేసుకుంది. గడచిన 15 నెలలుగా గాజాలో జరుగుతున్న మారణహోమంలో 46వేలమంది పాలస్తీనియన్లు మరణించగా 401 మంది ఇజ్రాయెల్ సైనికులు మరణించారు. కాగా గడచిన 24 గంటలో ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దాడుల్లో 70 మంది పాలస్తీనియన్లుమరణించగా మరో 104 మంది గాయపడ్డారు.



# హెచ్‌ఎంపివి నియంత్రణకు 'గర్డాసిల్ వాక్సిన్' : చైనా ఆమోదం

**ఇస్లామాబాద్ :** చైనా సహా పలు పొరుగు దేశాలలో ఫ్లూ తరహా హెచ్‌ఎంపివి వైరస్ విస్తరిస్తున్నది. ఇప్పటికీ సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం కోవిడ్–19 ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన తర్వాత మళ్ళీ ఈ హెచ్‌ఎంపివి విస్తరణ మొదలైంది. హ్యూమన్ మెటా న్యూమో వైరస్‌గా చైనా దీనిని పిలుస్తున్నది. తీవ్రమైన దగ్గు, ముక్కు ధారాపాతంగా కారిపోవడం, ముక్కు పూడుకుపోవడం, విపరీతమైన జ్వరం ఈ హెచ్‌ఎంపివి లక్షణాలు. పిల్లలు, పెద్దలు, వృద్ధుల్లో ఇది ప్రమాదకరమైన న్యుమోనియా సమస్యకు దారితీస్తుంది. స్పర్శ ద్వారా, డైరెక్ట్ టచ్ ద్వారా ఈ వ్యాధి ఇతరులకు సోకుతుంది. ఇది కేవలం సీజనల్ వ్యాధి మాత్రమేనని, దీనివల్ల ఎలాంటి ప్రమాదం లేదని చైనా ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనికి ఇప్పటికే మందులు ఉన్నాయి. ఐతే కొత్తగా 9 నుండి 26 లోపు వయసు గల మగవారికి చెల్లుబాటయ్యేలా గర్డాసిల్ వాక్సిన్ను మార్కెట్‌లోకి తీసుకువచ్చేందుకు తాజాగా చైనా ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. ఈ వ్యాక్సిన్‌ల్లో 51 మిలియన్ల చైనా మహిళలకు మేలు జరుగుతుందన్నారు. మెర్క్ షార్ప్ అండ్ ధోమ్ అనే కంపెనీ గురువారంనాడు ఈ విషయం వెల్లడించింది. 2030 నాటికి హెల్తీ చైనా విజన్ దాన్ని అమలు చేసేందుకు ఈ టీకా తీసుకువచ్చినట్లు కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తియాన్ అన్నా చెప్పారు.







# లెబనాన్ అధ్యక్షుడుగా జోసఫ్ ఔన్

## అమెరికాసహా నాలుగు దేశాల మద్దతు



**బీరూట్ :** లెబనాన్ అధ్యక్ష పదవికి జోసఫ్ ఔన్ ఎన్నికయ్యారు. గురువారంనాడు లెబనాన్ పార్లమెంటులో రెండో విడత జరిగిన ఓటింగ్ ప్రక్రియలో జోసఫ్ ఔన్ అధ్యక్ష పదవికి కావాల్సినంత మెజారిటీ సాధించారు. పశ్చిమ ఆసియాలో సిరియా సరిహద్దుల్లో ఉన్న లెబనాన్‌లో మూడేళ్ళుగా దేశ అధ్యక్షపదవి ఖాళీగా ఉంది. జోసఫ్ ఔన్ (60) ఇప్పటివరకూ దేశానికి ప్రధాన ఆర్మీ కమాండర్‌గా వ్యవహరిస్తున్నారు. జనవరి 11 శుక్రవారంనాడు ఆయన 61వ జన్మదినం కావడంతో ఈ పదవి ఆయనకు ఒక పెద్ద బహుమతిగా, అంతకంటే అతిపెద్ద బాధ్యతగా లభించినట్లయింది. 2017లో ఔన్ ఆర్మీ కమాండర్ బాధ్యతలు చేపట్టారు. బనాన్ పార్లమెంటులో 126 ఎంపీ స్థానాలు ఉండగా అధ్యక్షుడు విజయం సాధించేందుకు 86 మంది ఎంపీల మద్దతు ఉండాలి. దేశాధ్యక్ష పదవికి ఎన్నిక కేవలం లాంఛనప్రాయంగా జరిగింది. అమెరికా, కింగ్డమ్ ఆఫ్ సౌదీ అరేబియా, ఫ్రాన్స్,ఈజిప్టు దేశాలు జోసఫ్ ఔన్ అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టేందుకు ఇప్పటికే పూర్తి మద్దతు తెలియజేశాయి. హిజ్బుల్లా ప్రభావాన్ని లెబనాన్‌లో తగ్గించేందుకు సైన్యానికి ఆర్థికంగా మద్దతు ఇవ్వాలన్నది అమెరికా విధానం. ఐతే ఈ అధ్యక్ష ఎన్నికల్లో హిజ్బుల్లా ఉగ్రవాదులు మద్దతు ఇచ్చిన అధ్యక్ష అభ్యర్థి సులేమాన్ ఫ్రాంగియాహ్ పోటీ నుండి తప్పుకున్నారు. హిజ్బుల్లా కూడా తొలుత ఆయనకు మద్దతు ఉపసంహరించుకుంది. దీంతో దాదాపు ఏకాభిప్రాయంగా ఈ తంతు నడిచింది. పార్లమెంటు స్పీకర్‌గా వ్యవహరిస్తున్న నబిహ్ బెర్రీ దేశంలో షియా తెగలకు చెందిన అమల్ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నారు. హిజ్బుల్లాతో ఈ అమల్ ఉద్యమానికి మిత్రుత్వం ఉంది. అందువల్లనే జోసఫ్ అమన్ దేశాధ్యక్ష పదవి చేపట్టకుండా ఇన్నాళ్ళూ స్పీకర్ నబిహ్ బెర్రీ అడ్డుపడ్డారు. తాము బలపరచిన అభ్యర్థి సులేమాన్‌ను దేశాధ్యక్షుణ్ణి చేయాలనుకున్నారు. కానీ జోసెఫ్ ఔన్‌కు మద్దకతుగా నాలుగు దేశాలు ఉమ్మడి నిర్ణయం తీసుకున్నాయి. దేశంలో రాజకీయ ప్రతిష్టంభనకు స్వస్తి చెప్పాలని ఫ్రాన్స్, సౌదీ అరేబియా ప్రభుత్వాల ప్రతినిధులు స్పీకర్‌ను కలుసుకుని ఆయననుకు నచ్చజెప్పారు. ఔన్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. కాగా లెబనాన్‌లో పవర్ షేరింగ్ విధానం అమలులో ఉంది. కొత్త అధ్యక్షుడు పదవిలోకి వచ్చాక ప్రధానమంత్రిని ముస్లింలలో సున్నీ తెగకు చెందినవారిని ఎన్నుకోవలసి ఉంటుంది.

# పాకిస్థాన్‌లో 16 మంది కార్మికులు కిడ్నాప్





**పెషావర్ :** పాకిస్థాన్‌లో 16 మంది కార్మికులు కిడ్నాప్‌కు గురయ్యారు. ఖైబర్ పక్తుంఖ్వా రాష్ట్రం లక్కీ మార్వాత్ జిల్లాలో ఉన్న ఆటమిక్ ఎనర్జీ గని ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మికులను గుర్తు తెలియని సాయుధ దుండగులు అపరించి తీసుకువెళ్ళారు. యురేనియం, ఫ్లుటోనియం తవ్వకాల గనిలో ఈ కార్మికులు పనిచేస్తున్నారు. ఒక వాహనంలో సాయుధులు వారిని తీసుకుపోయారు. తర్వాత ఒకచోట ఆ వాహనాన్ని దగ్ధం చేసి కార్మికులను గుర్తుతెలియని ప్రాంతానికి తరలించారు. తెహ్రిక్–ఎ–తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) ఉగ్రవాదులు ఈ ప్రాంతంలో క్రియాశీలంగా పనిచేస్తున్నారు. గతంలో కూడా వారే ఇలాంటి కిడ్నాప్‌లకు పాల్పడ్డారు. ఈ టిటిపి ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థకు ఎంతో సన్నిహితమైనదని పాకిస్థాన్ భావిస్తున్నది. పాకిస్థాన్ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో తీవ్రమైన హింసాత్మక దాడులకు టిటిపి పాల్పడుతూ వస్తోంది. గత ఏడాది జులైలో కూడా ఖైబర్ పక్తుంఖ్వా అధికారులు ఉద్యోగులకు ట్రావెల్ వార్నింగ్ ఇచ్చారు. గతంలో అనేకమంది ఉద్యోగులు, కార్మికులు కిడ్నాప్‌కు గురయ్యారు.గడచిన నవంబరులో పోలీసు అధికారులను కిడ్నాప్ చేశారు.

# ఉక్రేన్‌పై రష్యా దాడి:13 మంది మృతి



**కీవ్ :** ఉక్రేన్‌పై రష్యా గురువారం చేసిన దాడుల్లో 13 మంది మరణించారు. మరో 113 మంది గాయపడ్డారు. జపోరిఝియా నగరంపై రష్యా క్షిపణిదాడులు చేసినట్లు అధికారులు చెప్పారు. ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ తన టెలిగ్రామ్ ఛానల్‌లో ఈ దాడులకు సంబంధించిన దృశ్యాలను పోస్టు చేశారు. రష్యా తరచు ఉక్రేన్ జనావాసాలపై దాడులు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రెండో ప్రపంచయుద్ధం తర్వాత యూరప్‌లో జరుగుతున్న అతిపెద్ద యుద్ధం ఇదే. రష్యా అత్యంత క్రూరంగా ఈ దాడి చేసిందని జెలెన్స్కీ టెలిగ్రామ్ ఛానల్‌లో పేర్కొన్నారు. కాగా ఉక్రేన్ కూడా రష్యాలోని కుర్క్స్ రీజియన్‌లో ఆకస్మిక దాడులు చేశాయి. జనవరి 9వ తేదీ నాటికి ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధానికి 1,050 రోజులు పూర్తయ్యాయి.

# ఛాడ్ అధ్యక్షభవనంపై దాడి విఫలం

## 19 మంది మృతి



**ఎన్‌డిజమెనా :** ఉత్తర–సెంట్రల్ ఆఫ్రికా మధ్యప్రాంతదేశం రిపబ్లిక్ ఆఫ్ ఛాడ్ అధ్యక్ష భవనంపై సాయుధులు దాడికి పాల్పడ్డారు. అధ్యక్ష భవనాన్ని స్వాధీనం చేసుకునేందుకు జరిగిన ఈ ప్రయత్నం విఫలమైంది. ఈ దాడికి పాల్పడిన 24 మందిలో 18 మంది సాయుధులను ఛాడ్ భద్రతా దళాలు కాల్చి చంపాయి. ఈ కాల్పుల్లో భద్రతా దళాలకు చెందిన ఒకరు మరణించారని ఛాడ్ విదేశాంగమంత్రి అబ్దెరమన్ కౌలమల్లా గురువారంనాడు చెప్పారు. బుధవారం సాయంత్రం సాయుధులు ఈ దాడికి పాల్పడ్డారని చెప్పారు.ఈ దాడిలో మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ చాడ్‌లో పర్యటిస్తున్న సమయంలోనే సాయుధుల దాడి జరిగింది. ఈ దాడికి కొద్ది గంటల ముందుగానే అధ్యక్ష భవనంలో వాంగ్ యీ సమావేశం పూర్తిచేసి వెళ్ళారు. 1990 ఆరంభంలో సైనిక కుట్ర ద్వారా అధికారం స్వాధీనం చేసుకున్న ఇద్రిస్ దెబీని 2021లో తిరుగుబాటుదారులు కాల్చి చంపారు. ఆ తర్వాత ఆయన కుమారుడు మామత్ ఇద్రిస్ దెబీ దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టారు.

## ఒకే యాప్‌తో పలు టికెట్లు...

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని 15 ప్రముఖ దేవాలయాలు, 129 పార్కులు, 54 బోటింగ్ ప్రదేశాలు, జూ, మెట్రో, ఆర్‌టిసి, మ్యూజియాలు, ప్లే అండ్ ఎంటర్ టైన్‌మెంట్ జోన్స్‌కు సంబంధించిన టికెట్లను పొందవచ్చని, అలాగే జిహెచ్‌ఎంసి పరిధిలోని కమ్యూనిటీ హాల్స్, జిమ్ లు, స్పోర్ట్ కాంప్లెక్స్‌లను బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. ఎంచుకున్న లొకేషన్‌కు సమీప ప్రాంతాల్లోని చూడదగిన ప్రదేశాలకు సంబంధించిన సమాచారం కూడా ఈ యాప్‌లో ఆటోమేటిక్ గా కనిపిస్తుందన్నారు. ఈ యాప్ ను చాలా సులువుగా వినియోగించుకోవచ్చని, యుపిఐ ద్వారా చెల్లింపులు కూడా చేయవచ్చని, ఇతర ప్లాట్ ఫామ్‌ల తరహా ఈ యాప్ లో అదనంగా ఎలాంటి ఛార్జీలను వసూలు చేయబోమని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. ఈ కార్యక్రమంలో 'మీ సేవ ' కమిషనర్ రవికిరణ్, పరిశ్రమల శాఖ కమిషనర్ డా.జి.మల్సూర్, జూపార్క్స్ డైరెక్టర్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఆత్మహత్య (మొదటి పేజీ తరువాయి)

తెలుపుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోవడం పట్ల రేషమ్ సింగ్ అసంతృప్తి చెందారని రైతు నాయకుడు తేజ్‌వీర్ సింగ్ అన్నారు. డిసెంబర్ 18న శంభు సరిహద్దులో మరో రైతు రంజోద్ సింగ్ ఆత్మహత్య చేసుకున్నాడు. నవంబర్ 26 నుండి ఖనౌరి సరిహద్దులో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ (70) ఆరోగ్యం క్షీణించడం చూసి రంజోద్ సింగ్ తీవ్రంగా ఆందోళన చెందాడు. సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చా బ్యానర్ కింద, రైతులు ఫిబ్రవరి 13 నుండి పంజాబ్–హర్యానా మధ్య శంభుష ఖనౌరి సరిహద్దు పాయింట్ల వద్ద మకాం వేసిన విషయం తెలిసిందే.

## ఆరోగ్య శ్రీ సేవలు (మొదటి పేజీ తరువాయి)

నెట్వర్క్ హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ దృష్టికి తీసుకెళ్లాయి. దీనిపైన స్పందించిన ఆరోగ్య శ్రీ సిఇఒ వెంటనే నెట్వర్క్ హాస్పిటల్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. పేషెంట్లకు ఇబ్బంది కలిగించకుండా వైద్య సేవలు అందించాలని ఆయన ప్రైవేటు హాస్పిటల్స్ ప్రతినిధులను విజ్ఞప్తి చేశారు. ఒక సంవత్సర కాలంలో రూ 1130 కోట్ల ఆరోగ్యశ్రీ బిల్లులను చెల్లించామని,పైగా 2013 నుంచి పెండింగ్‌లో ఉన్న వైద్య చికిత్సల ధరలను సగటున 22 శాతానికి పెంచిన విషయాన్ని శివశంకర్ తెలిపారు. శుక్రవారం నుంచి యథావిధిగా సేవలను కొనసాగిస్తామని నెట్వర్క్ హాస్పిటల్ ప్రతినిధులు స్పష్టం చేశారు. కాగా గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 730 కోట్ల బకాయిలు ఉన్నట్టు తెలిసింది.

## 6432 ప్రత్యేక బస్సులు

(మొదటి పేజీ తరువాయి)

తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. సంక్రాంతి పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు ప్రభుత్వ జిఓ ప్రకారం 1.50 వరకు టికెట్ ధరలను టిజిఆర్‌టిసి యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 10, 11, 12 తేదీలతోపాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 19, 20 తేదిల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం యథావిధిగా అమల్లో ఉంటుంది. టిజిఆర్‌టిసి బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను www.tgsrtcbus.in వెబ్ సైట్‌లో చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. సంక్రాంతి ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్‌టిసి కాల్ సెంటర్‌లోని 04069440000, 04023450033 నంబర్లను సంప్రదించాలని ఆర్‌టిసి సూచించింది.

## ఏకమవుదాం రండి

(మొదటి పేజీ తరువాయి)

సీనియర్ నాయకుడు ప్రేమ్ సింగ్ భంగు మాట్లాడుతూ, మోగాలో రైతు మహాపంచాయత్ దేశంలోని అన్ని రైతు సంఘాలకు చాలా స్పష్టమైన సందేశం ఇచ్చిందని అన్నారు. రైతు సంఘాలన్నీ ఒకే వేదికపైకి వచ్చి పోరాటం చేయాలని కోరుతున్నామన్నారు. రైతు సంఘాలన్నీ ఐక్యమై కేంద్రంలో రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కార్పొరేట్ శక్తుల అనుకూల ప్రభుత్వంపై ఉమ్మడి పోరాటం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న రైతులందరూ విశాలప్రాతిపదికపై ఏకమై పోరాడితేతప్ప అనుకున్న డిమాండ్లను సాధించలేమని ఆయన అన్నారు. ''అందువల్ల ఈరోజున మన మోగా ర్యాలీ వేదికపైనుండి పంజాబ్ రైతులకు చేస్తున్న విజ్ఞప్తి ఒక్కటే, మనందరం ఐక్యం కావాలి, ఉమ్మడి సమస్యలపై వేరు వేరుగా మనం పోరాటాలు చెయ్యొద్దు'' అని ప్రేమ్‌సింగ్ భంగు అన్నారు. ఇలా ఐక్యంగా పోరాడినప్పుడే రైతు సమస్యలపై చర్చలు ప్రారంభించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేగలుగుతామని, ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగజిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడుకోగలుగుతామన్నారు. ''గతంలో కార్పొరేట్ రంగం సహాయంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రైతుల ఒత్తిడితో రద్దు చేశారు. కానీ ఇప్పుడు అవే చట్టాలు 'జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ముసాయిదా' పేరుతో కొత్త రూపంలో మన ముందుకు వచ్చాయి, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం ఈ విధానాన్ని కూడా తిరస్కరించాలి, రాష్ట్ర అసెంబ్లీలో దీనిని ప్రశ్నించాలి'' అని ఆయన అన్నారు.పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ తోపాటు ఆయన మంత్రివర్గంలో ఉన్న మంత్రులందరూ వారితోపాటు శాసనసభ్యులు, ఆమ్ ఆద్మీపార్టీ ఎంపీలు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశం జరిపేందుకు కొంత సమయం తీసుకుని ఆయనను కలిసి ఈ విషయాలపై చర్చించాలి, రైతుల డిమాండ్ల గురించి ప్రధానమంత్రికి వారు చెప్పాలి, ఒకవేళ ప్రధానమంత్రి గనుక వారిని కలుసుకునేందుకు సమయం ఇవ్వకపోతే వారు ఢిల్లీ వెళ్ళి ధర్నా చేయాలి'' అని భారతీయ కిసాన్ యూనియన్ (లోఖోవాల్) నాయకుడు, ఎస్‌కెఎం సీనియర్ నాయకుడు హరిందర్ సింగ్ లోకోవాల్ కోరారు.

''డల్లేవాల్ ప్రాణాలను కాపాడే సమస్యపై సుప్రీం కోర్టు విచారణ చేస్తున్నది, కేంద్ర ప్రభుత్వానికి కోర్టు తగిన మార్గదర్శకాలు జారీ చేస్తుంది, ఇప్పటికే కేంద్రం అంగీకరించిన రైతుల డిమాండ్లను సమ్మతించే విషయంలో కోర్టు మార్గదర్శకాలు జారీ చేస్తుంది, రాష్ట్రపతిని కూడా కలిసిమాట్లాడేందుకు, రైతుల పరిస్థితులు వివరించేందుకు ఆమెను సమయం ఇవ్వాలని అడిగాం, ఆమె కూడా సమయం ఇస్తారు'' అని ఆయన చెప్పారు. కాగా ఈ మహాపంచాయత్‌లో ప్రసంగించిన ప్రముఖులలో బికెయు (ఏక్తా–ఉగ్రాన్) అధ్యక్షుడు జోగిందర్ సింగ్ ఉగ్రహాన్, బికెయు (రాజేవాల్) నాయకుడు బల్బీర్ సింగ్ రాజేవాల్, బికెయు (లోఖోవాల్) హరిందర్ సింగ్ లోఖోవాల్, బికెయు అధికార ప్రతినిధి రాకేశ్ తికాయత్, బికెయు (కదియన్) నాయకుడు హర్మీత్ సింగ్ కెదియన్ తదితరులు ప్రసంగించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను పార్లమెంటు స్థాయిసంఘం పూర్తిగా విస్మరించిందనీ, ఎంఎస్‌పిపైన, పంటల సేకరణ హామీలపైన అసంపూర్ణ సిఫార్సులు చేసిందనీ విమర్శించారు. ఎస్‌కెఎం ఈ సిఫార్సులను తిరస్కరించిందనీ, దీర్ఘకాలిక ఉద్యమానికి రైతులు సిద్ధపడ్డారనీ రైతు నాయకులు చెప్పారు.

## గవర్నర్ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

భూ సమస్యలు లేని గ్రామం తెలంగాణ రాష్ట్రంలోనే లేదని, గత ప్రభుత్వం తమ వ్యక్తిగత స్వార్థం, ప్రయోజనాల కోసమే రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో కొందరికే పరిమితమైన రెవెన్యూ సేవలను గ్రామస్థాయి వరకు అందించేందుకు తమ ప్రభుత్వం విస్తృతమైన చర్యలు చేపట్టిందని, గ్రామాలలో రెవెన్యూ పాలన నిమిత్తం ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామని, ఇందుకు సంబంధించిన కసరత్తు కొలిక్కివచ్చిందని వివరించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా రెవెన్యూ విభాగం పని చేయాలని, రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేయాలన్నదే తమ ప్రభుత్వ ఆకాంక్ష అని, ప్రజాపాలనలో ప్రజలు కేంద్రబిందువుగా ఉంటారని, ఆ దిశగానే తమ ప్రభుత్వ నిర్ణయాలు, ఆలోచనలు ఉంటాయని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకుని సామన్య ప్రజలు సంతోషపడేలా రెవెన్యూ శాఖలో అధికారులు, సిబ్బంది సమిష్టిగా పని చేయాలి మంత్రి పొంగులేటి సూచించారు. భూభారతి బిల్లుకు ఆమోదం తెలిపినందుకు గవర్నర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ చట్టం తీసుకురావడానికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందించిన సిఎం రేవంత్ రెడ్డి , సహచర మంత్రి వర్గ సభ్యులందరికీ , ప్రజాప్రతినిధులు , రాత్రనకా, పగలనకా పనిచేసిన అధికారులు, సిబ్బందికి,పలు సలహాలు సూచనలు ఇచ్చిన మేధావులకు రాష్ట్ర భూయజమానుల తరపున ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రజలందరి అభిప్రాయాలను క్రోడీకరించి సామాన్యుల సంక్షేమమే ధ్యేయంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని, ఈ చట్టానికి సంబంధించిన విధి విధానాలను రూపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు.

## కెటిఆర్‌పై ప్రశ్నల వర్షం

(మొదటి పేజీ తరువాయి)

విచారణ కొనసాగింది. న్యాయవాదిని వెంట తీసుకువెళ్లేందుకు హైకోర్టు అనుమతి ఇవ్వడంతో కెటిఆర్ తన వెంట ఆయన న్యాయవాది రామచందర్‌రావును తీసుకువెళ్లారు. కెటిఆర్ విచారణను తిలకించేందుకు విచారణ గదిలో సిసిటివి పుటేజీలను ఏర్పాటు చేసి లైబ్రరీ గదిలో న్యాయవాది కూర్చునేలా ఎసిబి అధికారులు ఏర్పాట్లు చేశారు.

**కెటిఆర్‌పై ప్రశ్నల వర్షం**

విచారణ సందర్భంగా కెటిఆర్‌పై ఎసిబి అధికారులు ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసుకు సంబంధించి ఫిర్యాదుదారుడు మున్సిపల్‌శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, ఈ కేసులో ఎ2 నిందితుడుగా ఉన్న అప్పటి మున్సిపల్ శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి అరివింద్ కుమార్ ఇప్పటికే ఇచ్చిన వాగ్మూలాలతో పాటు మచిలీపట్నంలోని గ్రీన్‌కో, దాని అనుబంధ సంస్థల్లో జరిపిన సోదాల్లో లభించిన ఆధారాలకు సంబంధించి మాజీమంత్రి కెటిర్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. ముఖ్యంగా ఫార్ములా ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి రూ.55 కోట్ల బదిలీపై ఎసిబి అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ సమయంలో నిధుల ఎందుకు బదిలీ చేయాల్సి వచ్చింది, ఆర్‌బిఐ అనుమతులు లేకుండా ఎందుకు చెల్లింపులు చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయని అధికారులు ముందే చెప్పినా వాటిని పట్టించుకోకుండా ఎందుకు ఒత్తిడి తెచ్చారని, పలు ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం.

**ఇది రాజకీయ కక్షపూరిత కేసు : కెటిఆర్**

విచారణ అనంతరం ఎసిబి కార్యాలయం నుంచి బయటికి వచ్చిన మాజీ మంత్రి కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ ఇది రాజకీయ కక్షపూరిత కేసు అన్నారు. కెటిఆర్ ఎసిబి కార్యాలయం ఎదుట మీడియా మాట్లాడుతుండగా మీడియా పాయింట్ వద్ద మాట్లాడాల్సింది డిసిపి విజయ్‌కుమార్ కెటిఆర్‌కు సూచించారు., ఇక్కడ మాట్లాడితే రోడ్డుపై ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రయాణికులు ఇబ్బంది కల్గుతుందని డిసిపి వారించారు. దీంతో ఒక్కసారిగా అసహనానికి గురైన కెటిఆర్ తను మీడియాతో మాట్లాడితే మీకెందుకంటూ విరుచుపడ్డారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లి కెటిఆర్ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. ఎసిబి అధికారులకు పూర్తిగా సహకరించనని, వారు అడిగిన అన్ని ప్రశ్నలకు తనకు ఉన్న అవగాహన మేరకు అన్ని సమాధానాలు చెప్పానని వెల్లడించారు. వారు కొత్తగా అడిగింది ఏమి లేదన్నారు. ఎసిబి విచారణకు అధికారులు ఎప్పుడు పిలిచినా హాజరు అవుతానని తెలిపారు. అనంతరం తెలంగాణ భవన్‌కు చేరుకున్న కెటిఆర్ అక్కడ బిఆర్‌ఎస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. గత 10 సంవత్సరాలుగా అత్యంత నిబద్ధతతో, అవినీతి రహితంగా మంత్రిగా తన బాధ్యతలు నిర్వహించినట్లు ఏసీబీకి చెప్పినని, ప్రశ్నలు అడిగే విషయంలో అధికారులే ఇబ్బంది పడ్డారని, ఎందుకంటే కేసులో ఎలాంటి అవినీతి లేదన్నారు.

**క్వాష్ పిటిషన్ తక్షణ విచారణకు సుప్రీం నిరాకరణ**

ఫార్ములా ఈ–రేసు కేసు వ్యవహారంలో కెటిఆర్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. దీనిపై తక్షణ విచారణ అవసరం లేదని సీజెఐ ధర్మాసనం అభిప్రాయపడింది. జనవరి 15న క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుపుతామని వెల్లడించింది.

## శాసన వ్యవస్థలదే నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

తీర్పుద్వారా సామాజికంగా, విద్యాపరంగా వెనకబడిన సామాజికవర్గాల అభ్యున్నతి కోసం, రిజర్వేషన్లు కల్పించడం కోసంసామాజికంగా భిన్నమైన తరగతిగా ఏర్పడే షెడ్యూల్ కులాలలో (ఎస్‌సి) ఉపవర్గీకరణ చేయడానికి రాష్ట్రాలకు రాజ్యాంగబద్ధంగా అధికారం ఉంది. రాజ్యాంగ ధర్మాసనంలో భాగమైన జస్టిస్ గవాయ్ ప్రత్యేక తీర్పును రాశారు. ఎస్‌సిలలో కూడా క్రీమిలేయర్‌ను గుర్తించే విధానాన్ని రాష్ట్రాలు రూపొందించాలని, షెడ్యూల్ ట్రైబ్ వారికీ రిజర్వేషన్ల ప్రయోజనాన్ని నిరాకరించాలని ఆయన అన్నారు. గురువారం పిటీషనర్ తరుపు న్యాయవాది మాట్లాడుతూ అటువంటి క్రీమిలేయర్‌ను గుర్తించే విధానాన్ని కోరుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. ఉపవర్గీకరణ అనుమతించదగినదేనని సుప్రీం కోర్టు అభిప్రాయమని జస్టిస్ గవాయ్ తెలిపారు.ఈ విధానాన్ని రూపొందించాలని రాజ్యాంగ ధర్మాసనం రాష్ట్రాలను ఆదేశించి దాదాపు ఆరునెలలు గడిచాయని పిటిషనర్ తరుపు న్యాయవాది తెలిపారు. కాగా 'మేం మొగ్గ చూపడంలేదు' అని ధర్మాసనం తెలిపింది. సంబంధిత అధికారం ముందు ప్రాతినిధ్యాన్ని దాఖలుచేయాలన్న అభ్యర్థనను ఉపసంహరించుకోవాలని న్యాయవాది అభ్యర్థించినప్పుడు ఆ అంశాన్ని అది నిర్ణయించవచ్చని, ధర్మాసనం దానిని అనుమతించింది అని తెలిపారు. రాష్ట్రాలు పాలసీని రూపొందించలేవని ఆయన వాదించారు. ఇవి.చెన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కేసులో 6 : 1మెజార్టీతో ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం ఎస్‌సిలకు ఉపవర్గీకరణను అనుమతించలేదు. ఎందుకంటే తాము సజాతీయ తరగతిగా ఉన్నామని చెప్పడమే అందుకు కారణం.

## సకాలంలో (మొదటి పేజీ తరువాయి)

సూచించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశాన్ని గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర మంత్రులు ధనసరి అనుసూయ సీతక్క, కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో 92351 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరికి ప్రతి నెలా రూ.116 కోట్లు జీతాలు చెల్లించాల్సి ఉందని, వీరందరికీ జీతాల చెల్లింపులో ఆలస్యం కాకుండా స్పష్టమైన విధానం అనుసరించాలని పంచాయతీ రాజ్, ఆర్థిక శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. కేంద్రం నుంచి పంచాయతీ లకు విడుదల అయ్యే నిధులు ఎప్పటికప్పుడు గ్రామాల అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ, ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకాల ద్వారా కేంద్రం నుంచి రావాల్సిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు రాబట్టుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు.

**సిఎం ఆస్ట్రేలియా పర్యటన రద్దు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆస్ట్రేలియా పర్యటన రద్దయింది. ఈనెల 14న ఢిల్లీ వెళ్లనున్నారు. 15, 16 తేదీల్లో సిఎం ఢిల్లీ పర్యటన కొనసాగనుంది. 15న ఢిల్లీలో జరిగే ఎఐసిసి కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు. ఈనెల 17న ఢిల్లీ నుంచి సింగపూర్ వెళ్లనున్నారు. 17, 18 తేదీల్లో సింగపూర్‌లో పర్యటించనున్నారు. 19న సింగపూర్ నుంచి దావోస్ వెళ్లనున్నారు. 23 వరకు దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటారని సిఎం కార్యాలయం తెలిపింది.

**విదేశీ పర్యటనకు ఎసిబి కోర్టు అనుమతి**

రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) కోర్టు అనుమతి ఇచ్చింది. ఓటుకు నోటు కేసు బెయిల్ సందర్భంగా అప్పట్లో రేవంత్‌రెడ్డి తన పాస్ పోర్టును కోర్టుకు అప్పగించారు. సింగపూర్, స్విట్జర్లాండ్ పర్యటనకు వెళ్లాల్సి ఉందని తెలిపిన సిఎం రేవంత్ రెడ్డి కోర్టుకు తెలియజేశారు. ఆరు నెలలు పాస్ పోర్టు ఇవ్వాలని రేవంత్ రెడ్డి చేసిన అభ్యర్థనకు సిబి కోర్టు అంగీకారం తెలిపింది. జులై 6లోగా పాస్ పోర్టు తిరిగి అప్పగించాలని సిఎం రేవంత్‌రెడ్డిని ఎసిబి కోర్టు ఆదేశించింది.



## బిసిలకు 42శాతం రిజర్వేషన్లు పెంచకుంటే యుద్ధమే

ఇచ్చిన మాటకు కట్టుబడి, అసెంబ్లీలో బిల్లు పెట్టాలి

జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** బిసి రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో యుద్ధం జరుగుతుందని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి రిజర్వేషన్ల పెంపుపై అసెంబ్లీలో బిల్లు పెట్టి పాస్ చేయించాలని కోరారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో జిల్లపల్లి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో బిసిలు దాదాపు 55శాతం ఉన్నారని తెలిపారు. ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారని గుర్తుచేశారు. దీన్నిబట్టి ఇప్పుడు 13 కార్పొరేషన్లకు తోడుగా మరో 40 కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం పార్లమెంట్‌లో బిసి బిల్లు పెట్టి, చట్టసభలలో బిసిలకు 50శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, బిసిల అభివృద్ధికి ప్రత్యేక స్కీములు రూపొందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించడానికి రాజ్యాంగ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిసి సంఘం నేతలు మోదీ రాందేవ్, నందగోపాల్, నిమ్మల వీరన్న, పగిళ్ల సతీశ్, ర్యాగ రమేశ్, ఉదత మల్లేశ్, రఘుపతి, రవి యాదవ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకులలో ఒకరైన

## తొలి అధ్యక్షుడు ఐజె.తల్వార్ మృతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకులలో ఒకరైన తొలి అధ్యక్షులు ఐజె.తల్వార్ బుధవారం రాత్రి మరణించారు. ఐజె.తల్వార్ 1986లో ఏర్పాటు చేసిన హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు తొలి అధ్యక్షుడిగా వ్యవహరించారు. దీర్ఘకాలం పాటు పుస్తకానికి, పుస్తక ప్రదర్శనలకు ఆయన సేవలందించారు. తల్వార్ వయస్సు ప్రస్తుతం 90 సంవత్సరాలు. అనారోగ్య కారణాలవల్ల ఆయన హైదరాబాద్‌లోని తమ నివాసంలో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తల్వార్ అంత్యక్రియలు గురువారం సికింద్రాబాద్ బన్సిలాల్‌పేట్ శ్మశానవాటికలో జరిగాయి. తల్వార్ మృతి పట్ల హైదరాబాద్ బుక్ ఫెయిర్ మాజీ అధ్యక్షులు, తెలంగాణ సాహిత్యకాడమీ మాజీ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్, హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకులు గోపాలరావు, పి రాజేశ్వరరావు, శృతికాంత్ భారతి, మాజీ కార్యదర్శి కోయ చంద్రమోహన్‌లు సంతాపాన్ని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## 16 న కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి జయంతి వేడుకలు

ఏర్పాట్లలో నిమగ్నం కావాలని అధికారులకు సిఎస్ ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ కేంద్ర మంత్రి, దివంగత నేత ఎస్. జైపాల్ రెడ్డి 83 వజయంతిని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. ఈ నెల 16వ తేదీన ఎస్. జైపాల్ రెడ్డి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో గురువారం సంబంధిత అధికారులతో సిఎస్ సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. జైపాల్ రెడ్డి జయంతి వేడుకలకు సంబంధించి నెక్లెస్ రోడ్‌లో జైపాల్ రెడ్డి మెమోరియల్ స్ఫూర్తి స్థల్‌లో అన్ని ఏర్పాట్లు చేయాలని హెచ్‌ఎండిఏ కమీషనర్ ను ఆదేశించారు. సంబంధింత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయడం ద్వారా ఏలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమానికి హాజరు కానున్న ప్రముఖులు, ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా తగు శానిటేషన్, పార్కింగ్, ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లు పక్కగా ఉండాలని ఆదేశించారు.

## 'నుమాయిష్'లో జైళ్ల శాఖ స్టాల్ షురూ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాంపల్లిలోని ఎగ్జిబిషన్‌లో మైదానంలో ఏర్పాటు చేసిన నుమాయిష్‌లో గురువారం జైలు శాఖ డిజి సౌమ్యమిశ్రా జైలు శాఖ సాల్ట్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ జైళ్ల లోని ఖైదీలు రూపొందించిన ఉత్పత్తుల వస్త్రలను ఈ స్టాళులో అందుబాటులో ఉంటాయని ఆమె తెలిపారు. ఖైదీలకు వృత్తి నైపుణ్యాలను అందించడం, జైలులో తయారు చేసిన వారి వస్తువులను అమ్మడం ద్వారా వారిని సామాజిక పునరేకీకరణలో సులభతరం చేయడం జరుగుతుందని సౌమ్య మిశ్రా పేర్కొన్నారు. ఈ చొరవ ఖైదీలకు వ్యక్తిగత అభివృద్ధి, ఆర్థిక స్వాతంత్ర్యం కోసం మార్గాలను అందించడం ద్వారా వారికి పునరావాసం కల్పించడంలో శాఖ నిబద్ధతతో ఉందన్నారు. ఈ స్టాళులో ప్రదర్శించబడిన ఉత్పత్తులు ఖైదీల పని నాణ్యత, నైపుణ్యాన్ని ప్రతిభంభిస్తాయన్నారు. తెలంగాణ జైళ్ల శాఖకు చెందిన 'మై నేషన్' స్టాల్ 2024 నుమాయిష్‌లో ప్రభుత్వ రంగం నుండి ఉత్తమ ప్రదర్శన స్టాల్ అవార్డుతో గుర్తింపు పొందిందడమే కాకుండా గత ఏడాది రూ. 20,96,133 అద్భుతమైన అమ్మకాలను సాధించిందని చెప్పారు .నుమాయిష్ 2025లో 'మై నేషన్' స్టాల్‌ను సందర్శించడం ద్వారా తమ ప్రయత్నానికి మద్దతు ఇవ్వాలని తెలంగాణ జైళ్ల శాఖ ప్రజలను హృదయపూర్వకంగా ఆహ్వానిస్తోందన్నారు. ఈ ప్రారంభోత్స కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ జైల్స్ (హైదరాబాద్ రేంజ్) డాక్టర్ డి.శ్రీనివాస్, హైదరాబాద్ జైళ్ల సూపరింటెండెంట్ ఎన్. శివకుమార్ గౌడ్, చెర్లపల్లి జైళ్ల సూపరింటెండెంట్ జి. రామచంద్రం, వివిధ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పరితపించే నాయకులను కోల్పోవడం..

# సమాజానికి, ప్రజలకు తీరని లోటు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజకీయాలు పూర్తిగా వ్యాపారమయంగా మారి, విలువలకు తిలోదకాలిస్తున్న నేపథ్యంలో సమాజ హితం, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తూ , తమ వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసిన కమ్యూనిస్టు నాయకుల మరణం సమాజానికి, ప్రజలకు తీరని లోటు అని పలువురు వక్తలు అన్నారు. పదవుల కోసం రాత్రికిరాత్రి రాజకీయ పార్టీలను, జెండాలను మార్చుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో నిబద్ధత, నిరంతరం ప్రజల కోసం పరితపించే నాయకులను కోల్పోవడం, వారి కుటుంబాల కంటే ప్రజలకు, సమాజానికే ఎక్కువగా నష్టమని, ఇటువంటి నాయకులు మళ్లీ రావడం చాలా అరుదు అని అన్నారు. సిపిఐ నాయకుడు ఎన్.బాలమల్లేష్, పోటు ప్రసాద్, డి.ఎస్.రామచంద్రరావు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. వీరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటుగా వక్తలు అభివర్ణించారు.

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్, ఖమ్మం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోటు ప్రసాద్, సిపిఐ రాష్ట్ర కార్యాలయ మాజీ కార్యదర్శి డి.ఎస్.రామచందరావులకు సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్, బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో గురువారం 'అమరుల సంతాప సభ'ను నిర్వహించారు. ఈ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు సభాధ్యతక్షత వహించగా వక్తలుగా టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరామ్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, ఆర్‌ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, సిపిఐ లిబరేషన్ (ఎం.ఎల్) రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా హాజరయ్యారు. ఈ సభకు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు సభకు స్వాగతం పలుకగా, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు పశ్యపద్మ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనర్సింహ, వి.ఎస్.బోస్, ఇ.టి.నర్సింహ, హేమంత్‌రావు, బాలమల్లేష్ సతీమణి వందన, కుమారుడు నిశంత్, పోటు ప్రసాద్ కుమారుడు సాత్విక్ తదితరులు హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందు అమరుల చిత్రపటాలకు పలువురు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం సభ కొద్ది సేపు మౌనం పాటించింది. కాగా డిహెచ్‌పిఎస్ మహాసభలో మరణించిన ఆల్ ఇండియా దళిత్ రైట్స్ మూవ్‌మెంట్ కేరళ నాయకుడు టిఆర్. విజ్జు, మేడ్చల్ జిల్లాలో మరణించి సిపిఐ నాయకులు రోయ్యల కృష్ణమూర్తి మరణం పట్ల సభలో నివాళ్లు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**కమ్యూనిస్టు పార్టీకి తమ జీవితాలను త్యాగం చేశారు : కూనంనేని**

కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీల లక్ష్యం, పెద్దలు చేసిన త్యాగాలు, ప్రజల స్థితిగతులు, ప్రజా సమస్యలకు కమ్యూనిస్టు పార్టీ సూచించే పరిష్కార మార్గాలను చూసి బాలమల్లేష్, పోటు ప్రసాద్, రాంచంద్రరావులు కమ్యూనిస్టు నాయకులుగా స్థిరపడ్డారన్నారు. వారు ఎటువంటి ప్రలోభాలకు గురి కాలేదని, అనేక రాజకీయ అవకాశాలు వచ్చినప్పటికీ కమ్యూనిస్టు పార్టీలోనే కొనసాగారని కొనియాడారు. ముగ్గురు నాయకులు కూడా తమ వ్యక్తిగత జీవితాన్ని వదిలిపెట్టి, తమ జీవితాన్ని త్యాగం చేశారని, వారి కుటుంబాలు కూడా కమ్యూనిస్టు కుటుంబాలేనని వివరించారు. బాలమల్లేష్ విద్యార్థి, యువజన సంఘం నుంచి, బిసి హక్కుల సాధన సమితి, బికెఎంయు, జిల్లా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, జాతీయ సమితి సభ్యులుగా ఎదిగారన్నారు. పోటుప్రసాద్ బలమైన ఉద్యమాన్ని నిర్మించారని, ఖమ్మం జిల్లాలో న్యాయవాదులు, వైద్యుల అనుబంధ సంఘాన్ని ఏర్పాటు చేశారన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు ఎంతో కృషి చేశారని, విద్యుత్ పోరాటంలో ప్రసాద్ ముందు నిలిచారని, లాఠీ దెబ్బలకు కూడా భయపడలేదని చెప్పారు. ప్రసాద్ నానమ్మను ఎర్రమ్మ అని పిలిచేవారని, వారికుటుంబం మొత్తం కమ్యూనిస్టు పార్టీనే అని అన్నారు. రాంచంద్రరావు చిన్న వయసులోనే సిపిఐ రాష్ట్ర పార్టీ కార్యాలయ కార్యదర్శిగా సుదీర్ఘకాలంగా పనిచేశారని, కార్యాలయానికి వచ్చే వారిని ఆయన ఆప్యాయంగా, గౌరవంగా పలకరించేవారని కూనంనేని గుర్తుచేశారు.

**కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే : కోదండరామ్**

ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ పార్టీలో చేరిన మరుసటి రోజే పదవులు కావాలని, ఏదైనా పనులు చేస్తే అందులో ఏమైనా లాభాలు వస్తాయా?, అని డబ్బుల చుట్టూ తిరిగే ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో డబ్బులే ప్రధానం కాదని, ప్రజలే ప్రధానమని ఆలోచించే కమ్యూనిస్టులు ఉండడం సమాజానికి ఎంతో అవసరమని తెలిపారు. సాటి మనిషి పట్ల ప్రేమతో, నిబద్ధతతో, ప్రజల సమస్యల పరిష్కారానికి తిరగడమే కమ్యూనిస్టు కార్యకర్తల లక్షణమని, ఆ లక్షణాలు కలిగిన వ్యక్తులు ప్రస్తుతం లేకపోవడం బాధాకరమన్నారు. ఇటువంటి కార్యకర్తలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. జెఎసిసమావేశాలు, ప్రజా ఉద్యమాలను, పార్టీ కార్యక్రమాలను బాలమల్లేష్ ఎంతో సమన్వయంతో నిర్వహించేవారని గుర్తుచేశారు. ధర్నాచౌక్ పరిరక్షణ ఉద్యమంలో రాంచంద్రరావు కూడా తన వంతు సలహాలను ఇచ్చారని గుర్తుచేశారు.

**కమ్యూనిస్టుల ఉద్యమం పునరేకీకరణ : చాడ వెంకట్ రెడ్డి**

చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టుల ఉద్యమం పునరేకీకరణ కావాలని, లేదంటే భవిష్యత్తు ఉండబోదన్నారు. చీలిపోతే చిక్కిపోతామని, విడిపోతే పడిపోతామని, కమ్యూనిస్టులే దేశానికి భవిష్యత్తు అని, కమ్యూనిస్టులు లేకుండా ప్రపంచమే లేదని అన్నారు. ఏ దేశంలో చూసినా కమ్యూనిస్టులు పురోభివృద్ధివైపు, అధికారంలోకి వస్తున్నారన్నారు. అన్ని ప్రాంతాల్లో కూడా కమ్యూనిస్టు పార్టీని విస్తరించడమే అమరులైన నాయకులకు ఇచ్చే నిజమైన నివాళి అని చాడ అన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో విలువలు పడిపోయాయని, అంకితభావం లేదని, సేవా భావం అసలే లేదని, డబ్బులే పరిపాలిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులు ఏకం కావాలన్నారు. ఖమ్మంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని ఉద్యమాన్ని నిలబెట్టడంలో పోటుప్రసాద్ పాత్ర ప్రధానమని, ఆయన నిక్కచిత మనస్తత్వమన్నారు. ప్రతి నాయకుడు కార్యకర్తల పట్ల ఎలా ఉండాలి?, ఎలా ఆప్యాయంగా పలకరించాలో రాంచంద్రరావు నుంచి నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి బాలమల్లేష్ అనేక ఉద్యమాలు చేపట్టారని గుర్తుచేశారు. విలువలు ఉన్న వారే కమ్యూనిస్టులని చెప్పారు.

**కమ్యూనిస్టులంతా ఏకమై ఉద్యమించాలి: జూలకంటి రంగారెడ్డి**

జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టులు ఏకమవ్వాలని, ప్రజా సమస్యలపైన బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించి, ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందు పెట్టాలని సూచించారు.

ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ దేశాల్లో కూడా వామపక్ష పార్టీల నాయకులు గెలుస్తున్నారని, పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎర్రజెండా, కమ్యూనిస్టు పార్టీలే ప్రత్యామ్నాయమని తెలిపారు. జానకి రాములు మాట్లాడుతూ ఎంతో భవిష్యత్ ఉన్న నాయకులు పోటు ప్రసాద్, బాలమల్లేష్ మరణం కమ్యూనిస్టు పార్టీలకు తీరని లోటు అని అన్నారు. కెసిఆర్‌ను ఓడించిన తర్వాతనే ఆయనకు కమ్యూనిస్టుల బలం తెలిసిందన్నారు. రమేష్ రాజేష్ మాట్లాడుతూ మతోన్మాద బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలన్నీ ఐక్యంగా ఉద్యమించాలన్నారు.

**బాలమల్లేష్ ఆశయాలను సాధించాలి : వందన**

వందన మాట్లాడుతూ బాలమల్లేష్ వదిలిపెట్టిన పనులను ముందుకు తీసుకెళ్లాలని, కీసర వద్ద ఉన్న భూదాన్ బోర్డ్ భూముల సమస్య పరిష్కారానికి ప్రయత్నించాలని కోరారు. అనేక రాజకీయ పార్టీలు బాలమల్లేష్‌ను ఆహ్వానించినప్పటికీ ఆయన కమ్యూనిస్టు పార్టీలోనే కొనసాగారని, పార్టీ విస్తరణకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేశారన్నారు.

బాలమల్లేష్ బతికే ఉన్నారని, ఇంకా వస్తారనే ఆలోచన తమను వెంటాడుతోందని వందన కంటతడిపెట్టారు. పోటుప్రసాద్ కుమారుడు సాకేత్ మాట్లాడుతూ కుటుంబం కంటే ఎక్కువగా ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతానికే 'నాన్న' (ప్రసాద్) ఎంతో కృషిచేశారన్నారు. ఐటి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా ఒక ఇంజనీరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞాప్తి చేశారు. కమ్యూనిస్టు పార్టీ నాయకులు తగ్గిపోతే ప్రజల తరపును ప్రశ్నించేవారు లేకుండా పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా నిశాంత్ వందన సమర్పణ చేశారు.



95 శాతం ఇందిరమ్మ ఇండ్ల

# దరఖాస్తుల పరిశీలన పూర్తి

'ఇందిరమ్మ' ఫిర్యాదుల కోసం 'indirammaindlu.telangana.gov.in' వెబ్‌సైట్ :

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ఇందిరమ్మ' లబ్ధిదారులకు మరింత పారదర్శకమైన సేవలను అందించాలనే లక్ష్యంతో ఫిర్యాదుల కోసం ఇందిరమ్మ ఇండ్లు గ్రీవెన్స్ మాడ్యూల్‌ను ప్రవేశపెట్టామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన ఈనెల 8వ తేదీ నాటికి హైదరాబాద్ మినహా 32 జిల్లాలలో 95 శాతం, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 88 శాతం పూర్తయిందని, త్వరలో లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేసి, ఇండ్ల నిర్మాణ ప్రక్రియకు సంబంధించిన కార్యాచరణపై దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, సచివాలయంలోని తన కార్యాలయంలో 'ఈ గ్రీవెన్స్ మాడ్యూల్'ను మంత్రి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ఏమైనా సమస్యలు ఎదురైతే 'indirammaindlu.telangana.gov.in' వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చని, ఈ ఫిర్యాదుపైన తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు ఫిర్యాదుదారుల మొబైల్‌కు సమాచారాన్ని తెలియజేస్తామన్నారు. గ్రామాల్లో ఎండిడిఒ, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్ ద్వారా సంబంధిత అధికారులకు ఫిర్యాదు వెళ్తుందని, ఇందిరమ్మ ఇండ్ల పథకానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ఇందులో మధ్యవర్తులకు తావులేకుండా అర్హులైన వారికే ఇండ్లు మంజూరయ్యేలా పారదర్శకంగా చర్యలు తీసుకుంటుందని, వీలైనంత త్వరితగతిన ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు అందేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొదటి విడతలో నివాస స్థలం ఉన్నవారికి ఇండ్లు నిర్మించి ఇస్తామని, రెండవ దశలో ప్రభుత్వమే నివాస స్థలంతో పాటు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తుందన్నారు. మొదటి విడతలో వికలాంగులు, ఒంటరి మహిళలు, అనాథలు, వితంతువులు, ట్రాన్స్‌జెండర్లు, సఫాయి కర్మచారులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు మంత్రి సూచించారు. గత ప్రభుత్వంలో ఇండ్ల నిర్మాణానికి కాంట్రాక్ట్ వ్యవస్థ ఉండేదని, ఇప్పుడు ఆ వ్యవస్థను రద్దు చేసి లబ్ధిదారులే ఇంటిని నిర్మించుకునేలా అవకాశం కల్పించామని, లబ్ధిదారులు తమ సౌలభ్యాన్ని బట్టి 400 చదరపు అడుగులకు తగ్గకుండా ఎంత విస్తీర్ణంలోనైనా ఇండ్లు నిర్మించుకోవచ్చని చెప్పారు. గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వి.పి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. కాగా కామారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలలో 98 శాతం, ములుగు, కరీంనగర్, సంగారెడ్డి, సిరిసిల్ల, మెదక్ జిల్లాలలో 97శాతం, మహబూబాబాద్, జగిత్యాల, సిద్దిపేట, ఆసిఫాబాద్, జనగాం. రంగారెడ్డి, పరిశీలన పూర్తయింది.



## దేశ నిర్మాణంలో ఆదివాసీయులు భాగస్వాములు కావాలి

శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/నందికొండ:** 5వ షెడ్యూల్ ద్వారాఆదివాసీ యులకు భారత రాజ్యాంగంలో ప్రత్యేక హోదా కల్పిస్తూ తీర్మానం జారీ చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని, అందుకు ఈ దేశ నిర్మాణంలో ఆదివాసీయులు భాగస్వాములు కావాలని సీతక్క పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నందికొండ మున్సిపాలిటీలోని స్థానిక ప్రాజెక్ట్ హౌస్ లో ఈనెల 5 నుంచి 11 వరకు ఏడు రోజులపాటు జరిగే గిరిజన,ఆదివాసీ సాధికారిత శిక్షణా కార్యక్రమం గురువారం ఐదవ రోజుకు చేరుకొంది.ఈ సభకు ముఖ్య అతిదులుగా ) శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, మానవ హక్కుల సమన్వయకర్త ప్రొఫసర్ హరగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ఆదివాసీయులకు పోరాటాలు ఎక్కువున్నాయి కానీ ఫలితాలు మాత్రం శూన్యమని గిరిజనులు అనుభవించే ప్రతి హక్కు, చట్టం, సంక్షేమ పథకాలు, ఇలా ఐదవ షెడ్యూల్ నుంచి మొదలు గ్రామసభల్లో తీర్మానాలవరకు ఆదివాసీయులకు ఎంకావాలో వారే నిర్ణయించుకునే అధికారంతో పాటు పీసా చట్టం, ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్స్ రావడానికి ముఖ్య కారకులు ఆనాడు కాంగ్రెస్ పార్టీలో ఉన్న మహానుభావులు, ఎస్ఆర్ శంకరన్,హరగోపాల్ లాంటి మేధావుల సలహాలు కారణమని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని దేశంలో రుద్ది మను ధర్మ శాస్త్రన్ని మళ్లీ అమలు లోకి తెచ్చే కుటిల ప్రయత్నాలు జరుగుతున్నాయని దీనితో తమ హక్కులను కాలరాసేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. దున్నటానికి భూమి లేని స్థితిలో గిరిజనులకు పోడు భూముల హక్కుల చట్టాన్ని తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో , డిఎస్‌పి శేఖర్ రాజు, స్థానిక సీఐ బీసన్న, పోలీసు సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# 'టి-సాట్' ప్రత్యేక పాఠ్యాంశాలు

జనవరి 10న ప్రత్యేక లైవ్ :

సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థుల కోసం పలు భాషలపై ప్రత్యేక డిజిటల్ పాఠాలు ప్రసారం చేసిన టిసాట్ నెట్‌వర్క్ హిందీ భాషపైనా ప్రత్యేక డిజిటల్ పాఠ్యాంశాలు ప్రసారం చేసేందుకు షెడ్యూల్ ఖరారు చేసింది. అరగంట నిడివి గల పాఠ్యాంశాలు 30 రోజులు, అనుభవం కలిగిన ఫ్యాకల్టీ బోధించిన లెసన్స్ ప్రసారం కానున్నాయి. పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రసారాల వివరాలను సిఈఓ బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో వివరించారు. తెలంగాణాలోని విద్యార్థులు హిందీ మాట్లాడటంలో ప్రావీణ్యం కల్పించేందుకు టిసాట్ ప్రత్యేక డిజిటల్ పాఠ్యాంశాలు సిద్ధం చేసిందని సిఈఓ తెలిపారు. అనుభవం కలిగిన అధ్యాపకులచే బోధించబడిన పాఠ్యాంశాలను ప్రతి రోజూ అరగంట పాటు నిపుణ ఛానల్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు, విద్య ఛానల్‌లో సాయంత్రం 6.30 గంటలకు, జనవరి 11వ తేదీ నుండి ఫిబవరి 13వ తేదీ వరకు శుక్రవారాలు మినహా ప్రసారం చేయనున్నట్లు, డిజిటల్ పాఠ్యాంశాలు టిసాట్ యూట్యూబ్‌తో పాటు, యాప్‌లోనూ అందుబాటులో ఉంటాయని, విద్యార్థులు పాఠ్యాంశాలను సక్రమంగా వినియోగించుకునే విధంగా వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

**10వ తేదీన ప్రత్యేక లైవ్**

ప్రపంచ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని, నెల రోజుల పాటు హిందీ ప్రసారాల సందర్భంగా తొలి రోజు జనవరి 10వ తేదీ శుక్రవారం ఉదయం 11 నుండి 12 గంటల వరకు గంట పాటు ప్రత్యేక లైవ్ ప్రసారం ఉంటుందని, తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగం అధిపతి పార్వతి, హిందీ సీనియర్ ఉపాధ్యాయుడు మతీన్ అహ్మద్ ఈ ప్రత్యేక ప్రసార కార్యక్రమంలో పాల్గొని హిందీ భాష నేర్చుకోవడంలో తలెత్తే సమస్యలకు సలహాలు ఇస్తారన్నారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు, హిందీ భాష నేర్చుకోవాలనుకునే వారు 04023540326/726 టోల్‌ఫ్రీ నెం.18004254039లకు కాల్ చేయాలని సూచించారు.

## ప్రభుత్వ బాలికల సంక్షేమ హాస్టళ్ల తనిఖీలు

రాత్రి హాస్టళ్లలోనే బస

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశం

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** రాష్ట్రంలోని ప్రభుత్వ బాలికల సంక్షేమ హాస్టళ్లను మహిళా ఐఎఎస్ అధికారులు స్వయంగా తనిఖీలు నిర్వహించడంతో పాటు రాత్రి అక్కడే బస చేయనున్నారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. రాష్ట్రంలో 540 బాలికల సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయని, ఈ హాస్టళ్లలో విద్యాప్రమాణాలు పెంచడంతో పాటు డైయిట్ చార్జీల పెంచి బాలికలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందని చెప్పారు. ఇదేక్రమంలో ఈ హాస్టళ్లను ఆల్ ఇండియా సర్వీస్ మహిళా అధికారులు తనిఖీలు నిర్వహించనున్నారని వెల్లడించారు. ఇందుకు సంబంధించి గురువారం సంబంధిత ఉన్నతాధికారులతో సిఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో సిఎస్ శాంతికుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో 540 ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విభాగాల బాలికల హాస్టళ్లున్నాయని, ఈ హాస్టళ్లను తొలిదశలో 29మంది మహిళా ఐఎఎస్ అధికారులు సందర్శించి ప్రస్తుత పరిస్థితులను స్వయంగా పరిశీలించి, హాస్టళ్లలో విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు, వీటిని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు తగు ప్రతిపాదనలను అందచేస్తారని వివరించారు. ఈ తనిఖీలు సంబంధించి ఇప్పటికే మార్గదర్శకాలను రూపొందించామని తెలిపారు. కామన్ డైయిట్ నిర్వహణ, విద్యా ప్రమాణాలు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పన, హాస్టళ్ల నిర్వహణ తదితర అంశాలను మహిళా అధికారులు పరిశీలిస్తారని వెల్లడించారు. ఈనెల 25వ తేదీ లోపు తొలిదశ తనిఖీలు పూర్తి చేసి పూర్తి వివరాలను అందించనున్నారని తెలిపారు. అధికారులు అందించిన వివరాలపై సవివరమైన సమీక్ష నిర్వహించి కార్యచరణ చేపడతామని చెప్పారు.ఇందులో భాగంగా అన్ని స్థాయిల ఐఎఎస్ అధికారులతో సంక్షేమ హాస్టళ్ల తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని సిఎస్ వెల్లడించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఎస్‌సి అభివృద్ధి శాఖ, ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

## కెటిఆర్ ఓ యువరాజు

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు దేశం కోసం పనిచేసిన సైనికుడు కాదని, ఆయన ఓ యువరాజు అని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. గురువారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెటిఆర్ తాను ఓ సైనికుడినంటూ మరోసారి తెలంగాణ ప్రజలకు చెవిలో పువ్వు పెట్టేందుకు యత్నిస్తున్నారని, అది సాధ్యం కాదన్నారు. అధికారం కోల్పోవడంతో కెటిఆర్‌కు మతిభ్రమించిందని, అందుకే ఆయన ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. 'మాకు డబ్బు వ్యామోహం లేదు అన్న కెటిఆర్ వ్యాఖ్యలు హాస్యాస్పదమని, వీళ్లకు డబ్బు వ్యామోహం లేదంటే ప్రజలు ఎవరూ నమ్మరన్నారు. ఎందుకంటే కమీషన్ల కోసమే ఎంఎల్‌ఎసి కవిత ఢిల్లీలో లిక్కర్ వ్యాపారం చేశారని ఆరోపించారు. అదేవిధంగా రూ.7లక్షల కోట్లలో కాంట్రాక్టర్లకు ఎన్ని లక్షల కోట్లు అప్పనంగా ముట్ట చెప్పారో వెల్లడించాలని కిరణ్‌కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

ప్రజాపక్షం

శుక్రవారం, జనవరి 10

# బడ్జెట్‌కు ముందు కఠిన సత్యాలు

మన దేశానిది శీఘ్రంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా గొప్పలు చెప్పుకున్నాం. కొవిడ్ మహమ్మారి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను కుదిపివేసిన తదుపరి 2022–23 నుంచి వృద్ధిరేటు సాధించటంలో అది వాస్తవం కూడా. 2030నాటికి ప్రపంచంలో ఐదునుండి మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం అవతరిస్తుందన్న ఆశాభావాన్ని ప్రకటించాం కూడా. అయితే అది రహదారి కాదు – ఎన్నో ఒడిదొడుకులు, ఆటుపోట్లు ఎదుర్కొంటూ, అధిగమిస్తూ పురోగమించాల్సిన గతుకులబాట. తొలి అవరోధం అప్పుడే ఎదురైంది. 2023–24లో 8.2 శాతం జిడిపి వాస్తవ వృద్ధిరేటు సాధించిన భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో 6.4శాతానికి దిగజారినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఒ) మధ్యంతర అంచనాలు తెలుపుతున్నాయి. ఇది గత నాలుగేళ్లలో కెల్లా తక్కువ. ఆర్థిక సంవత్సరం ముగిసిన తదుపరి తుది గణాంకాలనుబట్టి వృద్ధిరేటులో స్వల్ప ఎగుడుదిగుళ్లు ఉండవచ్చు. కాని ప్రస్తుత గణాంకాలు ఒక లక్షణాన్ని ప్రతిబింబిస్తున్నాయి – భారత ఆర్థిక వ్యవస్థ మందగమనంలో పడింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి వార్షిక బడ్జెట్ తయారీ కసరత్తు దాదాపు తుది దశలో ఉన్నందున ఎన్ఎస్ఒ గణాంకాలు ప్రభుత్వానికి మేలుకొలుపు లాంటివి. ఏఏ రంగాల్లో వృద్ధి మందగించిందో గ్రహించి బడ్జెట్ ప్రోత్సాహకాలు నిర్ణయించేందుకు, ఏఏ రంగాల నుంచి ప్రభుత్వం అదనపు ఆదాయం రాబట్టాలో, ఏఏ రంగాలపై అదనంగా వెచ్చించాలో ప్రభుత్వం నిర్ణయించుకోవచ్చు. అయితే నయా ఉదార ఆర్థిక విధానాలతో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని ఆశ్రయించిన మోదీ ప్రభుత్వానికి పెట్టుబడిదారులపై పన్నులు పెంచేందుకున్న మార్గాంతరాలు బహుస్వల్పం. ప్రపంచ దేశాలు ఆదర్శమంటూ కార్పొరేట్ ఆదాయపన్నును, వ్యక్తిగత కార్పొరేట్ ఆదాయపు పన్ను రేట్లను కొన్ని సంవత్సరాల క్రితమే గణనీయంగా తగ్గించింది ప్రభుత్వం. జిఎస్‌టి పేరుతో ప్రజానీకం నుండి పరోక్ష పన్నులు గోళ్లూడగొట్టి వసూలు చేయటం, భారీగా అప్పులు చేయటమొక్కటే తెలుసు. పేదలను ఉద్ధరించేందుకు కుబేరులపై 2శాతం సూపర్ టాక్స్ విధించాలని బ్రిక్స్ శిఖరాగ్ర సభ నిర్ణయించినా దాన్ని అమలు జరిపే చిత్తశుద్ధి, చొరవ బిజెపి ప్రభుత్వానికి లేదు. సామాన్య కుటుంబాలు తమ వంటింటి బడ్జెట్ గత రెండేళ్లలో రెట్టింపై నాలుగువేళ్లు నోట్లోకి పోవటానికి పడుతున్న అవస్థలు ఈ ప్రభుత్వానికి పట్టవు. నిరుద్యోగం పెరుగుతున్నా, పనిదినాలు, నిజవేతనాలు తరుగుతున్నా స్థూల అంకెలతో గారడీ తప్ప వారిని ఆదుకునే ప్రయత్నం లేదు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలు రెండింటిలోనూ ఆదాయాలు తరిగి వినిమయం తగ్గిందని గణాంకాలు చెబుతున్నాయి. ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహం ఆ కొనుగోలు శక్తే. దాంతో పొదుపు కునారిల్లుతున్నది. పర్యవసానం? బ్యాంకులు, ప్రభుత్వ ఆదాయ పొదుపు బాండ్లలో డిపాజిట్లు తగ్గిపోతున్నాయి. ఇవన్నీ ఆర్థిక వ్యవస్థలో తిరోగమనానికి సూచనలు.

ఎన్ఎస్ఒ తాజా గణాంకాలను పరిశీలించినట్లయితే, సెకండరీ సెక్టార్ (మాన్యుఫాక్చరింగ్ – వస్తూత్పత్తికి అవసరమైన వనరులను, ముడి పదార్థాలను సిద్ధం చేస్తుంది)లో జివిఎ (స్థూల విలువ చేర్పు) 2023–24లోని 9.7శాతం నుంచి 2024–25లో 6.5 శాతానికి పడిపోయింది. స్థూల జిడిపిలో నాలుగోవంతు ఈ రంగం నుంచి వస్తుంది. పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థ ఇదే కాలంలో 10 నుండి 5 శాతానికి పడిపోయింది. పారిశ్రామిక ఉత్పత్తి, నాలుగు ప్రధాన విభాగాల్లో – మైనింగ్, మాన్యుఫాక్చరింగ్, ఎలక్ట్రిసిటీ జనరేషన్, లోహ ఖనిజాలు – వృద్ధి క్షీణించింది. అవి దిద్దుబాటును, విధాన జోక్యాలను కోరుతున్నాయి. ఈ సమస్యలకు పరిష్కారాలను బడ్జెట్ అన్వేషించాలి. అలాకాకుండా వడ్డీరేట్ల తగ్గింపు ఒక్కటే పరిష్కారమనుకుంటే పప్పులో కాలేసినట్లే!

> జిఎస్‌టి పేరు తో ప్రజానీకం నుండి పరోక్ష పన్నులు గోళ్లూడగొట్టి వసూలు చేయటం, భారీగా అప్పులు చేయటమొక్కటే తెలుసు. పేదలను ఉద్ధరించేందుకు కుబేరులపై 2శాతం సూపర్ టాక్స్ విధించాలని బ్రిక్స్ శిఖరాగ్ర సభ నిర్ణయించినా దాన్ని అమలు జరిపే చిత్తశుద్ధి, చొరవ బిజెపి ప్రభుత్వానికి లేదు.

# 'అంతా మీరే చేశారు'! పెద్ద'సారు'పై కస్సుబుస్సులు



ఎస్‌కె జకీర్
సీనియర్ జర్నలిస్ట్
9052631212

దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, ఇతర నేరాలు చేసేవాళ్ళు గతంలో రాజకీయ నాయకుల పంచన చేరేవారు. వారి అండదండలతో నేరాలు సాగించేవారు. ఇది దశాబ్దాల కిందటి దృశ్యం. తర్వాత నేరగాళ్లు రాజకీయాల్లో చేరి చట్టసభల్లో ప్రతినిధులుగా ఎన్నికవుతూ వస్తున్నారు. ఇది మరో దృశ్యం. ఇక అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ పారిశ్రామిక, వ్యాపార సామ్రాజ్యంలో వందలు, వేల కోట్లు గడించి వాటిని కాపాడుకోవడానికి రాజకీయ పార్టీల్లో చేరి, ఆయా పార్టీలకు పెద్దఎత్తున 'ముడుపులు' ఇచ్చి, టికెట్లు తీసుకొని చట్టసభలకు ఎన్నిక కావడం రెండు, మూడు దశాబ్దాలుగా కనిపిస్తున్న సన్నివేశం. ఇక ఆ తర్వాత ఆ పార్టీలలో వాళ్ళే కీలకంగా మారుతున్నారు. సంబంధిత రాజకీయపార్టీ దశ, దిశను వారే నిర్ణయిస్తున్నారు. ఈ పరిణామాలకు జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలు ఏవీ మినహాయింపు కాదు. అన్ని పార్టీలకు డబ్బు కావాలి. ధనబలం లేని వారికి ప్రస్తుత రాజకీయాల్లో ప్రాముఖ్యత లేదు. ప్రాధాన్యం అంతకన్నా లేదు.

ఈ ఉపోద్ఘాతమంతా 'తెలంగాణ రాజకీయాల' గురించి ప్రత్యేకంగా వివరించడానికే. 2014 నుంచి 2023 డిసెంబర్ దాకా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి రాజకీయాల పేరిట పదేండ్ల పాటు జరిగిన అవినీతి, భూముల దోపిడీ, ప్రాజెక్టుల పేరిట స్వాహా, ఇంకా అనేక ప్రభుత్వ శాఖల్లో పలు పథకాల పేరిట జరిగిన బాగోతాలు... అన్నీ ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నవి. తెలంగాణ రాష్ట్ర సాకారంలో కెసిఆర్ పోషించిన పాత్ర పట్ల గౌరవంతో టిఆర్ఎస్‌కు ప్రజలు అధికారం కట్టబెట్టారు. మొదటి టర్మ్‌లో కెసిఆర్ ఉదాత్తంగా వ్యవహరించినట్టుగానే కనిపించింది. సంక్షేమ కార్యక్రమాలతో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజలు అందుకే 'రెండో టర్మ్' కూడా ఆయననే ఆదరించారు. ''అవినీతి ఎక్కడ జరిగినా సహించేది లేదు. నా కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు వచ్చినా ఉపేక్షించేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటా'' అని కెసిఆర్ వరంగల్ సభలో వ్యాఖ్యలు చేసినప్పుడు సామాన్య ప్రజల్లో ఆయనపై 'భక్తి' కూడా పెరిగింది. అయితే 'అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల వెలుతురు కింద కుంభకోణాల చీకటి' దట్టంగా అలుముకున్న సంగతి కెసిఆర్ అధికారం కోల్పోతేగానీ బయటపడలేదు.

వరంగల్ లో అవినీతి అణచివేత గురించి తాను చెప్పిన దానికి విరుద్ధంగా కెసిఆర్ ప్రవర్తించారని పలు సంఘటనలతో అర్థమవుతోంది. 'ఫార్ములా ఈ' రేస్ కేసులో తన కొడుకు, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పీకల్లోతు ఇరుక్కున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినతర్వాత ఈ 'రేసు' నిర్వహణ కోసం 55 కోట్లను విదేశాల్లోని సంస్థకు బదిలీ చేసిన ఘటన అధికార దుర్వినియోగానికి పరాకాష్టగా న్యాయ నిపుణులంటున్నారు. కేబినెట్ ఆమోదం లేకుండా, ఆర్థిక శాఖ అనుమతించకుండా నాటి మంత్రి కెటిఆర్ మౌఖిక ఆదేశాలతో జరిగిన డబ్బు బదిలీపై ఎసిబి, ఇడి కేసులు నమోదు చేశాయి. ఈ కేసులో మొదటి నిందితునిగా ఎఫ్ఐఆర్‌లో కెటిఆర్ పేరు చేర్చారు. ఫార్ములా ఈ పేరిట జరిగిన ఆర్థిక అవకతవకలు, అధికార దుర్వినియోగం, ప్రజాధనం దుర్వినియోగం వంటి అంశాలపై మీడియాలో వస్తున్న వార్తా కథనాలతో ప్రజలు బిఆర్ఎస్ పార్టీని అసహ్యించుకుంటున్నట్టు అనేక ప్రాంతాల నుంచి సమాచారం అందుతున్నది.

'ఫార్ములా ఈ' కేసు కేవలం ట్రయల్ పార్ట్ మాత్రమేనని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి వంటి నాయకులు అంటున్నారు. తవ్విన కొద్దీ బిఆర్ఎస్ పాలనలో జరిగిన పెక్కు అవినీతి, కుంభకోణాలు వెలుగులోకి రానున్నట్టు మంత్రులు చెబుతున్నారు. ముఖ్యంగా భూదాన్, దేవాదాయ, అసైన్డ్ భూములు.. ఇతర క్యాటగిరీ భూములను పదేండ్ల పాలనలో ఎట్లా కైంకర్యం చేశారో బట్టబయలయితే చాలామంది పార్టీ నాయకులు, ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా ఉన్నవారు కటకటాలు లెక్కపెట్టే అవకాశాలను తోసిపుచ్చలేమని ప్రభుత్వ వర్గాలంటున్నాయి.

అయితే ఈ వ్యవహారాలన్నీ పార్టీకి, ప్రభుత్వానికీ అధినేతగా పనిచేసిన కెసిఆర్‌కు తెలియకుండా, ఆయన నోటీసులో లేకుండా జరిగి ఉండవచ్చునని ఎవరూ అనుకోవడం లేదు. కెసిఆర్ కు తెలిసే అన్ని కుంభకోణాలు జరిగాయన్న ఆరోపణలున్నవి. తన కూతురు



ఎమ్మెల్సీ కవిత 'లిక్కర్ స్కామ్' గురించి కూడా కెసిఆర్ కు ముందే సమాచారం ఉందనే ప్రచారం ఒకటుంది. ఆయన మొట్టమొదటే నివారించి ఉంటే ఆమె అలాంటి వ్యవహారంలో తలదూర్చేవారు కాకపోవచ్చునని ఒక కథనం ప్రచారంలో ఉంది.

ప్రత్యర్థుల ఆనుపానులు తెలుసుకోవడానికి, ప్రతిపక్షాలను 'ఖతం' చేయాలని 'ఫోన్ ట్యాపింగ్' కథ నడపడం తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇటీవలి సంవత్సరాల్లో వేరే రాష్ట్రాల్లో ఎక్కడా అధికారంలో ఉన్న రాజకీయపార్టీ ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినట్టు దాఖలాలు లేవు. నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం, పాండిత్యం, ఎమ్మెల్యే నుంచి కేంద్రమంత్రి దాకా పెక్కు పదవులు నిర్వహించి, పద్నాలుగేండ్ల పాటు ఉద్యమం నడిపి, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రి పదవి చేపట్టిన కెసిఆర్ మూడో టర్మ్' అధికారం దక్కకపోవచ్చునని అంచనా వేసి, దొడ్డిదోవన అధికారంలోకి రావడానికి ప్రయత్నించారు, ఫోన్ ట్యాపింగ్ నేరం అందులో భాగమే. ఫోన్ ట్యాపింగ్ కేసులో 'కథానాయకుడు' అయిన నాటి డిఐజి ప్రభాకరరావు అమెరికాలో తలదాచుకున్నారు. ఆయనను రప్పించడానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు కొలిక్కి రావడం లేదు. తనకు మరలా అధికారం ఇవ్వకపోతే రెస్టు తీసుకుంటానని చేసిన శపథం ప్రకారమే 'ప్రజలపై కోపంతో' కెసిఆర్ 13 నెలలుగా ఎర్రవెల్లిలో విశ్రాంతి తీసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది.'అధికార వియోగం' నుంచి కెసిఆర్ ఇప్పుడప్పుడే కోలుకునే పరిస్థితులు లేవని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. అధికారంలో ఉన్నప్పుడు అనుభవించిన 'వైభవం' కోల్పోగానే గాలి తీసివేసిన బెలూన్ వలె, ఆయన తట్టుకోలేకపోతున్నారు. పదేండ్ల పాటు తెలంగాణలో కెసిఆర్ ఆడిందే ఆట. పాడిందే పాట. ఆయన యాదాద్రి అంటే యాదాద్రి. ఆయన కాళేశ్వరం అంటే కాళేశ్వరం. ఆయన రైతు బంధు అంటే రైతుబంధు. దళితబంధు అంటే దళితబంధు. మరో మాట లేదు. వెనుకడుగు లేదు. పునరాలోచన లేదు. ఎదురులేని మనిషిగా తెలంగాణ రాజకీయాల్ని శాసించారు.

బిఆర్ఎస్ పార్టీకి సంకేతం కెసిఆర్. కెటిఆర్, హరీశ్, కవిత.... మరెవరైనా కెసిఆర్ పేరు చెప్పుకొని రాజకీయాలు నడపవలసిందే. వేరే మార్గమేమీ లేదు. కెటిఆర్, కవిత, హరీశ్ రావు ఎవరికివారే తామొక 'బ్రాండ్'గా రూపొందడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా, బిఆర్ఎస్ కు శ్రీరామ రక్ష అయినా, లేదా ఆ పార్టీ పతనమైనా 'కేసీఆర్ బ్రాండ్' ఒక్కటే కారణం. స్వచ్ఛమైన రాజకీయాలు, విలువలతో కూడిన సేవాతత్పరులు తెలంగాణ కొత్త రాష్ట్రంలో కనిపిస్తారని చాలామంది ఊహించారు. కానీ అందుకు భిన్నంగా 'ప్రజలకు ద్రోహం' చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నవి. దుష్ట రాజకీయాల ఉధృతిలో ప్రజాస్వామ్యం అపహాస్యం కావడం ఆధునిక రాజకీయాల లక్షణమైంది. గెలుస్తున్న ప్రతి ముగ్గురిలో ఒకరు నేరచరిత్ర కలిగిన వారేనని ఒక అధ్యయనంలో తేలింది. నేర చరిత్రలేని వారికే టికెట్లు ఇస్తామని చెప్పే ధైర్యం లేదా అన్న మాజీ రాష్ట్రపతి కెఆర్ నారాయణన్ ప్రశ్న నేటికీ ప్రశ్నగానే మిగిలింది. నేరచరిత వున్న రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు దేశానికి ఇబ్బంది. అధికారంలో ఇలాంటి వారు వుండడం ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు.

తెలంగాణ సంగతే తీసుకుంటే కొత్త రాష్ట్రం, స్వయం పాలన, ఉద్యమానికి సారథ్యం వహించిన నాయకుడే ముఖ్యమంత్రి అయినందున అవినీతి రహిత, ప్రజాహిత పాలనను ప్రజలు ఆశించారు. 'మొదటి టర్మ్' లో పాలనకు మంచి మార్కులే వచ్చాయి. పరిస్థితి కొంత ఆశాజనకంగా కనిపించింది. ఆ తర్వాతే భూములు, సహజ వనరులు, ప్రజాధనాన్ని ఇబ్బడిముబ్బడిగా దోచుకోవడానికి టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు తెగబడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట ల్లో చెప్పాలంటే 'చెరకు తోటల్లో పడి అడవి పందులు' ధ్వంసం చేసినట్టుగా విచ్చలవిడిగా తెలంగాణ ప్రజాధనాన్ని 'లూటీ' చేశారు.పైగా అధికారపార్టీ కీలక నాయకుల ప్రోత్సాహంతో వారి అనుచరులు, బినామీలు అందిన కాడికి 'సంపద'ను కూడబెట్టుకున్నారు.

కెసిఆర్ ఉదాసీన వైఖరి, బంధు ప్రీతి వలన ప్రజలకు చట్టబద్ధ పాలన, జవాబుదారీతనం, పారదర్శకత లోపించి, ప్రగతి పురోగతి ఎండమావిగా తయారయిన విషయాన్ని అంగీకరించేందుకు ఆ పార్టీ నాయకత్వం సిద్ధంగా లేదు. ఎన్నికల్లో గెలవడం దోచుకోవడం, దాచుకోవడం, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించడం, ప్రభుత్వ భూములను విక్రయించడం, రాజకీయ ప్రత్యర్థులపై కక్ష తీర్చుకోవడం 'కెసిఆర్ రాజకీయం'లో ఒక భాగంగా మారిపోయాయి. వీటన్నింటినీ గమనించిన ప్రజలు కెసిఆర్‌ను 2023 డిసెంబర్ లో తిరస్కరించారు. కెసిఆర్ పార్టీ గుండెలపై రేవంత్ రెడ్డి ట్రిగ్గర్ నొక్కుతారని, ఆ పార్టీని ఇంటికి పంపిస్తారని వూహించకపోవడం వల్ల పరాజయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. కెసిఆర్ మనలాగే మనిషి కనుక ఆయన తన సంతానం పట్ల, బంధువుల పట్ల ఎంతో మమకారం ప్రదర్శిస్తూ వస్తున్నారు. తొలి నాళ్ళలోనే కొందరిపై 'వేటు' వేసి ఉంటే ఈ కళంకం ఆయనకు అంటి ఉండేది కాదేమో!

# పతనం అంచున...భారత్ జిడిపి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) భారత ఆర్థిక వ్యవస్థ 6.4 శాతం వృద్ధిని నమోదు చేయనున్నది, ఇది నాలుగేళ్ల కనిష్ఠ స్థాయి అని జాతీయ గణాంకాల కార్యాలయం (NSO) తెలిపింది. మంగళవారం విడుదల చేసిన ముందస్తు అంచనాల ప్రకారం, తయారీ రంగం మరియు సేవల రంగాల మాంద్యం ఈ తగ్గుదలకు ప్రధాన కారణమని పేర్కొంది. కొవిడ్19 మహమ్మారి సమయంలో, 2020–21 ఆర్థిక సంవత్సరంలో జిడిపి 5.8 శాతం క్షీణించింది. దీనితో పోల్చితే, 2021–22లో 9.7 శాతం, 2022–23లో 7 శాతం, 2023–24లో 8.2 శాతం వృద్ధి నమోదైంది.

**ఎన్ఎస్ఒ అంచనాలు vs ఇతర అంచనాలు**

ఎన్ఎస్ఒ అంచనా ప్రకారం, 6.4 శాతం వృద్ధి రేటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అంచనా వేసిన 6.6 శాతంతో పాటు కేంద్ర ఆర్థిక శాఖ అంచనా వేసిన 6.5 నుండి 7 శాతం కంటే తక్కువ. ఈ అంచనాలు 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ సిద్ధం చేసే సమయంలో కీలకంగా ఉపయోగపడతాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1న ఈ బడ్జెట్‌ను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు.

**నామినల్ జిడిపి వృద్ధి వేగంగా పెరుగుతున్నది:**

ప్రస్తుత ధరల ఆధారంగా నామినల్ జిడిపి వృద్ధి రేటు 2024–25లో 9.7శాతానికి చేరుకోనుంది, ఇది 2023–24లో నమోదైన 9.6శాతం కంటే అధికం. నామినల్ జిడిపి 2023–24లో ₹295.36లక్షల కోట్ల నుండి 2024–25లో ₹324.11లక్షల కోట్లకు పెరుగుతుందని అంచనా.

అదేవిధంగా, ప్రస్తుత ధరల ఆధారంగా స్థూల విలువ జోడింపు (జివిఎ) 9.3 శాతం వృద్ధి చెంది ₹292.64 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా.

**రంగాల పనితీరు** : తయారీ మరియు సేవల రంగాలు ఆర్థిక మాంద్యానికి ప్రధాన కారణంగా పేర్కొనబడ్డాయి. అయితే, ఇక్రా వంటి దేశీయ రేటింగ్ సంస్థలు కొన్ని రంగాలు రెండవ అర్ధ భాగంలో మెరుగైన పనితీరును చూపవచ్చని భావిస్తున్నాయి.

**2025–26 కోసం మిశ్రిత అంచనాలు:**

ఇక్రా సంస్థ 2025–26 ఆర్థిక సంవత్సరంలో జిడిపి వృద్ధిరేటు 6.5 శాతం చేరుకుంటుందని అంచనా వేసింది. కానీ అంతర్జాతీయ మరియు దేశీయ అనిశ్చితులు వృద్ధిపై ప్రభావం చూపవచ్చని హెచ్చరించింది. మరోవైపు, హెచ్‌ఎస్‌బిసి సంస్థ 2024–25కు 6.2 శాతం వాస్తవ వృద్ధి అంచనా వేస్తున్నప్పటికీ, 2025–26లో ఇది 6.5శాతానికి చేరుకుంటుందని అభిప్రాయపడింది.

**$3.8ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ:** ప్రస్తుత డాలర్ మారకం రేటు ప్రకారం, 2024–25 ఆర్థిక సంవత్సరంలో భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం $3.8 ట్రిలియన్‌కు చేరుకుంటుందని ఎన్ఎస్ఒ అంచనా వేసింది.

**తలసరి ఆదాయం వృద్ధి:** ప్రస్తుత ధరల ఆధారంగా, 2024–25లో తలసరి ఆదాయం 8.7 శాతం వృద్ధి చెందుతూ ₹2,00,162కు చేరుకుంటుందని అంచనా. ఇది 2023–24లో ₹1,84,205గా నమోదైన తలసరి ఆదాయంతో పోలిస్తే గణనీయమైన వృద్ధిగా నమోదైంది.

**బడ్జెట్‌లో మూలధన వ్యయాలకు ప్రాధాన్యత**

2025–26 బడ్జెట్‌లో మూలధన వ్యయాలు గణనీయంగా పెరగవచ్చు ని నిపుణులు భావిస్తున్నారు. ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్, ఈ వ్యయాలు ఆర్థిక మాంద్యాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.

**సవాళ్లు మరియు అవకాశాలు**

భారతదేశం నెమ్మదిగా పెరుగుతున్న తయారీ రంగం, అంతర్జాతీయ అనిశ్చితులు, ద్రవ్యోల్బణం వంటి సవాళ్లను ఎదుర్కొంటుంది. అయితే, బలమైన దేశీయ డిమాండ్ పెరుగుతున్న ప్రభుత్వ వ్యయాలు, మరియు ప్రైవేట్‌రంగం పెట్టుబడుల పునరుద్ధరణ ద్వారా వృద్ధి అవకాశాలను పొందవచ్చు.

2024–25లో 6.4 శాతం వృద్ధిరేటు ఒక స్వల్ప క్షీణత అయినప్పటి కీ, ఇది కొవిడ్ తర్వాత స్థిరమైన దశగా భావించవచ్చు. మూలధన వ్యయాలు మరియు నిర్మాణాత్మక సంస్కరణలపై దృష్టి సారించడం ద్వారా దీర్ఘకాలిక అభివృద్ధికి మార్గం సుగమం కానుంది.

నామినల్ జిడిపి మరియు తలసరి ఆదాయం పెరుగుతుండటంతో, భారతదేశం ప్రపంచ స్థాయిలో తన ఆర్థిక స్థానాన్ని మరింత బలపరచుకునే అవకాశం ఉంది.

డాక్టర్ కోలాహలం రామ్‌కిశోర్, 9849328496

# వైరస్... కొత్తేమీ కాదుగా !

2020 కరోనా ప్రపంచాన్ని వణికించింది. మనం బాగుండడమే కాదు మన పక్కవాళ్ళు కూడా ఆరోగ్యంగా ఉండాలి అని ప్రతి మనిషికి నేర్పించి వెళ్ళింది. ఎంత గొప్పోడైనా అంటే ఎన్ని పదవులను అధిరోహించిన వాడైనా, ఎన్ని భవంతులకు అధికారియైనా, కోట్లకు అధిపతివై సూటు బూటుతో అడుగు నేలమీద మోపని వాడివైనా నాకు సమానమే అనే జీవిత సత్యాన్ని తెలియజేసింది.

వందమంది పనివారిని నువ్వు శాసించవచ్చు. కానీ, నా శాసనానికి నువ్వు బద్ధుడవు కావాలి. ముక్కుకి మాస్క్ పెట్టి అడుగు బయట పెట్టకుండా మూసుకు కూర్చో బెట్టింది కరోనా. అది మనిషి కాదు, జంతువూ కాదు, ఈగనో దోమనో కాదు కేవలం ఒక వైరస్. మానవజాతినంతటిని కట్టుదిట్టం చేసేసింది. ఎప్పుడైనా అనుకున్నామా అలాంటి రోజులనుభవిస్తామని, మొఖం చూపించకుండా భయపడి తలుపులేసుకొని దాక్కొనే రోజొకటొస్తుందని వచ్చింది. ప్రపంచం మొత్తంలో కొంత జనాభాను ఈడ్చుకెళ్లిపోయింది.

మనిషిగా నీకు కులం మతం ఉన్నట్టు వైరస్‌కి పేద ధనిక తారతమ్యం తెలియదు మరి. వీడు అట్టడుగు వర్గం వీడి దగ్గర డబ్బు ఉండదు కాబట్టి నేను వెళ్ళకూడదు. వీడు భూస్వామి కాబట్టి వెళ్దాం అనుకోలేదు. ఉన్న వాడిని లేని వాడిని ఒకే తాటిపై నిలబెట్టి 'అందరూ మనుష్యులే' అని నిజాన్ని నిక్కచ్చిగా నిరూపించింది.

ఇప్పుడు మరొకటి వైరస్ ప్రయాణమై బయలుదేరింది. భయం తో సాధించిదేమి లేదిక్కడ. 'మనోధైర్యం, మానవత్వం అనే రెండు ఆయుధాలు కావాలిప్పుడు'.

మనలో పరిశుభ్రత, ఆరోగ్యంపై శ్రద్ధ ఉండాలి. అలాగే మనం బావుంటే చాలు పక్కనోడు ఎలా చస్తే నాకెందుకు అన్న దరిద్రపు స్వభావాన్ని మార్చుకోవాలి. ఈర్ష్య, అసూయతో ఎంతసేపు ఒకడి నాశనం కోరుకోకూడదు. సమాజంలో బ్రతుకుతున్నాం. 'అందరూ బావుండాలి అందులో మనముండాలి' అన్న మంచి ఆలోచనతో ప్రతి రోజును ప్రారంభించాలి. అలా జీవనాన్ని కొనసాగిస్తే ఎన్ని ప్రళయాలు నీ మీదకు వచ్చినా తట్టుకొని నిలబడగలిగే ధైర్యం ఆ దేవుడు నీకిస్తాడు. అంతే కాదు నువ్వొకరికి బలం అయినప్పుడు మరింత బలగం నీతో ఉన్నట్టేనని గ్రహించు. అప్పుడు ఏ వైరస్ నిన్నేమీ చెయ్యలేదు.

వాసి జ్యోత్స్న , 9866843005

# 'డిటెన్షన్ విధానం' మంచిదేకానీ..

సమర్థ మానవ వనరుల నిర్మాణానికి విద్య అత్యంత కీలకమైనది. అందరికీ నాణ్యమైన విద్య అందించినప్పుడే ఇది సాధ్యమౌతుంది. ఈ లక్ష్య సాధనలో విద్యాహక్కు చట్టం 2009ను తీసుకురావడం జరిగింది. ఈ చట్టం ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాలు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అందించడం జరుగుతున్నది. విద్యను సార్వత్రి కం చేయడంలో ఈ చట్టం విజయవంతమైందని చెప్పవచ్చు. నేడు మెజారిటీ విద్యార్థులకు విద్య అందుబాటులోకి వచ్చినప్పటికీ నాణ్యతా ప్రమాణాలు లోపిస్తున్నాయని అనేక అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఈ విషయాన్ని అసర్ సర్వే, నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలు ధ్రువీకరిస్తున్నాయి. ఈ క్రమంలో విద్య నాణ్యతపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఇందులో భాగంగానే డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. వాస్తవంగా మొదట్లో విద్యాహక్కు చట్టం సెక్షన్ 16 ప్రకారం నో డిటెన్షన్ విధానం ఉండేది. ఈ సెక్షన్ రెండు కీలకమైన నిబంధనలను నిర్దేశిస్తుంది. మొదటిది, ప్రాథమిక విద్యను పొందుతున్న ఏ పిల్లవాడిని పాఠశాల నుంచి బహిష్కరించకూడదు. రెండవది, ఏ తరగతిలో నూ పిల్లలను నిలుపుదల చేయకూడదు. అనగా 8వ తరగతి వరకు విద్యార్థులను నిర్బంధించకుండా పై తరగతులకు అనుమతించా లి. పిల్లలు ప్రతి తరగతిలో ఫెయిల్ అవుతానేమో అనే భయం లేకుండా కనీస అభ్యసనస్థాయి పొందేలా చేయడం, తద్వారా డ్రాపౌట్ రేటును తగ్గించడం సెక్షన్ 16 ప్రధాన ఉద్దేశం. సమ్మిళిత విద్యను ప్రోత్సహించడం, డ్రాప్‌ఔట్లను తగ్గించడం కోసం నోడిటెన్షన్ విధానం ఒక సదుద్దేశంతో తీసుకురావడం జరిగింది. అయితే, దీని అమలుతీరు పలు విమర్శల ను ఎదుర్కొంది. ఈ విధానం పిల్లల స్నేహపూర్వక విద్యా వ్యవస్థను ప్రోత్సహించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ విద్య నాణ్యత, జవాబుదారీతనంపై ప్రభావం చూపింది.

**నాణ్యత లోపానికి కారణం** : ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి పాటించకపోవ డం, పర్యవేక్షణ లోపం, అశాస్త్రీయ బోధనా పద్ధతులు, అసమగ్రమైన మూల్యాంకన వ్యవస్థ, ఉపాధ్యాయులపై విద్యేతర అంశాల భారం పెరిగిపోవడంలాంటివే దీనికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. కరికులంలో సృజనాత్మకత, పరిశీలన జ్ఞానం, శాస్త్రీయత, ప్రశ్నించేతత్వం, తర్కం లోపించడంతో విద్యార్థులు బట్టీ చదువులకే పరిమితమవుతున్నారు. ఫలితంగా నాణ్యతా ప్రమాణాలు తీవ్రంగా పడిపోతున్నాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో మెజార్టీ విద్యార్థులు చదవడం, రాయ డం, గుణించడం వంటి కనీస అభ్యసన సామర్థ్యాలలో వెనకబడడమే దీనికి నిదర్శనం. ఈ నేపథ్యం లో దేశంలోని బాలలందరికీ అవగాహనతో కూడిన పఠనం, ప్రాథమిక గణితం పట్ల ప్రావీణ్యాన్ని పెంపొందించే ధ్యేయంతో 'నిపుణ భారత్' మిషన్ కార్యక్రమాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రారంభించారు.

**డిటెన్షన్‌కు మొగ్గు** : ప్రాథమిక విద్యపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 5, 8 తరగతులకు 'నో డిటెన్షన్' పాలసీని రద్దు చేసింది. దీనిప్రకారం ఈ రెండు తరగతులకు చెందిన విద్యార్థులపై తరగతులకు వెళ్లేందుకు తప్పనిసరిగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఇప్పటివరకు పాసైనా, ఫెయిలైనా హాజరుశాతంతో విద్యాహక్కు చట్టం ప్రకారం పై తరగతులకు పంపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం విద్యా ర్థి ఫెయిలైతే మళ్లీ పరీక్ష రాసేందుకు అవకాశం కల్పిస్తారు. పరీక్షల ఫలితాలు వెలువడే తేదీకి రెండు నెలల్లోపే మళ్ళీ పరీక్ష పెడతారు. ఒకవేళ అందులోనూ ఫెయిలైతే వారు 5, 8 తరగతులను మళ్లీ చదవాల్సి ఉంటుంది. ఫెయిలైన విద్యార్థుల జాబితాను ప్రధానోపాధ్యాయులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ప్రాథమికోన్నత విద్య పూర్తయ్యేవరకు ఏ విద్యార్థినీ బహిష్కరించరాదని కేంద్రం స్పష్టం చేసింది. మరోవైపు కేంద్రం నిర్ణయించిన ట్లు 5, 8 తరగతుల్లో డిటెన్షన్ విధానం అమలుచేస్తే ప్రభుత్వ విద్యా సంస్థల్లో డ్రాపౌట్లు పెరుగుతాయని ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



**తెలంగాణలో సందిగ్ధత** : ప్రాథమిక విద్య రాష్ట్ర జాబితాలోని అంశమైనందున ఈ విషయంలో ఆయా రాష్ట్రాలు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం పరిధిలోని దాదాపు 3 వేల కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక పాఠశాలలకు ఇది వర్తిస్తుంది. ఇప్పటికే ఢిల్లీ సహా 16 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాలు నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేశాయి. డిటెన్షన్ విధానం తెలంగాణలో అమలుపై సందిగ్ధత నెలకొంది. రాష్ట్రంలో ఇటీవల విద్యా వ్యవస్థలో సంస్కరణల కోసం విద్యా కమిషన్ నియమించిన ది. ఇది విద్యావ్యవస్థలో నాణ్యత, మౌలిక సదుపాయాలపై అధ్యయనం చేస్తోంది. ప్రస్తుతం 9వ తరగతి వరకు నో డిటెన్షన్ విధానం అమలవుతోంది. పరీక్షల్లో పాసై నా.. కాకున్నా పై తరగతులకు పంపిస్తున్నారు.

**విద్యా నాణ్యతకు సంస్కరణలు అవసరం**

ప్రస్తుతం పాఠశాల విద్యా వ్యవస్థలో ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర కరికులం అమలు చేస్తుండగా, ప్రైవేట్ పాఠశాలల్లో వేరే కరికులం బోధిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత, శిక్షణ ఉపాధ్యాయులకు వృత్తిపర అర్హత లేకపోవడం, విద్య నాణ్యతపై ప్రభావం చూపుతోంది. ఉపాధ్యాయులకు బోధనేతర అంశాల భారం తగ్గించాలి. కేంద్రం నూతన విద్యావిధానం 2020 తీసుకురావడం జరిగింది. ప్రస్తుతం పలు రాష్ట్రాలు నూతన విద్యావిధానం అమలు దిశగా ముందుకుపోతున్నాయి. ఈ విధానంలో కూడా లోపాలు ఉన్నాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. విద్యా నాణ్యతను మరింత మెరుగుపరచడానికి నిరంతర సమగ్ర మూల్యాంకనం, నో డిటెన్షన్ విధానంపై విద్యాహక్కు చట్టంలో చేసిన సవరణ లు సమీక్షించాలి. ప్రాథమిక స్థాయిలో నో డిటెన్షన్ విధానం రద్దువలన విద్యార్థుల్లో ఒత్తిడి పెరుగుతుంది. కావున, దీని పై పున:సమీక్షించి 8వ తరగతి నుంచి అమలుచేస్తే బాగుంటుంది.



పాతూరి మహేందర్ రెడ్డి

# 'ష్రింక్‌ఫ్లేషన్'తో వినియోగదారులపై భారం

ష్రింక్ ఫ్లేషన్(సంకుచిత ద్రవ్యోల్బణం) అనే పదం వస్తువు ధర తగ్గించకుండా ప్యాకెట్, వస్తువు పరిమాణం తగ్గించే ప్రయత్నం. వినియోగదారులు ఉత్పత్తి ధరల పెరుగుదల ను గుర్తించే అవకాశం ఉందని ఉత్పత్తి దారులకు తెలుసు. వినియోగదారుల వ్యతిరేకతను దృష్టిలో ఉంచుకొని వస్తువుల ధరలను పెంచకుండా వాటి పరిమాణాన్ని తగ్గించడానికి ఎంచుకుంటారు. ధరలను పెంచడం ద్వారా కాకుండా కొంచెం తక్కువ ఉన్న ప్యాకేజీకి అదే మొత్తాన్ని వసూలు చేయడం ద్వారా ఎక్కువ డబ్బును పొందవచ్చని ఉత్పత్తిదారుల పన్నాగం.. ప్యాకేజీ తగ్గింపుకంటే స్పష్టమైన ధరల పెరుగుదలను వినియోగదారులు ఎక్కువగా గుర్తిస్తారు.

చాలామంది వినియోగదారులు సాధారణంగా ఉత్పత్తి పరిమాణాన్ని తనిఖీ చేయరు. ఉదాహరణకు, బంగాళా దుంప చిప్స్‌ను ఇష్టపడే వ్యక్తికి, తమకు ఇష్టమైన బ్రాండ్ బ్యాగ్ పరిమాణాన్ని 5% తగ్గిస్తుందో లేదో తెలియకపోవచ్చు, అయినప్పటికీ ధర అదే మొత్తంలో పెరుగుతుందో లేదో ఖచ్చితంగా చెప్పగలుగుతారు తమ కంపెనీ బ్రాండ్ వినియోగదారులను వేరే కంపెనీ బ్రాండ్ వస్తువుల వైపు దృష్టి మరలకుండా ఉండేందుకు ఎక్కువ లాభాలను ఆర్జించేందుకు ష్రింక్‌ఫ్లేషన్ ఒక ఉపయోగకరమైన మార్గం.. ముడి పదార్థాల ధరలు, లేబర్ చార్జీలు పెరిగినప్పుడు వస్తువులను తయారు చేయడానికి అయ్యే ఖర్చు పెరుగుతుంది. వీటి వలన తదనంతరం లాభాలపై ప్రభావం చూపుతుంది. అమ్మకపుదారులు అమ్మకాలు తగ్గకుం డా ఉండేందుకు వస్తువుల ధరలు పెంచకుండా వాటి పరిమాణం తగ్గిస్తున్నారు.

గతంలో ఒక బ్రాండెడ్ మిక్చ ర్ ప్యాకెట్ 55 గ్రాములు ఉంటే అదే ధరకు 42 గ్రాములకు, వంట గిన్నెలు శుభ్రపరిచే సబ్బు గతంలో 155 గ్రాములు ఉంటే నేడు అదే ధరతో 130 గ్రాముల పరిమాణంతో లభిస్తుంది. ఒక కంపెనీ బిస్కట్ ప్యాకెట్ గతం లో 88 గ్రాములు ఉంటే నేడు 55 గ్రాములకు కుదించి అమ్ముతున్నారు. ప్రస్తుతం దేశంలో వస్తువుల ధరలు పెంచకుండా పరిణామాలు తగ్గించడం వలన వినియోగదారులు ధరలు పెరగలేదని భ్రమలో జీవిస్తున్నారు. దీనివలన వేతన జీవులకు వినియోగదారుల ధరల సూచిక ప్రకారం వారి కరువు భత్యం పెరుగుట లేదు.

ఆళవందార్ వేణు మాధవ్



## ఢిల్లీ ఎన్నికల్లో ఒక్కస్థానం నుంచే పోటీ : కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. మరో నెల రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో.. అధికార, విపక్ష పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఢిల్లీ మాజీ సిఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారంటూ బిజెపి ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. న్యూ ఢిల్లీతోపాటు మరో స్థానం నుంచి కేజ్రీ పోటీ చేయబోతున్నారంటూ బిజెపి నేతలు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై కేజ్రీవాల్ తాజాగా స్పందించారు. బిజెపి నేతల ఆరోపణలను ఖండించారు. తాను కేవలం ఒక్క స్థానం నుంచే పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా, న్యూ ఢిల్లీ స్థానం నుంచి కేజ్రీ వరుసగా నాలుగోసారి పోటీకి సిద్ధమయ్యారు. ఈ స్థానం నుంచి కేజ్రీవాల్‌పై బిజెపి తరపున మాజీ ఎంపి పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్నారు. మరోవైపు 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు 67, 62 స్థానాలతో ఆప్ క్లీన్ స్వీప్ చేసింది. హ్యాట్రిక్ విక్టరీతో మూడోసారి అధికారంలోకి రావాలని ఆ పార్టీ భావిస్తున్నది. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

## ఆరేళ్ల తరువాత ఎల్గార్ పరిషద్ కేసులో
# విల్సన్, ధవాలేకు బెయిల్

**తొమ్మిదికి చేరిన బెయిల్ లభించిన వారి సంఖ్య**
**ఇంకా ఆరుగురు జైలులోనే**



**ముంబాయి :** ఎల్గార్ పరిషద్ కేసులో ఇద్దరికి బొంబాయి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో అరెస్టయి జైలులో ఉన్న పరిశోధకుడు రోనా విల్సన్, సామాజిక కార్యకర్త సుధీర్ ధవాలేలకు బుధవారం బెయిల్ మంజూరు చేస్తూ, చెరి రూ.1 లక్ష పూచీకత్తు కింద జమచేయాలని ఆదేశించింది. వీరు 2018లో అరెస్టయినప్పటికీ నుంచి నేటి వరకు కేసుకు సంబంధించి విచారణ ప్రారంభం కాలేదని, సుదీర్ఘ కాలం ఖైదుగా ఉంచడం, అభియోగాలు నమోదు చేయకపోవడం అనే కారణాల ఆధారంగా బెయిల్ ఇస్తున్నట్లు జస్టిస్ ఎ.ఎస్.గడ్కరి, కమల్ ఖాతాలతో కూడిన ధర్మాసనం తెలిపింది. విచారణ జరిగే సమయంలో ఎన్ఐఎ కోర్టు ఎదుట హాజరుకావాలని, ఇరువురు తమ పాస్‌పోర్ట్‌లను అప్పగించాలని, విచారణ పూర్తయ్యేంత వరకు నగరం విడిచి వెళ్ళవద్దని షరతులు విధించింది. "కేసుకు సంబంధించి మంచి చెడు జోలికి మేము వెళ్ళడం లేదు. దీర్ఘకాలం ఖైదుగా ఉండడంతో పడుతున్న ఇబ్బందులు, ఇప్పట్లో విచారణ పూర్తి అయ్యే అవకాశం లేకపోవడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్నాం. ఈ కేసులో 300లకు పైగా సాక్షులు ఉన్నారు. సమీప భవిష్యత్తులో కేసు విచారణ పూర్తవడం అసాధ్యం'' అని బెంచ్ పేర్కొంది. నిందితులు 2018 నుంచి జైలులోనే ఉన్న విషయాన్ని కూడా తెలిపింది. గత ఏడాది జూలైలో విల్సన్, ధవాలేతో పాటు , మరో ముగ్గురికి డిఫాల్ట్ బెయిల్ ఇచ్చేందుకు కోర్టు తిరస్కరించింది. అరెస్టయిన వారిలో ధవాలే మొదటి వ్యక్తి. ఆయన నిషిద్ధ సిపిఐ(మావోయిస్టు) క్రియాశీల సభ్యుడు అని ఆరోపణలు మోపారు. 2018 జూన్‌లో విల్సన్‌ను ఢిల్లీలోని ఆయన నివాసంలో అరెస్ట్ చేశారు. అర్బన్ మావోయిస్టుల ముఖ్య వ్యూహకర్తలలో ఆయన ఒకరని దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. 2017 డిసెంబర్ 31న మహారాష్ట్రలో ఎల్గార్ పరిషద్ సమావేశంలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని, మరుసటి రోజు భీమా–కోరేగావ్‌లో హింసకు దారి తీసిందని కేసు నమోదు చేశారు. ఆ సమావేశాన్ని మావోయిస్టులే వెనుక ఉండి నడిపించారని పుణె పోలీసులు పేర్కొన్నారు. అనంతరం దర్యాప్తును ఎన్ఐఎ తన చేతుల్లోకి తీసుకుంది.

**విడుదలకు 2–3 రోజులు**

కాగా, వారిరువురు విడుదల అయ్యేందుకు రెండు, మూడు రోజులు పడుతుందని విల్సన్ న్యాయవాది రాహుల్ అరోటే తెలిపారు. ఎన్ఐఎ ప్రత్యేక కోర్టుకు పూచీకత్తులు, బెయిల్ బాండ్‌లు సమర్పించేందుకు ఇంత సమయం పడుతుందని చెప్పారు. ఆ తరువాత వారిద్దరు తలోజా జైలు నుంచి విడుదల అవుతారని వెల్లడించారు. కుల వ్యతిరేక సంస్థ రిపబ్లికన్ ప్యాంథర్స్ పార్టీకి ధవాలే వ్యవస్థాపకుడు. ఆయన కవి, రాజకీయ వ్యాఖ్యత, వామపక్ష మరాఠీ మ్యాగజైన్ విద్రోహికి ప్రచురణ కర్త. విల్సన్ కేరళకు చెందిన వ్యక్తి. ఆయన రాజకీయ ఖైదీల విడుదల కమిటీ వ్యవస్థాపక సభ్యులలో ఒకరు.

**జైలులోనే మరో ఆరుగురు**

తాజాగా బుధవారం ఇద్దరికి బెయిల్ మంజూరు చేయడం ద్వారా ఎల్గార్ పరిషద్ కేసులో అరెస్టయిన 16 మందిలో తొమ్మిది మందికి బెయిల్ లభించినట్లయింది. ఒకరు కస్టడిలోనే మరణించారు. జార్ఖండ్‌కు చెందిన అటవీ హక్కుల ఉద్యమకారుడు ఫాదర్ స్టాన్ స్వామి (84) కస్టడీలోనే 2021 జూలైలో మరణించారు. మహేష్ రౌత్‌కు బెయిల్ లభించినప్పటికీ దానిపై స్టే విధించగా, కేసు సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది. అయితే, లా పరీక్షలు రాసేందుకు సోమవారం నాడు ప్రత్యేక కోర్టు బెయిల్ ఇచ్చింది. ఈ కేసులో బెయిల్ లభించకపోవడంతో న్యాయవాది సురేంద్ర గాడ్లింగ్ , ఢిల్లీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ హనీ బాబు, సాంస్కృతిక కార్యకర్తలు సాగర్ గోర్ఖే, రమేశ్ గాయ్చోర్, జ్యోతి జగ్తాప్‌లు ఇంకా జైలులోనే ఉన్నారు. బెయిల్‌పై విడుదలైన వారిలో సుధా భరద్వాజ్, వరవరరావు, ఆనంద్ తేల్‌తుంబ్డే, వెర్నాన్ గొంజాల్వేస్, అరుణ ఫెరేరా, షోమాసేన్, గౌతమ్ నావ్లాఖాలు ఉన్నారు.

## విద్యకు డబ్బు ఇవ్వాలని తల్లిదండ్రులపై ఒత్తిడిచేసే హక్కు కుమార్తెకు ఉంది

**విడిపోయిన దంపతుల కేసు విచారణలో 'సుప్రీంకోర్టు' స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ :** కుమార్తె తన తల్లిదండ్రులనుంచి విద్య కోసం ఖర్చులను పొందేందుకు అజేయమైన, చట్టబద్ధంగా అమలుచేయదగిన, చట్టబద్ధమైన హక్కును కలిగి ఉన్నదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. 'వారు తమ పరిధిలో అవసరమైన నిధులను వారి మార్గాల ద్వారా అందించడానికి బలవంతం చేయవచ్చు' అని ఇటీవల సుప్రీంకోర్టు తెలిపింది. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఒక వివాహసంబంధ వివాదం విచారణలో ఈ వ్యాఖ్యలు చేసింది. ఐర్లాండ్‌లో చదువుతోన్న ఒక విడిపోయిన దంపతుల కుమార్తె ఆమె తల్లికి తన తండ్రి భరణంగా చెల్లించే రూ.43లక్షల మొత్తాన్ని నిరాకరించింది. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పందిస్తూ 'మొత్తం భరణం ఆమె తల్లికి చెల్లించబడుతుంది' అని వెల్లడించింది. ఆమె కుమార్తె అయినందున ఆమె తల్లిదండ్రుల నుంచి విద్యా ఖర్చులను పొందే చట్టబద్ధమైన హక్కును ఆమె కలిగిఉన్నది. అంతేకాదు కుమార్తె తన విద్యను అభ్యసించే ప్రాథమిక హక్కును కలిగి ఉంది. 'అందుకోసం తల్లిదండ్రులు తమ ఆర్థికవనరుల పరిమితిలోపు అవసరమైన నిధులను అందించాలని ఒత్తిడి చేసింది' అని ధర్మాసనం జనవరి 2న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసు విచారణలో పార్టీలకు చెందిన కుమార్తె గురించి ధర్మాసనం మాట్లాడుతూ ఆ మొత్తాన్ని నిలుపుకోవడానికి నిరాకరించింది. అతను నిరాకరించిన డబ్బును తీసుకోమని కోరింది. న్యాయబద్ధంగా ఆ మొత్తాన్ని పొందేందుకు కూతురికి హక్కు ఉందని కోర్టు చెప్పింది. 'ఆమె తండ్రి ఎలాంటి బలవంతపు కారణాలు లేకుండా డబ్బును ఖర్చుచేశాడని చెప్పబడింది. ఆమె విద్యా విషయాలకు ఆర్థిక సహాయం అందించడానికి తండ్రి దృఢంగా ఉన్నాడని సూచిస్తున్నది.'ప్రతివాది నంబర్2( కుమార్తె) ఆ మొత్తానికి హక్కు పొందింది. అందువల్ల ఆమె ఆ మొత్తాన్ని అప్పీలుదారు (తల్లి)కి లేదా ప్రతివాది నంబర్ 1(తండ్రి)కి తిరిగి ఇవ్వనవసరం లేదు. ఆమెకి తగినట్లుగా సరిపోతుంది అని భావించవచ్చు' అని కోర్టు పేర్కొంది. 2024 సంవత్సరం నవంబరు 2న విడిపోయిన జంట కుదుర్చుకున్న సెటిల్‌మెంట్ ఒప్పందాన్ని ధర్మాసనం ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఆ సెటిల్‌మెంట్ అగ్రిమెంట్‌లో కూతురు సంతకం కూడా ఉన్నదని బెంచ్ గుర్తుచేసింది. విడిపోయిన భార్య, కూతురికి అతడు రూ.73లక్షల మొత్తాన్ని ఇచ్చేందుకు అంగీకరించాడని కోర్టు వివరించింది. రూ.43లక్షలు చెల్లించాలని కోర్టు పేర్కొంది. ఆ మొత్తాన్ని కూతురు విద్యాలక్ష్యాల కోసం, మిగిలిన మొత్తాన్ని భార్య కోసమని తెలిపింది. 'భార్య తన వాటా గా రూ.30లక్షలను స్వీకరించిందన్న విషయాన్ని ధర్మాసనం గ్రహించింది.

గత 26సంవత్సరాలుగా పార్టీలు విడివిడిగా జీవిస్తున్నారని, వారికి పరస్పర సమ్మతిపై విడాకుల డిక్రీని మంజూరు చేయకపోవడానికి ధర్మాసనం ఎలాంటి ఆధారం చూపలేదు. ఫలితంగా మేం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం మా అధికారాలను మేం అమలుచేస్తాం. పరస్పర అంగీకారంతో విడాకుల డిక్రీని మంజూరు చేయడం ద్వారా పార్టీల వివాహాన్ని రద్దు చేస్తాం' అని ధర్మాసనం పేర్కొంది. ఒప్పందం ప్రకారం పార్టీలు ఒకరిపై మరొకరు ఎలాంటి కోర్టు కేసును కొనసాగించొద్దు. ఏదైనా ఫోరమ్‌లో పెండింగ్‌లో ఉన్న కేసు ఉంటే అది ఒప్పందం ప్రకారం పరిష్కరించబడాలి. పార్టీలు భవిష్యత్‌లో ఒకదానిపై మరొకటి ఎటువంటి దావాను కలిగి ఉండవు. సెటిల్‌మెంట్ ఒప్పందం నిబంధనలు, షరతులకు కట్టుబడి ఉండాలి. ఇది ఈ క్రమంలో భాగంగా ఉండాలి' అని ధర్మాసనం తెలిపింది.

## దత్తతకు విశ్రాంతి జాగిలాలు

**న్యూఢిల్లీ :** దేశ రక్షణలో భాగమై ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న జాగిలాలను ప్రజలు దత్తత తీసుకునేలా వీలు కల్పిస్తూ సిఆర్‌పిఎఫ్ కీలక నిర్ణయం తీసుకుంది. అందుకు వీలుగా ఆన్‌లైన్ సేవలను ప్రారంభించింది. సాధారణంగా కేంద్ర, రాష్ట్రాల పోలీసులు తమ వద్ద రిటైర్డ్ అయిన శునకాలను.. సంరక్షణ కేంద్రాలు, రిజిస్టర్డ్ ఎన్‌జిఒ, పలు ప్రఖ్యాత సంస్థలకు అప్పగిస్తుంటారు. దేశరక్షణ కోసం పని చేసిన వీటిని సంరక్షణ కేంద్రాల్లో వదిలేయకుండా.. ప్రజలకు దత్తత ఇచ్చేందుకు సిఆర్‌పిఎఫ్ సిద్ధమైంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇదే తొలిసారి కావడం విశేషం. దాదాపు 8 నుంచి 12 ఏళ్ల వయసున్న ఈ జాగిలాలు దేశ వ్యాప్తంగా నక్సల్ వ్యతిరేక, ఉగ్రవాద వ్యతిరేక సాహస కార్యకలాపాల్లో పాల్గొన్నాయి. అయితే.. వీటిని ఇతరులకు అప్పగించినట్లయితే దేశ వ్యతిరేక కార్యాలకు ఉపయోగిస్తారనే అనుమానాలు ఉండడంతో ఇన్నాళ్లూ దత్తతకు ఇవ్వలేదని ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. కానీ, ప్రస్తుతం



వీటిని దత్తత తీసుకోవాలంటే కఠిన నిబంధనలు ఉంటాయి. దీని ప్రకారం.. దత్తత తీసుకున్న జాగిలాలను దుర్వినియోగం చేయకూడదు. వాటిని విక్రయించడం, ఇతరులకు హాని కలిగించడం చేయకూడదు. ఇలా దత్తత తీసుకునే వ్యక్తి ఒప్పంద పత్రంపై సంతకం చేయాల్సి ఉంటుంది. శునకం ఆరోగ్యం, టీకా ఇలా దానికి సంబంధించిన వివరాలను అందిస్తారు. బెల్జియన్ షెఫర్డ్ మాలినోయిస్, జర్మన్ షెఫర్డ్, లాబ్రడార్, ముధోల్ హౌండ్ జాతులకు చెందిన 30 రకాల కుక్కలను ప్రజలకు ఇచ్చేందుకు సిఆర్‌పిఎఫ్ సిద్ధమైంది.

## రోడ్డు ప్రమాదంలో నలుగురు యాత్రికులు మృతి

**రాణిపేట్ (తమిళనాడు) :** కూరగాయలతో నిండిన ట్రక్కును బస్సు ఢీకొనడంతో కర్ణాటకకు చెందిన కనీసం నలుగురు యాత్రికులు మరణించారని పోలీసు వర్గాలు తెలిపాయి. కోలార్‌కు చెందిన బాధితులు చెన్నై సమీపంలోని ఒక ఆలయాన్ని సందర్శించి కెఎస్‌ఆర్‌టిసి బస్సులో ఇంటికి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో దాదాపు 30 మంది గాయపడ్డారు.



కెఎస్‌ఆర్‌టిసి బస్సు దాదాపు 55 మంది ప్రయాణికులతో బెంగళూరు వైపు వెళుతుండగా, డ్రైవర్ టిప్పర్ లారీని ఓవర్‌టేక్ చేసినప్పుడు ఈ ప్రమాదం జరిగింది. బస్సు ఎదురుగా వస్తున్న కూరగాయలతో నిండిన ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించినట్లు వారు తెలిపారు.

## భోపాల్ సెంట్రల్ జైలులో డ్రోన్ కలకలం

**భోపాల్ :** మధ్యప్రదేశ్ భోపాల్‌లోని సెంట్రల్ జైలులో ఓ చైనా డ్రోన్ కలకలం సృష్టించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అండా సెల్‌గా పిలిచే ఈ జైలులో భయంకరమైన గూండాలు, ఉగ్రవాదులు ఉంటారు. బుధవారం రాత్రి హైరిస్క్ సెల్ వెలుపల ఓ డ్రోన్ ఉండటాన్ని పెట్రోలింగ్ గార్డ్ గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన గార్డ్ పైఅధికారులకు సమాచారమిచ్చారు. ఆ డ్రోన్ చైనాకు చెందినదిగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అంతేకాక, అందులో రెండు లెన్సులు కలిగిఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ డ్రోన్ ఎక్కడి నుంచి వచ్చింది?, ఎవరికి చెందినది అనే విషయాన్ని సాంకేతిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. భోపాల్ సెంట్రల్ జైలు దేశంలోని అత్యంత ప్రమాదకరమైన జైళ్లలో ఒకటి.



ఇందులో వివిధ ఉగ్రవాద సంస్థలకు చెందిన 70 మంది ఉగ్రవాదులు హైసెక్యూరిటీ సెల్‌లో ఉన్నారు. గణతంత్ర దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం అందరినీ భయాందోళనకు గురిచేస్తుంది. ఈ ఘటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు.

## సమన్వయ లోపంతోనే దుర్ఘటన

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకష్ణ**



**అమరావతి:** తిరుమల తిరుపతి దేవస్థానం, పోలీసు అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగానే తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు జారీ కౌంటర్ల వద్ద తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు దుర్మరణం చెందారని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ అభిప్రాయపడ్డారు. తొక్కిసలాటలో మతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి రూ.5 లక్షలు వంతున పరిహారం చెల్లించాలని రామకష్ణ డిమాండు చేశారు. వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు కోసం వచ్చి... తిరుపతి నగరం బైరాగపట్టెడలో పద్మావతి పార్క్ వద్ద భక్తుల మధ్య జరిగిన తొక్కిసలాటలో మతి చెందిన వారి భౌతికకాయాలకు రుయా ఆస్పత్రి శవాగారంలో నివాళులు అర్పించారు. అనంతరం రామకష్ణ పాత్రికేయులతో మాట్లాడుతూ పవిత్ర హదయంతో దేవుడి దర్శనానికి వచ్చి భక్తులు దుర్మరణం చెందడం బాధాకరమన్నారు. అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని ఉంటే ఈ దుర్ఘటన జరిగి ఉండేది కాదని ఆయన అభిప్రాయపడ్డారు. టిటిడి, పోలీసు అధికారుల మధ్య సమన్వయ లోపమే ఈ దుర్ఘటనకు కారణమన్నారు. టిటిడి, పోలీసులు సకాలంలో సరైన చర్యలు చేపట్టకపోవడం వలనే ఆరుగురు ప్రాణాలు కోల్పోవలసి వచ్చిందని రామకష్ణ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు బొల్లినేని రాజగోపాల్ నాయుడు సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తున్నామని చెబుతున్నారని, అదే నిజమైతే ఈ దుర్ఘటన ఎలా జరిగిందని రామకష్ణ ప్రశ్నించారు. సాధారణ భక్తులకు సరైన ప్రాధాన్యత లేదని భక్తులే చెబుతున్నారన్నారు. ప్రముఖులకే తిరుమలలో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. టీటీడీ అధికార యంత్రాంగం వీఐపీల సేవలో తరిస్తోందని ఆయన ఆరోపించారు.

## సమస్యల పరిష్కారం కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తాం

**ఇండియా కూటమి శాశ్వతం : ఫరూక్ అబ్దుల్లా**

**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లో నెలకొన్న ముఖ్యమైన సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వానికి సహకరిస్తామని, న్యూఢిల్లీతో పోరాటం చేసే ఉద్దేశం తమ పార్టీకి లేదని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా స్పష్టం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇండియా కూటమిలో ఐక్యతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పోటీ చేయడం కేసమే కూటమి ఏర్పడలేదని, దేశాన్ని బలోపేతం చేసేందుకు, ద్వేషాన్ని అంతమొందించేందుకు ఏర్పాటయిందన్నారు. కూటమి శాశ్వతంగా ఉంటుందని, ప్రతి రోజు, ప్రతి క్షణం దేశం కోసం పోరాటం చేస్తూనే ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఢిల్లీ వ్యక్తిగా మారిపోయారని వస్తున్న వ్యాఖ్యలపై సహా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్ వేర్వేరుగా పోటీ చేస్తుండడంతో ఇండియా బ్లాక్‌లో చీలికలు వచ్చాయి అంటు వస్తున్న కథనాలు, జమ్ముకశ్మీర్‌లో ద్వంద్వ అధికారం, మహాకుంభమేళా, తిరుపతి తొక్కిసలాటపై అడిగిన పలు ప్రశ్నలకు ఫరూక్ అబ్దుల్లా స్పందించారు. తాము న్యూఢిల్లీతో పోరాటం చేయాలనుకోవడం లేదని, రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకునేందుకు ఢిల్లీతో కలిసి పనిచేస్తామని చెప్పారు. తాము పోరాటాల్లో పెద్దగా పాల్గొనబోమని, ఎవరైనా పోరాటం చేయాలనుకుంటే చేసుకోవచ్చన్నారు. జమ్మకశ్మీర్‌లో నిరుద్యోగంపై ఫరూక్ అబ్దుల్లా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య అతిముఖ్యమైనదిగా ఉందన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు ప్రజా సమస్యలు ఎలా పరిష్కంచగలమన్నారు. ఆసుపత్రులు, పాఠశాలల్లో భయంకరమైన పరిస్థితులు ఉన్నాయని, టీచర్లు, డాక్టర్లు, వైద్యాధికారులు అవసరం ఉన్నారని, ఈ నేపథ్యంలో అనవసరంగా పోరాటాలు జరుగుతున్నాయని తెలిపారు. బిజెపితో నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఎలాంటి సంబంధం లేదని, అయితే స్థానిక సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉండడం కనీస బాధ్యత అని అన్నారు. తాము బిజెపితో లేమని, ఆ పార్టీతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోబోమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రజా అసవరాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు. ఒకరికొకరి విభేదాలు సృష్టించుకుంటూ పురోగతిని అడ్డుకోకూడదని సూచించారు. అబ్దుల్లా న్యూఢిల్లీకి ప్రభావితమయ్యారని వస్తున్న వ్యాఖ్యలపై ఎన్‌సి చీఫ్ స్పందిస్తూ ఒమర్ అబ్దుల్లా ప్రజల చేత ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడ్డారని స్పష్టం చేశారు. ఏ ఒక్కరి సూచనలతోనే పనిచేయబోరన్నారు. తన సొంత నిర్ణయాలతో పనిచేస్తారని చెప్పారు. బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగిన తొక్కిసలాటపై స్పందిస్తూ ప్రాణాలు కోల్పోయే ఘటనలను నిరోధించాలని, ముఖ్యంగా మతపరమైన ప్రదేశాలు, పండగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇండియా



కూటమిలో తలెత్తుతున్న గందరగోళం గురించి అడిగిన ప్రశ్నకు అబ్దుల్లా మాట్లాడుతూ 'ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసం ఏర్పడిందే కాదు, భారతదేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసం ఏర్పాటయింది. ఈ కూటమి పార్లమెంటరీ ఎన్నికల కోసం మాత్రమే ఏర్పాటయిందని తప్పుడుగా భావిస్తున్నారు. ఈ కూటమి శాశ్వతమైనది' అని అన్నారు. ద్వంద్వ పాలన నిర్మాణం గురించి ప్రశ్నలకు సమాధానమిస్తూ, జమ్ము కశ్మీర్‌లో ద్వంద్వ శక్తి నిర్మాణం పూర్తి రాష్ట్ర హోదా పునరుద్ధరించబడిన తర్వాత స్థిరపడుతుందని పేర్కొంటూ, రాష్ట్ర హోదా డిమాండ్‌ను అబ్దుల్లా పునరుద్ఘాటించారు. విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తి నేషనల్ కాన్ఫరెన్స్‌లో చేరడంపై వచ్చిన వివాదంపై అబ్దుల్లా మాట్లాడుతూ, ఏ కేసులో అతని ప్రమేయం ఉందని నాకు తెలియదు. అతను అన్ని ఆరోపణల నుండి విముక్తి పొందే వరకు, పార్టీలోకి తీసుకోబోమని తాము ప్రకటించామని చెప్పారు.

## లోక్‌సభ ఎన్నికల కోసమే ఇండియా కూటమా?

**అలా అయితే వెంటనే రద్దు చేయండి: ఒమర్ అబ్దుల్లా**



**న్యూఢిల్లీ :** ఇండియా కూటమికి ఎటువంటి కాలపరిమితి లేదని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. కూటమి నాయకత్వం, ఎజెండాకు సంబంధించి స్పష్టత లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కూటమి పార్లమెంటరీ ఎన్నికలకు మాత్రమే ఉద్దేశించబడితే దానిని వెంటనే రద్దు చేసుకోవాలన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు భారతీయ జనతా పార్టీ (బిజెపి)తో ఎలా సమర్థవంతంగా పోటీ పడాలో నిర్ణయించుకోవాలని అబ్దుల్లా అన్నారు. ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమిలోని భాగస్వామ్య పార్టీలన్నీ సమావేశం ఏర్పాటుకు సిద్ధంకావాలన్నారు. ఈ కూటమి పార్లమెంటరీ ఎన్నికలకు మాత్రమే అయితే, దానిని రద్దు చేయాలని, తాము వేరుగా పనిచేస్తామన్నారు. కానీ అది అసెంబ్లీ ఎన్నికలకు కూడా ఉద్దేశించబడితే, అందరు కలిసి కూర్చుని సమిష్టిగా పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికలకు మాత్రమే ఉద్దేశించబడిందని ఆర్‌జెడి నాయకుడు చేసిన వ్యాఖ్యలపై ప్రశ్నించగా పై విధంగా నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు సమాధానమిచ్చారు. తనకు గుర్తున్నంత వరకు, దీనికి ఎటువంటి కాలపరిమితి నిర్ణయించబడలేదని, సమస్య ఏమిటంటే ఇండియా కూటమి సమావేశం కాకపోవడ బాధాకరమన్నారు. కూటమికి అధి నాయకత్వం, పార్టీ లేదా భవిష్యత్తు వ్యూహం (ఇండియా బ్లాక్‌లో) గురించి స్పష్టత లేదని పేర్కొంటూ, 'ఈ కూటమి కొనసాగుతుందా లేదా అనేది కూడా అస్పష్టంగా ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ ఎన్నికల తర్వాత ఇంటియా కూటమి సభ్యులు సమావేశమవుతారని, దీనిపై త్వరలోనే స్పష్టత వస్తుందన్నారు. వచ్చే నెల ఢిల్లీ ఎన్నికలకు ముందు ఆప్‌కు మద్దతు పెంచడంపై మరొక ప్రశ్నకు అబ్దుల్లా సమాధానమిస్తూ 'ఢిల్లీ ఎన్నికలతో మాకు సంబంధం లేదు కాబట్టి ప్రస్తుతానికి దీని గురించి నేను ఏమీ చెప్పలేను. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్, క్షేత్రస్థాయిలో ఉన్న ఇతర రాజకీయ పార్టీలు బిజెపితో ఎలా బలంగా పోటీ పడాలో నిర్ణయిస్తాయి' అని అన్నారు. ఢిల్లీలో గతంలో రెండుసార్లు ఆప్ విజయం సాధించిందని పేర్కొంటూ, 'ఈసారి ఢిల్లీ ప్రజలు ఏమి నిర్ణయిస్తారో వేచి చూడాలి' అని అబ్దుల్లా అన్నారు.

## ఢిల్లీ గణతంత్ర ఉత్సవాలకు
# 10వేలమంది ప్రత్యేక ఆహ్వానితులు

**న్యూఢిల్లీ :** గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఢిల్లీలో వేడుకలకు 10,000 మంది ప్రత్యేక ఆహ్వానితులు వస్తున్నారు. వీరిలో పారా ఒలింపిక్‌కు హాజరైన ప్రముఖులు, అగ్రశేణి గ్రామ సర్పంచులు, నవకల్పనలు చేసిన నిపుణులు కూడా ఉన్నారు. గ్రామస్థాయిలో ఉత్తమప్రతిభ కనబరిచిన సర్పంచులు, చేనేత,హస్తకళా నిపుణులు, అటవీ, వన్యప్రాణి సంరక్షణ కార్యకర్తలు సహా మొత్తం 10 వేలమంది అతిథులు ఢిల్లీలోని కర్తవ్యపథ్ లో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరవుతారని ప్రభుత్వం గురువారంనాడు ప్రకటించింది. ఢిల్లీ గణతంత్ర వేడుకలలో దేశవ్యాప్తంగా ప్రజాభాగస్వామ్యాన్ని పెంచాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక ఆహ్వానితులను రప్పిస్తున్నారు. వీరంతా దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో పనిచేసే ప్రముఖులు. వీరిలో ప్రకృతి వైపరీత్యాల నియంత్రణకు పనిచేసే వర్కర్లు, జల సంరక్షణలో ప్రముఖులు, ఈశాన్యప్రాంత రాష్ట్రాలలో ఉన్న ఉత్తమశ్రేణి గ్రామాలకు చెందిన నిర్వాహకులు ప్రత్యేక అతిథులుగా ఈ ఉత్సవాలకు వస్తారు. వీరంతా జాతీయ యుద్ధవీరుల స్మారక కేంద్రాన్ని, ప్రధానమంత్రి సంగ్రహాలయాన్ని, ఢిల్లీలో ఉన్న ఇతర ప్రముఖ ప్రదేశాలను సందర్శిస్తారు. వివిధ శాఖల మంత్రులతో కూడా వారు సంభాషణలు చేస్తారు. వీరితోపాటు చదరంగం, ఒలింపియాడ్ మెడలిస్టులు, బ్రిడ్జ్ వరల్డ్ గేమ్స్‌లో రజత పతక గ్రహీతలు, స్నూకర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్టులు కూడా అతిథులుగా ఈ వేడుకలకు ఆహ్వానించినట్లు ప్రభుత్వ ప్రకటన తెలియజేసింది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేసిన గ్రామ సర్పంచులను ఆహ్వానించారు. కేంద్ర పాలనా సంస్కరణలు, ప్రజా సమస్యల పరిష్కార విభాగం నిర్వహించిన పోటీలలో విజేతలతోపాటు ఆహారం, పోషకాహారం, ఆరోగ్యం, నీరు, పారిశుద్ధ్యం వంటి రంగాలలో పనిచేసే స్వయం సహాయక బృందాల సభ్యులు హాజరవుతున్నారు. పిఎం జనమన్ మిషన్‌లో భాగస్వాములు, వన ధన్ వికాస్ యోజన సభ్యులు, జాతీయ ఎస్‌సి ఫైనాన్స్, డవలప్‌మెంట్ సూర్య ఘర్ పథకం కింద పునర్వినియోగ ఇంధన వినియోగదారులను కూడా మొదటిసారి ఈ వేడుకలకు ఆహ్వానిస్తున్నారు. అంకుర సంస్థల ప్రతినిధులు, అఖిలభారత స్కూల్ బ్యాండ్ పోటీలలో విజేతలైన దేశభక్తిగల స్కూలు పిల్లలు కూడా అతిథులుగా హాజరవుతున్నారు.

**ఢిల్లీలో రిపబ్లిక్ డే,అసెంబ్లీ ఎన్నికలకు 50 పారామిలిటరీ యూనిట్ల మోహరింపు**

ఢిల్లీలో 50 కంపెనీలకు పైగా పారామిలిటరీ బలగాలను మోహరిస్తున్నారు. ఈనెల 26న గణతంత్ర దినోత్సవం, ఆ తర్వాత ఢిల్లీ అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో 5,000 మందికి పైగా పోలీసు సిబ్బందిని, 50 కంపెనీల పారామిలిటరీ బలగాలను మోహరిస్తున్నట్లు గురువారంనాడు అధికారులు చెప్పారు. దేశ రాజధానిలో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష చేసేందుకు వివిధ చట్ట నిబంధనల అమలు ఏజెన్సీలతో కలిపి అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశాన్ని బుధవారంనాడు ఢిల్లీ పోలీసులు నిర్వహించారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. హర్యానా, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, బీహార్, రాజస్థాన్, చండీగఢ్, జమ్మూ కశ్మీర్ రాష్ట్రాలకు చెందిన పోలీసు అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. "50కిపైగా పారామిలిటరీ కంపెనీలు, సైబర్ స్పెషలైజ్డ్ ఆఫీసర్లు ఈ రెండు కార్యక్రమాలను సజావుగా నిర్వహించడానికి అవసరం అవుతారని ఢిల్లీ పోలీసులు ఈ సమావేశంలో కోరారు'' అని పోలీసు వర్గాలు తెలియజేశాయి. ఇంటిలిజన్స్‌కు సంబంధించిన వివిధ అంశాలను సమావేశంలో అధికారులు చర్చించారు. ఉగ్రవాద వ్యతిరేక చర్యలను పటిష్టంగా అమలు చేయాలని తీర్మానించారు. సరిహద్దుల్లో తనిఖీలు, అనుమానిత శక్తులపై నిఘా, వారి ఆరా తీయడం వంటి అనేక చర్యలు కఠినంగా చేపట్టాలని కూడా సమావేశంలో నిర్ణయించారని



వర్గాలు తెలియజేశాయి. మానవ వనరులతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని, సంబంధిత నైపుణ్యాన్ని విస్తారంగా వినియోగించుకోవాలని ఈ సమావేశంలో ఆరోరా ఉద్ఘాటించారు. అనుమానుతల కదలికలను కనిపెట్టేందుకు ముందస్తు సమాచారానికి ప్రాధాన్యం ఇవ్వాలని, వాహనాలను తనిఖీ చేయాలని కోరారు. అంతర్రాష్ట్ర ముఠాల కదలికలను కనిపెట్టాలని కోరారు. ఆయుధాలను, అక్రమ మద్యాన్ని, నగదును, మాదక ద్రవ్యాలను అంతర్రాష్ట్ర ముఠాలు తరలించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది. ట్రాఫిక్ నియంత్రణకు సమన్వయ చర్యలు తీసుకునేందుకు తగిన ఆలోచనలు చేసినట్లు నేరవిభాగం ప్రత్యేక కమిషనర్ దేవేశ్ చంద్ర శ్రీవాస్తవ చెప్పారు. అన్ని జిల్లాల డిసిపిలు, సీనియర్ అధికారులకు తగిన సన్నాహాలు ఎలా చేయాలో వివరించారు. ప్రతి జిల్లా డిసిపి అదనపు పారామిలిటరీ కంపెనీలను వారి వారి పరిధులలో సున్నితమైన ప్రదేశాలలో, వివాదాస్పద పోలింగ్ కేంద్రాలవద్ద మోహరించాలని ఆదేశాలు ఇచ్చారు. అక్రమ మద్యం, నగదు తరలింపు, నగదు పంపిణీ చర్యలను అడ్డుకునేందుకు కూడా అదనపు పోలీసు బలగాలను మోహరించాలని, ఆయుధాలను స్మగ్లింగ్ చేయకుండా అడ్డుకునేందుకు హింసను నివారించేందుకు కూడా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గణతంత్ర దినోత్సవం, పోలింగ్‌ల సందర్భంగా ఆయుధా దుర్వినియోగం జరక్కుండా చూస్తారు. గణతంత్ర దినోత్సవంనాడు అత్యున్నతస్థాయీ భద్రతా చర్యలు చేపడతారు. ఇప్పటికే ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకల సన్నాహాలు, సంబంధిత కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం 500కు పైగా హై రిజల్యూషన్ ఆర్టిఫీషియల్ ఇంటలిజన్స్ కెమెరాలు, ముఖాలను గుర్తించే కెమెరాలు అందుబాటులోకి తెచ్చారు.

**డాక్యుమెంట్ పోయినది**

నేను అనగా **రామావత్ బుజ్జి భర్త హాము.** నివాసం: కొత్తతండా, కే.గౌరారం గ్రామం, మండలం గుండ్లపల్లి, నల్లగొండ జిల్లా. నేను తేది: 30.12.2024న, సోమవారం దేవరకొండ నుండి మైనంపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్‌లో ప్రయాణం చేస్తుండగా మార్గ మధ్యలో నా భర్త రామావత్ హాము పేరు మీదున్న ప్లాటుకు సంభందించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ పోయినది. డాక్యుమెంట్ నంబర్. 4823/2016 డాక్యుమెంట్ దొరికినవారు సెల్: 9441109555 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయగలరు.

ఇట్లు
**రామావత్ బుజ్జి, భర్త: హాము**
కొత్తతండా,
కే. గౌరారం గ్రామం.

## జనరల్ హాస్పటల్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా జనరల్ ఆసుపత్రిని గురువారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర వైద్య విభాగంలోకి వెళ్లి చికిత్స పొందుతున్న రో గులను పరామర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రసూతి వార్డులో కాన్పులు జరుగుతున్న తీరును అక్కడ ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకు న్నారు. కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం, ఆసుపత్రి సూపరిం టెండెంట్ సత్యనారాయణ, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

## పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచండి

మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూర్యరాములు



**ప్రజాపక్షం/తిరుమలగిరి:** మున్సిపాలిటీ ప్రజలు తమ పరిసర ప్రాంతా లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ శాగంటి అనసూ ర్యరాములు అన్నారు. గురువారం పట్టణంలోని 8వ వార్డులో మురుగు కా ల్వలో మురుగునీరును తొలగించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు మున్సి పల్ ట్రాక్టర్లకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలన్నారు. తుంగతుర్తి శాసన సభ్యులు మందుల సామేల్ సహకారంతో మున్సిపాలిటిని అన్ని రం గాల్లో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గుగు లోతుభాస్కర్ నాయక్, చిర్రబోయిన హనుమంతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



అఖిల భారత ఐక్య రైతు సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** రైతులు పండించిన ప్రతి పంటకు ప్రభు త్వాలు గిట్టుబాటు ధరను కల్పించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఎఐయుకెఎస్) డివిజన్ నాయకులు పొన్నాల లచ్చిరెడ్డి అన్నారు. గురు వారం సంఘం కేంద్ర కమిటీ పిలుపుతో జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకవ చ్చిన నూతన వ్యవసాయక విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమా ండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందక అన్నదా తలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హా మీ పథకంలో రోజుకు రూ. 600చొప్పున 200 రోజుల పనిదినాలు కల్పిం చాలని, ఎలాంటి నిబంధనలు లేకుండా రూ.2లక్షలు ఆపై ఉన్న రైతు రుణ మాఫీని అమలు చేయాలన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు భరోసా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సామ సత్తిరెడ్డి, గోగుల వీరబాబు, శంకర్, జ్ఞానసుందర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

## ప్రగతికి దారులు వేయండి

అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం

రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్




**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రగతికి దారులు వేసి శాంతి కొరకు పోరాడాలని అ ఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్య దర్శి కెవిఎల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్‌లో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జిల్లా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయంగా యు ద్ధ వాతావరణం ఒకవైపు కొనసాగిస్తుంటే మరోవైపు సామ్రాజవాద దోపిడీ శక్తు లు యుద్ధాలను వ్యాపారంగా చేసుకుంటూ ప్రపంచాన్ని ప్రపంచ శాం తియుత సహజీవన విధానానికి దూరం చేస్తున్నారన్నారు. మేధావులు, అభ్యుదయవాదులు శాంతికాముకులు ప్రగతిశీరులంతా ఐక్యంగా యుద్ధా లకు వ్యతి రేకంగా గళం విప్పాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు తొగటి మురళి, జిల్లా నాయకురాలు అనంతుల మల్లేశ్వరి, పోలగాని రవి, గుగులోతు రాజారాం నాయక్, బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్ కుమార్, నిమ్మల ప్రభాకర్ పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ ఉచిత పంపిణీ

ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు



**ప్రజాపక్షం/చండూరు :** లక్ష్యసాధనకు పట్టుదల తోడైతే విజయాన్ని ఎవరు ఆపలేరని గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ ,ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు అన్నారు. మండల పరిధిలోని బంగారిగడ్డ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు గు రువారం గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్ ,ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు అరుణ దంపతులు స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడి శ్రీని వాసులు మాట్లాడుతూ విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌ను ఉపయోగించు కొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో కూడా కష్టపడిచదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్ర మం లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ రామలింగయ్య, ఉపాధ్యా యులు నర్సింహాచారి. టి. వెంకటేశ్వర్లు , బాబమ్మ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలంలోని ఖుదా బాక్స్ పెల్లి గ్రామ పం చా యతీకి చెందిన జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శి నక్క పార్వతి కారణం లేకుండా సెలవు పెట్టి గ్రామపంచాయతీ చార్జ్ ఇవ్వనందున జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు గురువారం ఎంపిడిఓ మున్నయ్య తెలిపారు.

# వచ్చే నాలుగేళ్ళలో సంక్షేమం పరుగులు

### రూ.3.90కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన : ఎంఎల్ఏ బాలునాయక్, ఎంపి రఘువీర్‌రెడ్డి

**ప్రజాపక్షం/డిండి :** వచ్చే నాలుగేళ్ల కాంగ్రెస్ పా లనలో దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రం గాల్లో అభివృద్ధి చేస్తామని నల్గొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్‌రెడ్డి, దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్‌లు అన్నారు. గు రువారం డిండి పట్టణంలో ఎస్టి ఎస్డిఎఫ్ 3కోట్ల 90లక్షల నిధులతో శ్రీశైలం హైదరాబాద్ జాతీ య రహదారి నుండి అంగడి బజార్ మీదుగా దేవరకొండ రోడ్డు వరకు రహదారి నిర్మాణానికి ఎంపి రఘువీర్‌రెడ్డి, ఎంఎల్‌ఏ బాలునాయక్‌లు శంకుస్థాపన చేశారు. డిండి పట్టణంలోని ఎంపి డివో కార్యాలయం వెనుక భాగాన ఇందిరమ్మ ఇంఢ్లకు సంబంధించిన మోడల్ హౌస్‌కు వారు శంకుస్థాపన చేశారు. అనంతరం డిండి తహశీల్దా ర్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబా రక్ చెక్కులను పంపిణి చేశారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపి రఘువీర్‌రెడ్డి, ఎంఎల్‌ఏ బాలునాయక్‌లు మాట్లాడుతూ జిల్లా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో ఎ దుల నుండి డిండి ప్రాజెక్టులోకి నీటిని పంపింగ్ చేసేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలపడం నియోజకవర్గ ప్రజలకు, రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీపి కబురు అందించిందని వారన్నా రు. డిండి ప్రాజెక్టు అంచనా వ్యయం 1800కో ట్లకు పెంచడం ప్రాజెక్టు ద్వారా 3.41లక్షల ఎక రాల ఆయకట్టు సాగునీరు అందనున్న నేపథ్య ంలో రైతుల ఆశలు చిగురించాయని తెలిపారు. అన్ని రంగాల్లో దేవరకొండ నియోజకవర్గం అభి వృద్ధి చేస్తామని, సంక్రాంతికి రైతు కూలీలకు రూ. 12వేలు అందిస్తామని, రైతులకు రైతు భరో సా ఇవ్వనున్నట్లు తెలిపారు. దేవరకొండ మార్కె ట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్‌రావు,



మండల పార్టీ అధ్యక్షులు రాజేష్‌రెడ్డి, సిపిఐ జిలా నాయకులు వెంకటరమణ, బుచ్చిరెడ్డి, కనకాచా రి, శైలేష్, పిఏసిఎస్ చైర్మన్ నాగార్జున్‌రెడ్డి, పిడి శేఖర్, డిఎఫ్ఓ చరిత, డిఈ శ్రీనివాస్, తహశీల్దార్ ఆంజనేయులు, ఎంపిడివో వెంకన్న, యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, గోపాల్‌రావు, యాదగిరి, జంగారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేష్, లక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, సలయ్య, వెంకట్‌రెడ్డి, సాయి, రేఖ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చండూరు :** నల్లగొండ జిల్లా చండూరు మండల తహసీల్దార్ దశ రథ గురువారం ప్రజాపక్షం జాతీయ తెలుగు దినపత్రిక 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడే పత్రికలు కొన్ని ఉంటాయని, అందులో ప్రజాపక్షం పత్రిక అగ్ర భా గాన ఉండాలన్నారు. పత్రికలు ప్రజలుకు ,ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉం డాలని వాస్తవాలను ప్రచురించాలన్నారు. ప్రజల సమస్యలు ప్రభుత్వానికి తెలిసే విధంగా పత్రికలు వారధిగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ నిర్మల , సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ ,సిపిఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, ప్రజా పక్షం చండూరు రిపోర్టర్ కర్నాటి వెంకటేశం , సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు దోటి వెంకన్న, ఆర్ఐలు శివ , శేఖర్ ,లింగస్వామి పాల్గొన్నారు.

# గ్రామాలను అభివృద్ధి చేస్తా

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/ఆత్మకూర్(యం):** నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్ ఆలేరు శాసనస భ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం మండల కేం ద్రంలో వివిధ కార్యక్రమాలలో పాల్గొని మాట్లాడుతూ మండల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న బునాదిగాని కాల్వ పనులను మార్చి నెలలో చేపడతామని ఆయన అన్నారు. ఆలేరు నియో జకవర్గం లో 120 చెరువులను గోదావరి జిల్లాలతో నింపి రైతు లకు సాగునీరు అం దిస్తున్నామన్నారు. మండల కేంద్రంలో మెయిన్ రోడ్డు నుండి హైస్కూల్ వరకు కోటి 75 లక్షలతో డబుల్ రోడ్డుకు శంకుస్థాపన, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అంగన్వాడీ కేంద్ర భవనానికి శంకుస్థాపన చేశారు. గోదావరి జలాలతో నిండిన వీర్ల చెరువులో నిర్వహించిన జలహారంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొరటికల్ ఆత్మకూర్ లోని బికేరి వాగులో నిర్మించిన చెక్ డాం వద్ద గోదావరి జలా లకు పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని మొరిపిరాల, సింగారం గ్రామంలో చేపట్టే సీసీ రోడ్డు పనులకు



శంకుస్థాపన చేశారు. ఈ కార్య క్రమంలో మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల నిర్మల, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు యాస లక్ష్మారెడ్డి, ముద్దసాని సిద్ధులు గౌడ్, మాజీ ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలం గౌడ్, మాజీ సర్పంచ్ జె నగేష్,ఓబిసి మండల అధ్యక్షులు బత్తిని ఉప్పలయ్య గౌడ్,పిఎసిఎస్ డైరెక్టర్ నోముల వెంకన్న, పట్టణ అధ్యక్షులు పోతగాని మల్లేశం గౌడ్,నాయకులు నరసింహా చారి,అనంత రెడ్డి,మహిళా అధ్యక్షురాలు పాశం వినోద, కోరి మల్లేశం,తవిటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులసేవలు, పనితీరు పర్యవేక్షణకు క్యూఆర్ కోడ్

పోస్టర్ ఆవిష్కరించిన ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** పోలీసులు అందిస్తున్న సేవలు, వారి పనితీరును పర్యవేక్షించేందుకు రా ష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీస్ శాఖ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో తీసుకువచ్చినట్లు జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ అన్నారు. గురు వారం జిల్లా పోలీస్ కా ర్యాలయంలో అదనపు ఎస్‌పి నాగేశ్వర్‌రావు, డిసి ఆర్‌బి డిఎస్‌పి మట్టయ్యలతో కలిసి క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి వివరాలను నమో దు చేయ వచ్చన్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్‌ను తెలు సుకునేందుకే రాష్ట్ర వ్యాప్తంగా సిటిజన్ ఫీడ్ బ్యాక్ కూఆర్ కోడ్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో పోలీసుల సేవలపై ఫిర్యాదులను ఫోన్ చేసి అభిప్రాయాలు సేకరించే వారని ప్రస్తుతం క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి పిటిషన్, ఎఫ్ఐ ఆర్, ఈ చలాన్, పాస్‌పోర్ట్ ధృవీకరణ పత్రంతో పాటు ఇతర అంశాలపై పోలీసు అధికారుల స్పం దన, ప్రవర్తన, వారి అభిప్రాయాలను నమోదు చేయవచ్చన్నారు. ప్రజలకు క్యూఆర్ కోడ్ కనిపిం చేలా రిసెప్షన్ సెంటర్, స్టేష న్ హౌజ్ అధికారి రూం, ప్రజలు వేచి ఉండే గది, బయట ప్రవేశ ద్వా రా వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్య క్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ నాగభూషణం, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఐటికోర్ ఆర్ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

## ఉద్యమకారులకు ప్రాధాన్యతనివ్వండి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** రాష్ట్ర ప్రభు త్వం అందించే సంక్షేమ పథకాల్లో మలిదశ ఉ ద్యమ కారులకు ప్రాధాన్యత ఇవ్వాలని మలి దశ ఉద్యమగారుల సంక్షేమ సంఘం చైర్మన్ రాపోలు నవీన్ కుమార్, బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధను ంజయ నాయుడులు అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలె క్టర్ పి.రాంబాబుకు పలు డిమాండ్లతో కూడిన విన తి పత్రం సమర్పించారు. అనంతరం వారు మా ట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం మలిదశ ఉద్యమ కారు లకు ఇల్లు, నెలకు రూ. 25వేలపింఛన్లు, ఆరోగ్య గార్డులు ఇవ్వాలని, ఉద్యమకారుల పిల్లలకు ఉచి త విద్య, వైద్యం అందించాలన్నారు. మలిదశ ఉ ద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మ లిదశ ఉద్యమకారుల జెఎసి నాయకులు సైదులు, రాజేష్, సతీష్, రామస్వామి, నాగార్జున, బాబు, వెంకట్, భరత్, హుస్సేన్, నరేష్, సుబ్బారెడ్డి, హరిబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### కార్మికుల హక్కులకు సహకరించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** కార్మికుల న్యాయమైన హక్కుల కోసం యాజమాన్యం సహక రించాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్ర ధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. గురువారం మండలంలోని ఇమాంపేట గ్రామ సమీపంలో హెచ్‌పిసిఎల్ ఆయిల్ ట్యాంకర్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి వేతన సవ రణ చేయాల్సిన యాజమాన్యం నిర్లక్ష్య వైఖరితో మూడు సంవత్సరాలు అవుతున్న వేతనాలు పెంచ కపోవడం సరైంది కాదన్నారు. యాజమాన్యం కా ర్మికులకు వేతనాలు పెంచి న్యాయం చేయాలన్నా రు. ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికుల హ క్కు లుసాధించే వరకు సమ్మెను కొనసాగిస్తామని హె చ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కా ర్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఎఐటియుసి ప్రాం తీయ సహాయ కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, వెం కట్, హరిబాబు, భరత్, హెచ్‌పిసిఎల్ అధ్యక్షులు ఎండి బాబా, కార్యదర్శి నాగరాజు, కార్మికులు రాచకొండ సాయి, తదితరులు ఉన్నారు.

# వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** వాహనదారులు హెల్మెంట్, సీటు బెల్టును విధిగా ధరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ అన్నారు. గురువారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్స వాల్లో భాగంగా జిల్లా పోలీస్, రవాణాశాఖల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో హెల్మెంట్ ప్రాధాన్యతపై అవగాహన కల్పిం చేందుకు భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారు నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంతోనే రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, వేగంగా వాహనాలు నడపవద్దని సూచించారు. రోడ్డు ప్రమా దంలో అధికంగా ద్విచక్రవాహనదారులు అధికంగా ఉంటు న్నారని, ఎంతోమంది క్షతగాత్రులుగా మారుతున్నారని చెప్పారు. హెల్మె ంట్ ధరిస్తే 90శాతం ప్రాణాలు కాపాడవచ్చ న్నారు. ప్రమాదాల నివారణ కోసం తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడం చేస్తున్నప్పటికి ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాలకు కళ్ళెం వేయవచ్చని సూచించారు. హెల్మెంట్ లేకుండా వాహా నాలు నడుపుతున్న వారికి టూ విలర్స్ అసోసియేషన్ వారు అందజేసిన హెల్మెంట్లు అందజేసి దాని ప్రాముఖ్యతను వివ రించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, ఆర్‌టిఓ సురేష్ రెడ్డి, ఎంవిఐ ఎస్ జయప్రకాష్ రెడ్డి, ఎ ఆధిత్య, ఎంవిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

ఎంఎల్ఏ పద్మావతిరెడ్డి



**ప్రజాపక్షం/అనంతగిరి:** ఏ ప్రభుత్వంలో జరగని అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలోనే జరుగు తుందని కోదాడ ఎంఎల్ఏ పద్మావతిరెడ్డి అన్నారు. గురువారం అనంతగిరి మండలంలోని పలు గ్రా మాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆమె శం కు స్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ గోండ్రియాలలో రూ.20 లక్షలతో గ్రా మ పంచాయతీ భవనం, శాంతినగర్‌లో రూ.12 లక్షలతో అంగన్‌వాడీ భవనం, పాలారం నుండి కిష్టాపురం వరకు రూ.కోటి 70 లక్షలతో బిటిరో డ్డు, పాలారం ఎంఆర్ఆర్ నిధులు 1.62 కోట్లతో పాలారం నుండి కోదాడ వరకు బిటిరో డ్డుకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. కోదాడ, హుజూ ర్‌నగర్ నియో జకవర్గాలను రాష్ట్రంలోనే ఉత్తమ ని యోజకవర్గాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ట్లు తెలిపారు. శాంతినగర్ గ్రామ వన నర్సరీని పరిశీలించారు.సీనియర్ కాంగ్రెస్ నేతలు వేనేపల్లి చందర్‌రావు, ముసుగు శ్రీనివాసరెడ్డి, బుర్రా పుల్లా రెడ్డి, కొండయ్య, కొండపల్లి వాసు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హత్యకేసులో నిందితుల అరెస్టు

వివరాలు వెల్లడించిన డిఎస్‌పి జి రవి



**ప్రజాపక్షం/చివ్వెంల:** ఆత్మకూర్(ఎస్) మండలంలోని లక్ష్మీ నాయక్‌తండాలో 31డిసెంబర్ 2024న రాత్రి ధరావత్ శేషును హత్య చేసిన నిందితులను పోలీసులు అదుపులో తీసు కున్నారు. గురువారం చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో సూర్యాపేట డిఎస్‌పి రవి హత్యకేసు వివరాలను వెల్లడించారు. ధరావత్ శేషుతో ధరావత్ వెంకన్న, శ్రీనులకు వ్యవసాయ భూమి వద్ద గెట్ల పంచాయతీ గత కొద్ది రోజులుగా నడుస్తుంది. 2027లో ఘర్షణ పడగా ఒకరిపై మరోకరు కేసులు పెట్టుకున్నారు. గత కొంత కాలంగా ధరావత్ శేషును హత్య చేయాలని ముందే ప థకం వేసుకున్నారు. దీనిలో భాగంగా ధరావత్ శేషు సూర్యా పేట నుండి మోటార్ సైకిల్‌పై తండాకు వస్తుండగా మార్గమ ధ్యంలో రాత్రి 12గంటల సమయంలో ఎస్ఆర్ఎస్‌పి కాల్వ వద్దకు వచ్చేసరికి ధరావత్ దీపక్ అతని స్నేహి తులు ధరావత్ రాజేష్, సురేష్, జర్పుల ప్రవీణ్‌లు మద్యం సేవిస్తూ కేకలు వేస్తుండగా శేషు మోటార్ సైకిల్ ఆపి అక్కడికి వెళ్లగా ధరావత్ దీపక్ శేషుతో పంచాయతీకి దిగాడు. మోటార్ సైకిల్‌లో ఉన్న కత్తిని తీసి శేషును పొడవగా అక్కడ ఉన్న రాజేష్, సురేష్, ప్రవీ ణ్‌లు పారిపోయారు. ఆ తరువాత దీపక్ అతని తండ్రి వెం కన్న, తల్లి సుజాతలతో కలిసి శేషుపై దాడికి పాల్పడ్డారు. వారి నుండి తప్పించుకోని శేషు తండాలోని వాంకుడోతు రంగా ఇ ంటి వెనుక గుడిసేలో దాచుకోగా వెంబడించి కత్తితో గొంతుకో సి హత్య చేశారు. ఈ విషయమై శేషు భార్య లలిత ఇచ్చిన ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. హత్య చేసిన తరువాత పరారైన నిందితుల్లో ధరావత్ దీపక్, వెంకన్న, సు జాత,రాజేష్, సురేష్,జర్పుల ప్రవీణ్‌లను కోట్యానాయక్ తం డాలో తమ బంధువుల ఇంట్లో ఉండగా పట్టుకున్నట్లు తెలిపా రు. వీరి నుండి నాలుగు సెల్ ఫోన్లు, మూడు సైకిల్ మోటార్లు, ఒక కత్తిని స్వాధీనం చేసుకొని నిందితులను కోర్టుకు రిమాం డ్‌కు తరలించారు. హత్య కేసులో మరో నిందితుడు ధరావత్ శ్రీను పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ జి రాజశేఖర్, ఎస్ఐ వి మహేష్, సిబ్బంది వెంకన్న, గోవ ర్ధన్, కె సుధీర్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

# చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** నకిలీ ప్రింటెడ్ ఇక్కత్ వస్త్రాలను చీరలను అరికట్టేందుకు, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. టై అండ్ డై సిల్క్ చీరల ఉత్పత్తిదారుల సంఘం 47వ వార్షికోత్సవం సందర్భంగా గండి చెరువు దేవాలయం వద్ద టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షులు భార త లవకు మార్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సర్వసభ్య, చేనేత కార్మికులు, నాయకులు, అనుబంధ సంఘాల ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ చేనేత సమస్యలపై పూర్తి అవగాహన ఉంది కార్మికుల జీవనోపాధిని పెంపొందించేందుకు జీవన ప్రమాణాలు పెరిగేం




దుకు ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు రుణాలు మంజూరు చేసి పరిశ్రమను బలోపేతం చేస్తామని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇక్కత్ చీరల వ్యాపారాన్ని మరింత విస్తృతంగా ప్రమోట్ చేయటం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. అన్ని రకాల చేనేత సమస్యల పరిష్కారం చేసే బాధ్యత ప్రభుత్వంపైన ఉందని రూ.30కోట్ల నిధులను త్రిఫ్ట్ పథకం కింద కేవలం పోచంపల్లికి కేటాయిం చడం సంతోషంగా ఉందన్నారు. రూ.20కోట్లతో మినీ ట్యాంక్ బండ్‌కు డిపిఆర్ సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే చొరవ తీసుకొని వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని, 25 శాతం చీరలు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని మున్సిపల్ చైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివా స్ కోరారు. ఈ సమావేశంలో కర్నాటి ధనంజయ, చిట్టిపోలు శ్రీనివాస్, పద్మశాలి మహాజన సంఘ అధ్యక్షులు సీత శ్రీరాములు, పోచంపల్లి కోఆపరే టివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, మాజీ మండలాధ్యక్షుడు బడుగుదానయ్య,గర్దాసు బాల య్య,కౌన్సిలర్ భోగ భానుమతి విష్ణు, చేనేత కార్మి క సంఘం అధ్యక్షులు ముఖ్య నాయకులు చేనేత వ్యాపారస్తులు కార్మికులు పాల్గొన్నారు.

# ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** ఆరోగ్యానికి వ్యా యామం తప్పనిసరని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం నార్కెట్ పల్లి పట్టణంలోని అమ్మనబోలు రోడ్డు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన మహదేవన్ జిమ్ ను ప్రారంభించారు. అనంతరం యాజమాన్యా నికి శుభాకాంక్షలు తెలియజేసి, కాసేపు జిమ్ పరికారలతో వ్యాయామం చేశారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బత్తుల ఉషయ్య గౌడ్, మాజీ జడ్పీటీసీ దూది మెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య,పట్టణ అధ్యక్షులు భరత్ గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బింగి మహేష్, ఇదుకుళ్ళ సంపత్,



గడ్డం పశుపతి,పి ప్రజ్ఞాపూరం సత్యనారాయణ, ఎస్ కే సమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధు లకు హాజరుకాని డాక్టర్ శ్రీహర్షకి, ల్యాబ్ టెక్నీషియన్ మమత, సుమతి ఎంపీహెచ్ఎస్ లకు శోకజ్ నోటీసులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ సందర్భంగా సిబ్బంది యొక్క అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించి, ఎంతమంది సిబ్బంది విధులకు హాజర య్యారని,ఎంత మంది సిబ్బంది ఆబ్సెంట్ అయ్యారని ఆరా తీశారు.అత్యవ సర విభాగం సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలన్నారు.హాస్పి టల్ లో ఉన్న ల్యాబ్ ను పరిశీలించారు. ఓ.పి రిజిస్టర్ ను పరిశీలించి, ప్రతి రోజు ఎంతమంది పేషెంట్లు ఆస్పత్రికి వస్తున్నారని, సంబంధిత అధికారు లను అడిగితెలుసుకున్నారు. మందుల స్టాక్ గురించి అడిగి తెలుసుకున్నా రు. మందుల కొరత లేకుండా చూడాలని, అవసరమైన మందులను అందు బాటులో ఉంచాలన్నారు . ఆసుపత్రిలో ప్రసవాలు గురించి ఆరా తీశారు. ఆసుపత్రిలో ఉన్నవార్డుల పరిశీలన, హాస్పటల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన సేవలు అందించాలని ఆసుపత్రి నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. ఈ కార్యక్ర మంలో మెడికల్ ఆఫీసర్ సుమలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలుడి వైద్యానికి కలెక్టర్ ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** బాలుడి వైద్యానికి జిల్లా కలెక్టర్ ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. ముస్తాబాద్ మండలం సేవాలాల్ తండాకు చెందిన రమావత్ చందు కొడుకు రమావత్ రోహిత్ ఇల్లంతకుంట మండలం గాలిపెల్లిలోని బిసి సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్నాడు. ఇటీవల పాముకాటుతో గాయపడి దవాఖానాలో చికిత్స పొందాడు. వైద్య ఖర్చులకు సంబంధించిన 1లక్ష 50వేల రూఐ.ల చెక్కును రమావత్ చందు భార్య రజితకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం అందజేశారు. అలాగే విద్యార్థికి పదోతరగతి వరకు మెరుగైన విద్యను అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ మేరకుచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యా వ్యవస్థకు ప్రభుత్వం పెద్దపీట



**ప్రజాపక్షం/ధర్మపురి:** ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పిస్తూ నాణ్యమైన విద్యాభోదన అందించడం ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని జడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన వంట పాత్రల పంపిణీ కార్యక్రమంలో అడ్లూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావ్యవస్థ పటిష్టతకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ సర్కారు కట్టుబడి ఉందని విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడంపై ప్రత్యేకశ్రద్ధ చూపుతున్నామని అన్నారు. విద్యార్థులకు మిడ్ డే మీల్స్ అందించే కార్మికుల వేతనాలు పెంపు, మెనూ లోని గుడ్డు ధర పెంచే విషయం తన దృష్టికి వచ్చిందని, వంటకు సిలిండర్ల కొరత తదితర ఇబ్బందులపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. విద్యార్థులకువడ్డించే భోజనంలో నాణ్యత పాటించేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాలు బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, మండల విద్యాధికారి సీతాలక్ష్మి, కౌన్సిలర్ అనంతుల విజయలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, పాఠశాల యాజమాన్య కమిటీ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## సంక్రాంతి పండుగకు ఊరు వెళ్తున్నారా..

### జాగ్రత్త చర్యలు చేపట్టాలి: ఎస్‌పి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** సంక్రాంతి పండగ సెలవులు పురస్కరించుకుని సొంత ప్రాంతాలకు బంధువుల ఇండ్లకు, విహార యాత్రలకు వెళ్లే ఆయా గ్రామాల, కాలనీ ఆపార్ట్‌మెంట్ వాసులు దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా చోరీల నియంత్రణకు గ్రామాల్లో పట్టణాల్లో ముమ్మర పెట్రోలింగ్ చేయడం జరుగుతుందని, దీనికి అనుగుణంగా జిల్లా ప్రజలు సైతం పోలీస్ వారి సలహాలు సూచనలు పాటిస్తూ సహకరించాలని కోరారు. ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి ఆభరణాలుడబ్బులు బ్యాంక్ లాకర్లో భద్రపరుచుకోవాలని లేదంటే మీ ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలని అన్నారు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచకూడదని, సెలవుల్లో బయటికి వెళ్తున్నప్పుడు మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టం ఉండే తాళం, సెక్యూరీటి అలారం, మోషన్ సెన్సార్లు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. ఊరు వెళ్తున్నప్పుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలుగమనించాలని చెప్పాలన్నారు. ఇంటికి తాళం వేసిన తరువాత తాళం కనబడకుండా డోర్ కర్టేన్ వేయాలన్నారు. ఇంట్లో ఎదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలన్నారు. ఇంట్లో లేనప్పుడు పని మనుషులు ఉంటే రోజు వాకిలి ఊడ్చమని చెప్పాలన్నారు. మీ గ్రామం, పట్టణం, కాలనీలో ఎవరైనా అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కి గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌లో గానీ సమాచారం ఇవ్వాలన్నారు. సూచనలు సలహాలు పాటిస్తే దొంగతనాలు నియంత్రించవచ్చని అన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత



**ప్రజాపక్షం/కొమురవెలి:** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామానికి చెందిన ఎల్ల రామచంద్రం గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరైన రూ.13,500 రూపాయల సీఎం సహాయనిధి చెక్కును బాధిత కుటుంబ సభ్యునికి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏర్పుల మహేష్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా ఉండి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుకు సహాయ సహకారాలు అందించిన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, జనగామ నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సున్నం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## బావిలో పడి బాలుడు మృతి



**ప్రజాపక్షం/మల్లాపూర్:** మండలంలోని గొర్రెపల్లి గ్రామానికి చెందిన నేదునూరి కార్తీక్(14) చేపల వేటకు వెళ్లి వ్యవసాయ బావిలో జారిపడి ఈత రాక మునిగి చనిపోయాడని ఎస్సై రాజు గురువారం తెలిపారు. బుధవారం సాయంత్రం వేళ ఇంటి నుండి బయటకు వెళ్లిన కార్తీక్ ఎంతకు తిరిగి రాకపోవడంతో తండ్రి రాజం స్నేహితులను చుట్టు పక్కల బంధువులను ఆరా తీయగా, ఆచూకీ లభించలేదని, గ్రామ శివారులో వెతికి క్రమంలో గ్రామానికి చెందిన నర్సయ్య వ్యవసాయ బావి దగ్గర మృతుని చొక్కా చెప్పులు లభ్యం కావడంతో వ్యవసాయ బావిలో కాలుజారి పడి ఈత రాకని తన కొడుకు మృతి చెందాడని తండ్రిరాజం పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# రైతులకు నష్టం వాటిల్లకుండా చర్యలు

### మేడారం రిజర్వాయర్‌కు రంగ ధాములపల్లి చెరువు గుండెకాయ వంటిది

### ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రంగదాముని పల్లి చెరువును గురువారం రోజున ఇరిగేషన్ అధికారులు, మండల నాయకులతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గంలో తలాపున గోదావరి నది ఉన్న, ధర్మారం మండలంలో మేడారం రిజర్వాయర్ ఉండి కూడా గత ప్రభుత్వంలో ఉన్న పాలకులు ఇక్కడి ప్రాంత రైతంగానికి సాగు నీటిని అందించలేకపోయారు. రంగదాముని పల్లి చెరువుపై ఆధారపడి వెల్లటూర్, గొల్లపల్లి, పెగడపల్లి మండలంలోని సుమారు 20 గ్రామాలకు చెందిన 700 ఎకరాలకు పైగా ఆయకట్టును రైతులు సాగు చేసుకోవడం జరుగుతుంది. మేడారం నంది రిజర్వాయర్, రంగధాముల పల్లి చెరువు అనేటివి ధర్మపురి నియోజకవర్గానికి గుండెకాయ వంటిదని అన్నారు. కానీ గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో కొప్పుల ఈశ్వర్ విప్‌గా, మంత్రిగా వ్యవహరించి ఇక్కడి ప్రాంత నీటిని సిరిసిల్ల, సిద్దిపేటకు తీసుకెళ్లే విధంగా ఆలోచనలు చేశారు తప్ప ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి రంగదామునిపల్లి వద్ద ఒక రిజర్వాయర్ ఏర్పాటు చేసి ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించాలన్న ఆలోచన ఎన్నడూ చేయలేదని అన్నారు. కాళేశ్వరం లింక్ 2 పేరుతో రైతుల భూములను లాక్కున్నారు తప్ప రైతులకు సాగునీరు ఇవ్వలేదని అన్నారు. ఏ ప్రాజెక్టుకు ఎక్కువ వ్యయం అవుతుందో, కమిషన్లు ఎక్కడ వస్తాయో అక్కడే గత పాలకులు శ్రద్ధ పెట్టారు తప్ప రైతుల గురించి గాని సాగు నీరు గురించి గాని కనీసం పట్టించుకోలేదన్నారు. కానీ ప్రస్తుత మన ప్రభుత్వంలో రైతుల సూచనలను కూడా పరిగణలోనికి తీసుకొని ముందుకు వెళుతున్నామన్నారు. రైతులు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఏ ఒక్క రైతుకు నష్టం వాటిల్లకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ భీమ సంతోష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి, గౌతమ్ రాజ్, గంగాధర్, మహేష్, లింగయ్య, అనిల్,అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## కెజిబివిలో ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించిన ప్రభుత్వ విప్

**ప్రజాపక్షం/చందుర్తి:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆన్‌లైన్ తరగతులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చొరవతో రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలోని 13 కెజిబివి పాఠశాలల్లో ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించడం జరిగిందన్నారు. దీనివల్ల కెజిబివి ల్లో చదువుతున్న విద్యార్థినులకు పోటి పరీక్షల్లో రాణించేలా శిక్షణ లభిస్తుందన్నారు. ఆన్‌లైన్ తరగతులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఐఐటి, జేఈఈ, నీట్ పరీక్షల్లో సీట్లు సాధించి ఉపాధ్యాయులకు, తల్లి దండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మి రాజం, మండల అధికారులు, మండల విద్యాధికారి వినయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ఎంపిడిఓపై కలెక్టర్ గరం!



**ప్రజాపక్షం/చందుర్తి:** చందుర్తి ఇంఛార్జ్ ఎంపిడిఓ ప్రదీప్‌పై కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలను సందర్శించినప్పుడు పాఠశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించిన నేటికి శుభ్రం చేయలేదని సీరియస్ అయ్యారు.అలాగే మండలంలో పారిశుద్ధ్య పనులు సరిగా నిర్వహించడం లేదనిలేదని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఫిర్యాదులు అందాయని,'పని చేయడం చేతకాక పోతె ఇంటి వద్ద ఉండండి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎన్‌ఆర్‌జిఎస్, 15వ ఆర్థిక సంఘం పనులు త్వరితగతిన పూర్తి

### కలెక్టర్ మనుచౌదరి




**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** జిల్లాలో ఎన్‌ఆర్ జిఎస్ ద్వార గ్రామపంచాయతీ, అంగన్‌వాడి, సిసి రోడ్డు తదితర పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. ఇప్పటి వరకు అనుమతి పొందిన అంగన్‌వాడి భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. గురువారం సిద్దిపేట సమీకృత కలెక్టరేట్‌లో 15వ ఆర్థిక సంఘం, ఎన్‌ఆర్‌జిఎస్ ద్వారా మంజూరైన వివిధ పనులపై జిల్లా కలెక్టర్ మను చౌదరి సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో భూసమస్యలున్న వాటి వివరాలు అందించాలన్నారు. ఇంకా ప్రారంభించాల్సిన పనుల వివరాలు అందించాలన్నారు. పనులకు అదనంగా నిధులు మంజూరైతే వాటి వివరాలు తెలుపాలన్నారు. అదే విధంగా 15వ ఆర్థిక సంఘం ద్వారా చేపడుతున్న సబ్‌సెంటర్లు నిర్మాణాలను పూర్తి చేయాలని, పనుల పురోగతిని ప్రతి వారం సమీక్షిస్తామన్నారు. అదే విధంగా అధికారులు సైతం క్షేత్ర స్థాయిలో పనుల పురోగతిని పర్యవేక్షించటంతో పాటు సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఇప్పటకే కొన్ని నిర్మాణ పనులు ప్రారంభించి వాటిని ఈ ఆర్థిక సంవత్సరంలో చివరిలోగా పూర్తి చేయాలన్నారు. అదే విధంగా టెండర్ దశలో ఉన్న వాటిని త్వరగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పల్వన్ కుమార్, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వివిధ కోర్సుల్లో శిక్షణకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

### కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** జనవరి 10 నుంచి టాస్క్ ద్వారా వివిధ కోర్సులు శిక్షణకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం అవుతాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.పెద్దపెల్లి జిల్లాలోని నిరుద్యోగ విద్యార్థిని విద్యార్థులు ఇటీవల రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు ప్రారంభించిన టువంటి నైపుణ్యాభివృద్ధి కేంద్రం టాస్క్ ద్వారా వివిధ కోర్సులకు సంబంధించి శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నామని తెలిపారు.ఈ శిక్షణా తరగతులలో ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు నిష్ణాతులైన బోధకులచే తరగతులను నిర్వహించడం జరుగుతుందని , అంతే కాకుండా టాస్క్ కేంద్రంతో ఒప్పందం కుదుర్చుకున్న బహుళ జాతి సంస్థలలో ఉద్యోగ అవకాశాలను కూడా ఇప్పించడం కోసం జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఔత్సాహికులైన నిరుద్యోగ విద్యార్థులు అందరూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని, ఆసక్తి కల విద్యార్థులందరూ టాస్క్ కేంద్రానికి వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, జనవరి 10 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయని, అదేవిధంగా తరగతులు జనవరి 20 నుంచి ప్రారంభమవుతాయని ,ఇతర వివరములకు పెద్దపల్లి ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో గల టాస్క్ ఆఫీసులో సంప్రదించగలరని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి




**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** మహిళలు ఉచిత శిక్షణ కేంద్రాలలో ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని నాబార్డ్ సిజిఎం ఉదయ్ భాస్కర్ తెలిపారు. గురువారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్, ఆర్‌సెటి ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణను పరిశీలించి, వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత శిక్షణను మహిళలు వినియోగించుకోవాలని, ఆర్థికంగా మహిళలు ఎదగడానికి బ్యాంక్‌లు లోన్‌లు ఇచ్చి సహకారం అందిస్తాయని తెలిపారు. ఇక్కడ శిక్షణ పొంది సమయాన్ని వృధా చేయకుండా సొంత వ్యాపారం ప్రారంభించాలని సూచించారు. శిక్షణ అనంతరం సంస్థ నుండి పరీక్ష నిర్వహించి సర్టిఫికేట్స్ జారీ చేస్తారని, గ్రామీణ ప్రాంతంలో తమారీ చేసిన వస్తువులను అమ్ముకోవడానికి రూరల్ మార్ట్‌లను కూడా ప్రారంభించామని అన్నారు. అనంతరం శిక్షణ కేంద్రంలోని వస్తువులను పరిశీలించి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం నిఖిల్, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ వికాస్, ఆర్‌సెటి డైరెక్టర్ రాజలింగం, ఫ్యాకల్టీ నజీమ్ అలీ, నాగరాజు, సిబ్బంది స్వప్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

# వర్షిణిని అభినందించిన కలెక్టర్ సత్యప్రసాద్



**ప్రజాపక్షం/గొల్లపల్లి:** రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించిన విద్యార్థిని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అభినందించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని వర్షిని బైలాజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీలో పాల్గొని ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించిన వర్షిని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అభినందించారు. ఇంకా కష్టపడి చదివి పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థినికి సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల ప్రిన్సిపాల్ సుంకరి రవి విద్యార్థుల పట్ల ప్రత్యేక చొరవ చూపి విద్యార్థులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించడం వలన విద్యార్థులలో నైపుణ్యాలను పెంపుందుతూ చదువుతో పాటు ఆట పాటల్లో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు వెళుతున్నారని అన్నారు. అనంతరం జిల్లా బయాలజీ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు రాజగోపాల్, జనరల్ సెక్రెటరీ తిరుపతి జిల్లా బాధ్యులు విద్యార్థిని వర్షిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఈ ఓ రాము నాయక్, పాఠశాల ప్రిన్సిపల్ సుంకరి రవి, వైస్ ప్రిన్సిపల్ తిరుపతి, బయాలజీ ఉపాధ్యాయుడు దయాకర్ రెడ్డి, జిల్లా సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం..



**ప్రజాపక్షం/బెజ్జంకి:** మండల పరిధిలోని పెరుకబండ గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో మంజూరైన సిసి రోడ్డు నిర్మాణ పనులను గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, పార్టీ మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి, ఏఎంసి చైర్మెన్ పులి కృష్ణతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మెన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, నాయకుల సందీప్, శరత్, జహంగీర్, తిరుపతి, పర్శరములు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు యువత బానిసలు కావొద్దు



**ప్రజాపక్షం/మల్లాపూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ నోడల్ జిల్లా అధికారి బొప్పరాతి నారాయణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను యువతను ఉద్దేశించి మాట్లాడారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుల్లో రాణించి ఉత్తమ ఫలితాలు సాధించాలని తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యానారాయణ, అధ్యాపక బృందం విద్యార్థులుపాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేయాలి

### రవాణా శాఖాధికారి శ్రీనివాస్




**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవింగ్ చేస్తే ప్రమాధలు జరుగవని చూపెట్టు,జీబ్రాక్రాసింగ్ భద్రత గురించి స్కూల్ యాజమాన్యం చక్కగా వివరించారని జగిత్యాల జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రం లోని సూర్య గ్లోబల్ పాఠశాలలో జాతీయ భద్రతా మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లడుతూ జిబ్రాక్రాసింగ్ భద్రత, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు భద్రతా నియామాలు, ప్రాంతీయ చిత్రాలు చిన్నారులు చాలా బాగా చిత్రీకరించి, అవగాహన కల్పించడం ఆనందదాయకమన్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం , మద్యం త్రాగి బండి నడపడం వలన జరిగే ప్రమాదాలను వివరించారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వారిని అభినందిస్తూనే హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధించాలన్నారు. వాహనదారులు బయటకు వెళ్లేటప్పుడు, కుటుంబ సభ్యులు తమ కోసం వెయ్యి కళ్లతో ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రమాదాల్లో పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందన్నారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, అతివేగం అనర్థదాయకమని, మద్యం తాగి వాహనం నడపవద్దని చెప్పారు. ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని హెచ్చరించారు.ట్రాఫిక్ ఎస్సై మల్లేశం మాట్లాడుతూ హెల్మెట్ ధరించిన వాహనదారులకు పూలు అందించి అభినందించారు. పాఠశాల డ్రైవర్ లకు హెల్మెట్ లను బహుమతిగా అందించారు. పాఠశాలలో ట్రాఫిక్ గురించి చిత్రాలను ప్రదర్శించిన చిన్నారులను అధ్యాపక బృందాన్ని డీటీఓ శ్రీనివాస్, ట్రాఫిక్ ఎస్సై మల్లేశంలు అభినందించారు. ఈ కార్యక్రమంల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు, డైరక్టర్స్ హరిచరణ్ రావు, మౌనిక రావు, రజిత , రామారావు, ప్రమీల, అభిలాష్, రియాజ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మోకాలు మార్పిడికి అత్యాధునిక రోబోటిక్ సర్జరీ



**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధి:**కరీంనగర్‌లోని యశోధ మెడికల్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో యశోద ఆసుపత్రి సోమాజిగూడలోని ప్రముఖ ఆర్థోపెడిక్ జాయింట్ రిప్లేస్‌మెంట్ డాక్టర్ సునీల్ దాచెపల్లి మాట్లాడుతూ మోకాళ్ల అరుగుదలఅనేది ప్రస్తుతం మధ్య వయస్సు నుండి వృద్ధుల వరకు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అని దీనికి మొదటి రెండు దశలలో ఇంజక్షన్ తీసుకోవచ్చని కానీ ఆఖరి రెండుదశలలో మాత్రం మోకాలు మార్పిడి తప్పనిసరి అని పేర్కొన్నారు. దీనికి అత్యంత ఆధునిక టెక్నాలజీ అయినా రోబోటిక్ సర్జరీ ద్వార ఆపరేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. మాన్యువల్‌గా చేసే మోకాలు మార్పిడి చికిత్సలో శస్త్ర చికిత్సకు ఎక్కువ సమయం పడుతుందని రోగి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. కావున రోబోటిక్ సర్జరీ ద్వారా అయితే ఖచ్చితమైన కొలతతో ముందే నిర్ధారణ చేసుకుని ఆపరేషన్ చేయడం వల్ల సులభతరం అవుతుందని తెలిపారు. ప్రపంచంలోనే ఉత్తమ ఇంప్లాంట్ అయిన ఆక్సినియం అనే పరికరం ఉపయోగించడం జరుగుతుందని, ఉదయం ఆపరేషన్ చేస్తే సాయంత్రానికల్లా నడుస్తారని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## అసాంఘిక దందాలకు కేరాఫ్ సాతారం



**ప్రజాపక్షం/మల్లాపూర్:** అసాంఘిక కార్యకలాపాలైన ఇసుక రవాణా, అక్రమ మద్యం దుకాణాలు, దాబాలకు, మట్టి దందాలు కేరాఫ్ అడ్రస్‌గా మల్లాపూర్ తయారు అయింది. ఇటీవలే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేలా సాతారం గ్రామం పెద్దవాగులో ఇసుక రీచ్ జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అధికారులు ఏర్పాటు చేశారు. కానీ అధికారులు ఆదేశాలు మాకు పట్టవంటూ కొందరు ఇసుక మాఫియాసురులు గోదావరి వాగు వంకలను కొల్లగొడుతూ అడ్డదారిలో ఇసుక దందాను నడిపిస్తున్నారు. అదే విధంగా మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో రెండు లేదా మూడు బెల్ట్ షాపులతో సామాన్య ప్రజలకు ఇబ్బందులు పడుతున్న అధికారులకు కనువిప్పు కలగడం లేదు. అదే విధంగా మండల వ్యాప్తంగా చాలా గ్రామాలలో ఉన్న దాబాలలో రుచికరమైన వంటలు, కోరుకున్న మద్యం కూర్చున్న చోటికి రావడంతో రాత్రివేళ వరకు దాబాలు తెరుచుకుని ఉంటున్నాయి. చాలా సందర్భాల్లో జరిగే వివాదాలకు దాబాలు, బెల్ట్ షాపులో నిదర్శనంగా ఉన్నప్పటికి అధికారులు వాటిని నియంత్రించడంలో విఫలమవుతున్నారు. బాగా ఇలా విచ్చలవిడిగా దాబాలు ఇసుక రవాణా బెల్ట్ షాపులు ఎక్కడా చూసినా దర్శనం ఇస్తుండడంతో అసాంఘీక కార్యకలాపాల దందాలకు మల్లాపూర్ మండలం కేరాఫ్ అడ్డగా మారింది అనడంలో అతిశయోక్తి లేదు.




## రోడ్డు భద్రతపై అవగాహన ఉండాలి

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని రోడ్డు భద్రతా మాసోత్సవాల కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జిల్లా కలెక్టరేట్లో గురువారం రోడ్డు భద్రత మహోత్సవాల కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 1 నుండి 31 వరకు రోడ్డు భద్రతా మాస ఉత్సవాల అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు జిల్లాలో జనవరి 31 వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాస ఉత్సవాల ఏర్పాటుకు రోడ్డు అండ్ బిల్డింగ్స్ అధికారి నిర్దేశించిన ఆయా శాఖల అధికారులు వారు చేయవలసిన విధివిధానాలను రూపొందించిన యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. డిసిపి రవీందర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జైపాల్ రెడ్డి, డిఆర్ఓ విజయలక్ష్మి, ఆర్ అండ్ బి ఈఈ జితేందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటిద్దాం




**ప్రజాపక్షం/కాజీపేట :** వరంగల్ నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశానుసారం వరంగల్ ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ సూచనల మేరకు గురువారం కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ పాటి నాగబాబు హంటర్ రోడ్ లోని త్రివి స్కూల్లో రోడ్డు భద్రత పాటిద్దాం, ప్రమాదాలను నివారిద్దాం అను నినాదంతో వారోత్సవాలను నిర్వహించారు. పాటలతో పిల్లలకు ట్రాఫిక్ రూల్స్పై అవగాహన కల్పించారు. కాజీపేట ట్రాఫిక్ ఎస్ఐ రామారావు, ప్రిన్సిపల్ రిజ్వానా టీచర్స్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో..**



**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఎల్అండ్టీ సిబ్బందికి ట్రాఫిక్ నియమాలపై వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది, ఇంజినీర్స్కు ట్రాఫిక్ నిబంధనలు ప్రతీ ఒక్కరూ పాటించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలు, పాటించని ఎడల సంభవించే ప్రమాదాల గురించి సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎల్ అండ్టీ సిబ్బంది, ఇంజినీర్స్, ప్రాజెక్టు మేనేజర్, సర్వర్, సేఫ్టీ ఇన్ఛార్జి సత్యనారాయణ, ట్రాఫిక్ సిబ్బంది, హెచ్సీ కుమారస్వామి, పీసీ రమేశ్ పాల్గొన్నారు.

## సహకార సంఘాలతోనే ఆర్థికాభివృద్ధి

### మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్కుమార్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** సహకార సంఘాలు బలోపేతంతో ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్కుమార్ సింగ్ అన్నారు. గురువారం ఐడిఓసిలో జిల్లా స్థాయి సహకార అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం జరిగింది.కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సహకార సంఘాల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తూ మల్టీసర్వస్ కోపరేటివ్ సొసైటీల ద్వారా క్షేత్రస్థాయిలో వ్యవసాయం, పాడి పరిశ్రమ, మధ్య పరిశ్రమ, గీతా పరిశ్రమ, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, జన్ ఔషధం పాలశీలత కేంద్రాలు, బిసి కార్పొరేషన్ ఇతర కార్పొరేషన్లు, సొసైటీల ద్వారా జరిగే పథకాల అమలుతోపాటు మరింత వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తూ సంఘాలను చైతన్యపరుస్తోందన్నారు. అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టోప్పో, కె.వీరబ్రహ్మారారి, డిసిడిసి కన్వీన్, డిసిఓ ఎన్ వెంకటేశ్వర్లు,డిఏఓ విజయనిర్మల, జెడ్పి సిఇఓ పురుషోత్తం, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, బిసి సంక్షేమశాఖ అధికారి నర్సింహస్వామి, డివిహెచో డాక్టర్ కిరణ్కుమార్, ఎక్సైజ్ శాఖ అధికారి కిరణ్, డిసిబిబి రజిత, విజయడైరీ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ గ్రామంగా కొండపర్తి

### ములుగు కలెక్టర్ టిఎస్ దివాకర

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** రాష్ట్ర గవర్నర్ దత్తత తీసుకున్న కొండపర్తి గ్రామంను మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం తాడ్వాయి మండలంలోని కొండపర్తి గ్రామంలో అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ గ్రామసభ ఏర్పాటు చేసి ప్రజలకు కావాల్సిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరంలో రాష్ట్ర గవర్నర్ ములుగు జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క జిల్లాలోని ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కోరగా సానుకూలంగా స్పందించి గవర్నర్ కొండపర్తి గ్రామంను దత్తతీ తీసుకోవడం చాలా అదృష్టమన్నారు. గ్రామంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో సోలార్ ఆర్గనైజింగ్ సిస్టం ద్వారా మసాలా మేకింగ్, టైలరింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోడానికి త్వరలో ఒక్కొక్క కుటుంబానికి రూ.5లక్షలు మంజూరవుతాయని, ప్రజలందరు కలిసి ఒక ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ఎలక్ట్రిసిటీ డిఈ నాగేశ్వరరావు, మిషన్ భగీరథ, వ్యవసాయశాఖ అధికారులు, తహసీల్దారు, ఎంపిడిఓ, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ మోటార్ దొంగల అరెస్టు



**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఇద్దరు కరెంట్ మోటార్ దొంగలను అరెస్టు చేసినట్లు సిఐ ఆర్ సంతోష్ తెలిపారు. అక్కంపేట గ్రామస్తుడు కదుదుల సంజీవులు పోలీస్ స్టేషన్లో తన కరెంటు మోటర్ పోయిందని ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఆత్మకూరు పోలీసులు అక్కంపేట గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పల్సర్ బండి పై పారిపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకొని వారిని విచారించగా వారి వద్ద కరెంటు మోటార్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అక్కంపేట గ్రామానికి చెందిన పెండ్లి రాజు తండ్రి సారంగం, అమ్మి రజినీకాంత్ తండ్రి గోపి వీరిద్దరూ అక్కంపేట గ్రామస్తులు కాగా పంచుల సమక్షంలో విచారించి వారిని రిమాండ్కు తరలించినట్టు ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్ సంతోష్ కుమార్ తెలిపారు.

# సకాలంలోనే అభివృద్ధి పనులు పూర్తి

### హనుమకొండ కలెక్టర్ పి. ప్రావిణ్య






**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో హుస్నాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో వివిధ అభివృద్ధి పనుల పురోగతి పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో పలు అభివృద్ధి పనులు, వాటి పురోగతి, తదితర వివరాలను సంబంధిత శాఖల అధికారులు కలెక్టర్కు వివరించారు.కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ ఎల్కుతుర్తి జంక్షన్ లో రెండువైపులా లెవె లింగ్ త్వరగా పూర్తి పూర్తిచేయాలని అన్నారు. వంగరలోని పీవీ విజ్ఞాన కేంద్రంలోని పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.ఆర్అండ్ బి పనులు అన్ని ప్రారంభమయ్యాయని కలెక్టర్కు వివరించారు. నియోజకవర్గంలో పనులు మిగిలి ఉంటే వాటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్డీవో మేన శ్రీను, సీపీవో సత్యనారాయణ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, టీజీఈడబ్ల్యూఐడీసీ డీఈ రవీందర్, కుడా ఈఈ భీం రావు, తహసీల్దార్లు ప్రవీణ్ కుమార్, జగత్ సింగ్, ఎంపీడీవో విజయ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### వాహనాలు జాగ్రత్తగా నడపాలి

**హనుమకొండ ప్రతినిధి :** హెవీ వెహికల్ నడిపే డ్రైవర్లు చాలా జాగ్రత్తగా వాహనాలను ప్రతిక్షణం అప్రమత్తంగా నడపాలని కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. గురువారం హనుమకొండ ములుగు రోడ్డు పరిధిలోని ఆర్టీసీ శిక్షణ కళాశాలలో జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం, లైట్, హెవీ మోటర్ డ్రైవింగ్ శిక్షణ ముగింపు, ధ్రువీకరణ పత్రాల పంపిణీ నిర్వహించారు. ప్రావిణ్య ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ నుండి ఒక మంచి కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. హెవీ వెహికల్ నడపడం మామూలు విషయం కాదని, చాలా జాగ్రత్తగా నడపాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. డ్రైవింగ్లో శిక్షణ పొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాలను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ జిఎం ఆనంద్, రవాణా శాఖ డీటీసీ శ్రీనివాస్, ఆర్టీసీ డైరెక్టర్ ట్రైనింగ్ సుధా పరిమళ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, ఆర్టీసీ ఐటిఐ ప్రిన్సిపల్ అర్పిత, ఇతర అధికారులతో పాటు శిక్షణ పొందిన డ్రైవర్లు పాల్గొన్నారు.

## పారదర్శకంగా భూ సేకరణ ప్రక్రియ

### ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి వినయ్కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** భూ సేకరణ ఆర్అండ్ ఆర్ అథారిటి కింద పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికార టి వినయ్కృష్ణారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్తో కలిసి భూసేకరణ ఆర్ఆర్ పనులపై సంబందిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.వినయ్కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో చర్లతండా, సత్యనారాయణపురం గ్రామాల్లో ఆర్అండ్ఆర్ సెంటర్ కంద పెండింగ్లో ఉన్న భూముల చదును పనులను వేగవంతం చేసి వారం రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. స్టేషన్ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని దేశాయ్తండా గ్రామంలో కూలీలకు పెండింగ్లో గల 50 శాతం బిల్లుల టోకెన్ నెంర్తో వెంటనే నివేధికను సమర్పించాలన,ఆర్డిఓనుఆదేశించారు.అదే విధం గా భూసేకరణలో బాగంగా ఆర్అండ్ఆర్ కంద భూములు ఆమోదానికి సత్వరమే ప్రతిపాదనలు పంపించాలని, సంబంధిత హక్కు పత్రాలను అన్లైన్లో నమోదు చేయాలని, సీసి రోడ్స్, తాగునీరు, తదితర మౌళిక వసతుల కల్పనకు భూ సేకరణ పక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు చేసి టెండర్లకు పిలువాలని పంచాయితీ రాజ్ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఆర్డిఓలు వెంకన్న, డిప్యూటి స్పెషల్ కలెక్టర్లు సుహాసన, హనుమాన్ నాయక్, ఏడి సర్వే అండ్ లాండ్స్ మన్యంకొండ పంచాయితీరాజ్ ఇంజనీరింగ్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నిర్మాణ పనుల్లో జాప్యం తగదు

### జయశంకర్ కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్భూపాలపల్లి ప్రతినిధి :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనుల్లో జాప్యం వద్దని త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్శర్మ అన్నారు. ఐడిఓసి కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతి రాజ్, టిజియం ఎస్ఐడిసి ఇంజినీరింగ్ అధికారులతో ప్రాథమిక ఆరో గ్య కేంద్రాల పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆరోగ్య కేంద్రాల నిర్మాణం పట్ల కలెక్టర్ రాహుల్శర్మ అసంతృప్తి వ్యక్తం చేశా రు. భాగిర్తిపేట, చెన్నపురం, రంగయ్యపల్లి, సుల్తాన్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నవంబర్ 2022లో పూర్తి చేయాల్సి ఉందని,ఎందుకు పూర్తి చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేసినా పనుల్లో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాప్యం కారణంగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందడంలో ఆటంకం కలుగుతోందన్నారు. తక్షణమే కాంట్రాక్టర్ను మార్చి పనులు ప్రారంభించాలని కాంట్రాక్టురును తొలగించి, కొత్త కాంట్రాక్టర్ల ద్వారా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డిచర్ల, మహా ముత్తారంలో వైద్యుల నివా స గృహాలు పనులు పూర్తి చేయాలని ఆదేశించా రు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్, పిఆర్ఈ వెంకటేశ్వర్లు, సిపిఓ బాబురావు, టిజిఎంఐడిసి డిఈ ప్రశాంత్ పాల్గొన్నారు.

## సెలవుదినాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వేతనంతో కూడిన సెలవుదినాలను ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి కోరారు. ఆల్ షాపింగ్ మాల్స్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలో గల పి.యన్. మూర్తి క్లాత్ స్టోర్ వస్త్ర వ్యాపారి పుల్లూరి నరసింహమూర్తి చేతుల మీదుగా గురువారం జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రకటించిన వేతనంతో కూడిన సెలవు దినాల క్యాలెండర్లను ఆవిష్కరించారు. వేల్పుల సారంగపాణిమాట్లాడారు.షాప్ షాపింగ్ మాల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గండు సత్యం, ఉపాధ్యక్షులు వేల్పుల వీరేశం, సహాయ కార్యదర్శి జి.శివ , సతీష్, సామల రవీందర్, హరీష్, పిండి.లక్షన్, అనిల్ షాప్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మండల అధ్యక్షుల నియామకం



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా లోని భూపాలపల్లి అర్బన్, గణపురం, రేగొండ, మొగుళ్లపల్లి, శాయంపేట నూతన మండల అధ్యక్షులను నియమించినట్లు బిజెపి జిల్లా అధ్యక్షుడు నిశీధర్ రెడ్డి గురువారం తెలిపారు. భూపాలపల్లి బిజెపి అర్బన్ అధ్యక్షుడిగా గీస సంపత్, గణపురం మండల అధ్యక్షుడిగా ఊర నవీన్ రావు, రేగొండ అధ్యక్షుడిగా బండి శ్రీనివాస్, మొగుళ్లపల్లి మోరే వేణుగోపాల్ రెడ్డి, శాయంపేట నరహరిశెట్టి రామకృష్ణను లను రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇంచార్జ్ ఎండెం లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు నూతన మండల అధ్యక్షులను నియమించినట్లు తెలిపారు. అట్లాగే జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఊరటి మునేందర్, మిట్టకుమారస్వామి, పెండ్యాల రాజు, కానుగుల నాగరాజు, పెండ్లి మల్లారెడ్డిలను జిల్లా కమిటీ సభ్యులుగా నియమించడం జరిగిందని జిల్లా అధ్యక్షుడు తెలిపారు.

## వనం వీడి.. జనంలోకి రావాలి




### జయశంకర్ జిల్లా ఎస్పి కిరణ్ ఖరే

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి** గత 30 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు నేత మచ్చ సోమయ్య సమ్మయ్య అజ్ఞాతం వీడి వనం నుండి జనజీవన స్రవంతిలో కలవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ సూచించారు. భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామానికి చెందిన అజ్ఞాత మావోయిస్టు, మచ్చ సోమయ్య, ఇంటికి వెళ్లి ఆయన భార్య సుగుణమ్మ ను పరామర్శించారు. ఈ సందర్భంగా దుప్పట్లు, మెడికల్ కిట్, నిత్యవసర సరుకులను ఎస్పి అందజేసి, అజ్ఞాత మావోయిస్టు కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి, వారి జీవనోపాధి, కుటుంబ పరిస్థితి, కుటుంబ నేపథ్యం, పిల్లల పరిస్థితి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సోమయ్య కుటుంబ సభ్యులకు ఏలాంటి సమస్యలు ఎదురైన అవసరమైన వైద్య చికిత్సలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందనిఎస్పీ కిరణ్ఖరేఅన్నారు.మచ్చ సోమయ్య సమ్మయ్య అడవి వీడి జనంలోకి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ పోలీసుల నిఘా పటిష్ఠంగా ఉందని, ఇప్పటికే తెలంగాణకు చెందిన అనేక మంది మావోయిస్టులు ఎన్కౌంటర్ లలో హతమయ్యారని అన్నారు. అజ్ఞాత జీవితం గడుపుతున్న మావోయిస్టులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, సోమయ్య ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలిస్తే, ఆయనపై ఉన్న రివార్డ్, ప్రభుత్వం నుంచి అనేక ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఎస్పి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి అదనపు ఎస్పి బోనాల కిషన్, భూపాలపల్లి డిఎస్పి ఏ.సంపత్ రావు, సిఐ నరేష్ కుమార్, ఎస్సైలు సుధాకర్, రమేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' ముమ్మాటికీ ప్రజల పక్షమే




### మహబూబాబాద్ జిల్లా ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** ప్రజాపక్షం దినపత్రిక ముమ్మాటికీ ప్రజలపక్షమేనని మహబూబాబాద్ జిల్లా ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్ అన్నారు. గురువారం ఎస్పి కార్యాయలంలో ప్రజాపక్షం 2025 నూతన సంవత్సర క్యాలండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ప్రజాపక్షం పత్రిక తన పాత్ర పోషిస్తూ ప్రజలకు అవగాహన, తాజా కబుర్లు అందించడంలో ముందుంటుందని అన్నారు. అనతికాలంలోనే ప్రజాపక్షం ప్రజలకు అత్యంత చేరువై ప్రజాభిమానానానికి నిలువుటద్దంగా నిలుస్తోందన్నారు. ప్రజాపక్షం దినపత్రిక యాజమాన్యానికి, మహబూబాబాద్ జిల్లా ప్రజలకు, జిల్లా రిపోర్టర్లకు ఎస్పి ఈ సందర్భంగా నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నిరంతర ప్రజాసేవలో ప్రభుత్వ కార్యక్రమాలను, పథకాలకు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించడంలో భాగస్వామ్యమై ప్రజాదరణపొందిన మానస పుత్రిక ప్రజాపక్షం దినపత్రికని ఆయన అన్నారు. అవినీతి అక్రమాలను ఎండగట్టడంలో ముందుండి తాజా సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎస్పి తెలిపారు. ప్రజాపక్షాన నిలుస్తూ ప్రజాసమస్యల కోసం నిరంతరం కృషి చేయాలని ఎస్పి కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా స్టాఫ్రిపోర్టర్ కల్లూరి ప్రభాకర్, గూడూరు రిపోర్టర్ కరుణాకర్రెడ్డి, నిరంజన్, ఉపేంద్రచారి, వెంకన్న, ఎస్పి పిఆర్ఓ కుశల్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణింపు

### రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నమెంటు ప్రారంభం

### ఎమ్మెల్యే రేవూరి, జంగా



**ప్రజాపక్షం/గీసుకొండ :** గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులు ఖోఖోను సాంప్రదాయ క్రీడగా భావించి ఆడతారని రేవూరి ప్రకాశ్రెడ్డి అన్నారు. గీసుకొండ మండల కేంద్రంలో గురువారం రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నమెంటును ఎమ్మెల్యే ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. జాతీయ స్థాయి ప్రమాణాలతో రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడలను నిర్వహించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. స్పోర్ట్స్ అథారిటీకి రావాల్సిన పెండింగ్ బిల్లులను వచ్చేలా కృషి చేస్తామన్నారు. దేహదారుఢ్య క్రీడల్లో భారతదేశం మొదటిస్థానంలో ఉంటుందన్నారు. క్రీడాకారులు గెలుపు ఓట ములను సమానంగా తీసుకోవాలన్నారు. ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ఉమ్మడి 10 జిల్లాల్లో నుంచి 10 బాలుర, 10 బాలికల జట్లతోపాటు ఒక పోలీసు టీమ్ పాల్గొన్నాయి. రాష్ట్రస్థాయి ఖోఖో టోర్నమెంటును దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరిలో జరిగే జాతీయ స్థాయి ఖోఖో క్రీడలకు సీఎం రేవంత్రెడ్డిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మనుగొండ గ్రామానికి చెందిన అల్లం బాలకిషోర్రెడ్డి దంపతులు ఈ టోర్నమెంటు నిర్వహణకు రూ. 5 లక్షల విరాళాన్ని అందచేయడంతో పాటు క్రీడాకారులకు భోజన వసతులు కల్పిస్తున్న సందర్భంగా వారిని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డీఈఓ జ్ఞానేశ్వర్, ఖోఖో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి శ్యాంప్రసాద్, హన్మకొండ జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ అజీజ్ఖాన్, ఒలంపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కైలాష్ యాదవ్, తహసీల్దారు రియాజుద్దీన్, ఎంపీడీఓ కృష్ణవేణి, టోర్నమెంటు నిర్వాహకులు వీరగోని రాజ్కుమార్, కోట రాంబాబు, మాజీ జడ్పీటీసీ పోలీసు ధర్మారావు, బాబు, దాతలు అల్లం బాలకిషోర్రెడ్డి స్వప్నదేవి, లక్ష్మీనారాయణ, కోచ్లు, అంపైర్లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## 'ట్రిపుల్ రైడింగ్'తో పట్టుబడితే రూ.10వేలు జరిమానా




### భూపాలపల్లి ఆర్టిఒ సంధాని

**ప్రజాపక్షం/చిట్యాల:** వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆర్టిఒ సంధాని అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లోభాగంగా గురువారం చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో స్థానిక ఎస్ఐ గన్నమనేని శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా ఆర్టీవో సంధాని ముఖ్యఅతిథిగా విద్యార్థులతో మాట్లాడారు. రోడ్డు భద్రతా నియమాలను ముఖ్యంగా యువత అభద్రత డ్రైవింగ్ తో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని, అందులో భాగంగనే డ్రంక్ అండ్ డ్రైవ్లో దొరికితే జైలు శిక్షతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ తొలగిస్తారని ట్రిపుల్ రైడింగ్ తో పట్టుబడితే 10 వేల వరకు ఫైన్ ఉంటుందని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పని సరిగా ఉండాలని, మైనర్స్ డ్రైవింగ్ చేస్తే వాళ్ళకి వెహికల్ ఇచ్చిన వాళ్ళకి 6 నెలల జైలు శిక్ష పడుతుందని ఇన్సూరెన్ కలిగి ఉండలని హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనం బయటకి తీయాలని, రాష్ డ్రైవింగ్ చేస్తే వెహికిల్ సీజ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, పోలీస్ సిబ్బంది అస్లాం జాని, లింగన్న, నవీన్, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

# ఫోకస్

## వ్యవసాయం



# దాగుడుమూతలు ఇంకెన్నేళ్లు?



'మనది రైతు రాజ్యం', 'రైతే దేశానికి వెన్నెముక', 'రైతు లేనిదే రాజ్యం లేదు'... ఇలాంటి ముఖస్తుతి మాటలు, రైతుల అభ్యున్నతిపై హామీలు కేవలం నీటి మీది రాతలుగా మారాయి. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న వాగ్దానపు వయసు ఓ దశాబ్దం. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ఎన్నికల హామీని ఎనాడో అటకెక్కించింది. రైతుల చిరకాల న్యాయ బద్ధమైన డిమాండ్లలో కనీస మద్దతు ధర (ఎంఎ స్‌పి)కు చట్టబద్ధత కల్పించడం. కార్పొరేట్ సంస్థలకు పన్నురాయితీలు.... ఉద్దేశపూర్వక ఎగవేతదారుల బకాయిలను రానిబాకీల కింద జమచేయడానికి లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న మోదీ సర్కారు వద్ద వ్యవసాయదారులకు పెన్షన్, రుణమాఫీ, పంట బీమా అమలుచే యడానికి రూపాయి కూడా లేదు. ఆర్థిక లోటు.. విదేశీ రుణాలు.. వ్యవసాయదారుల పేరు చెప్పినప్పుడు మాత్రమే గుర్తుకొస్తాయి. నీరవ్ మోదీ నుంచి విజయ్ మాల్యా వరకు... మిగుల్ చొక్సీ నుంచి లలిత్ మోదీ వరకూ, ఎన్నో కార్పొరేట్ తిమింగలాలు. ప్రత్యక్షంగా బ్యాంకుల ను, పరోక్షంగా ప్రజలను నిలువునా ముంచేసి విదేశీకి పారిపోతే, వారి పాపాన్ని మోదీ సర్కారు తన నెత్తిన పెట్టుకుంది. వెనువెంటనే పన్నుల రూపంలో ప్రజల నుంచి వసూలు చేయడం మొదలు పెట్టింది. వారికి బ్యాంకులు ఏ విధంగా కోట్లాది రూపాయల రుణాలు ఇచ్చాయో ఎవరికీ తెలియదు. ఎందుకు వసూలు చేసుకోలేకపోతు న్నారనేది చిదంబర రహస్యం. ఎవరు, ఎవరికీ జవాబుదారీ కాదు. ప్రజల సొమ్ము... తలా కొంత. పందేరాలు బాగానే ఉన్నాయి. ప్రభుత్వ పెద్దల మద్దతు లేకపోతే ఇంతటి భారీ కుంభకో ణాలు జరుగుతాయా? అనేది ప్రశ్న. దీనికి సమాధానం జగద్విదితం. ఈ క్రమంలో రైతుల సంక్షేమాన్ని గురించిన ఆలోచన కేంద్రానికి లేదు... రాదు.. 2020 నవంబర్ 26న, అప్పటి వివాదాస్పద మూడు సాగు చట్టాలకు వ్యతిరేకం గా రైతులు చేపట్టిన ఆందోళన దేశాన్ని కుదిపేసిం ది. ఢిల్లీ సరిహద్దుల వద్ద మోహరించిన రైతులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ సుమారు ఏడాది పాటు దీక్షలు కొన సాగించారు. కనీసం 850 మంది రైతులు ప్రాణాలు వదిలారు. దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కావడం, వివిధ రాజకీయ పార్టీలు రైతులకు మద్దతు ప్రకటించడం, అదే సమయంలో ఉత్తరప్రదేశ్‌సహా కొన్ని కీలక రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు ముంచుకురావడం వంటి పలు అంశాలను దృష్టిలో ఉంచుకొని, మోదీ సర్కారు తన నటనా చాతుర్యాన్ని ప్రదర్శిం చింది. అప్పటికే అమలుపై సుప్రీం కోర్టు నిషేధం విధించిన మూడు సాగు చట్టాలను రద్దు చేస్తూ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి, హడావుడిగా ఆమోదముద్ర వేయించింది. ఇతర డిమాండ్లను ప్రస్తావిస్తూ, అప్పటికీ ఢిల్లీ సరిహద్దుల్లోనే, సంయుక్త్ కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతృత్వంలో నిరసన కొనసాగిస్తున్న రైతులను మంచి చేసుకోవడానికి హామీలు గుప్పించింది. అన్ని డిమాండ్లను పరిష్కరిస్తామంటూ నమ్మించిం ది. ఎంఎస్‌పికి చట్టబద్ధత కోసం కమిషన్‌ను వేస్తున్నట్టు ప్రకటిం చింది. కేవలం మాటల ద్వారా కాకుండా, లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీలను కేంద్రం నిలబెట్టు కుంటుందని రైతులు నమ్మారు. ఆందోళన విరమించారు. కానీ, రెండేళ్లు గడిచిపోయాయి. కేంద్రం తన నిజస్వరూపాన్ని మరోసారి బయటపెట్టిం ది. ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ఇప్పటి వరకూ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. ఎంఎస్‌పిపై వేసిన కమిషన్ ఆచూకీ లేదు. మిగతా డిమాండ్ల ఊసు లేనేలేదు. రైతుల పరిస్థితి ఎక్కడవే సిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కేంద్రం నుంచి సానుకూల స్పంద కోసం రెండేళ్లుగా ఎదురుచూస్తున్న రైతులు మలిదశ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. షరా మామూలే అన్నట్టు మోదీ సర్కారు మరోసారి ఉద్యమంపై ఉక్కుపాదం మోపుతున్నది. పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల నుంచి రైతులు ఢిల్లీ సరిహద్దులు చేరుకోకుండా అడ్డంకులు సృష్టిస్తున్న ది. 'ఢిల్లీ మార్చ్' పేరుతో రైతు నేతలు చేపట్టిన దశలవారీ పాదయాత్రను కూడా అడ్డుకుంటున్న ది. రైతుల సంక్షేమమే లక్ష్యమని ఒకవైపు చెప్తూనే, మరోవైపు వ్యవసాయ రంగాన్ని ప్రైవేటు పరం చేయడానికి శక్తివంచన లేకుండా ప్రయత్ని స్తున్న మోదీ సర్కారు ఇంకెన్నాళ్లు దాదుగుమూత లు ఆడుతుందో? రైతుల మలిదశ ఉద్యమం మరోసారి భగ్గుమంటే, బిజెపికే కాదు... దేశానికి కూడా మంచిది కాదు. లిఖితపూర్వక హామీని కూడా బుట్టదాఖలు చేసిన కేంద్రం ఎప్పుడు వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటుంది? ఎప్పుడు రైతు సంక్షేమ చర్యలు చేపడుతుంది?

### కేంద్రం కొత్త ఎత్తు!



రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ డల్లేవాల్ 44 రోజులుగా కొనసాగిస్తున్న నిరశన దీక్ష విషయంలో సుప్రీం కోర్టును తప్పుదారి పట్టించే రీతిలో కేంద్రం కొత్త ఎత్తుగడతో ముందుకు సాగుతున్నది. డేల్లవాల్‌కు తక్షణ వైద్య సాయం అవసరమని, కానీ, రైతు సంఘాల నేతలు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని సుప్రీం కోర్టుకు సమాచారమిచ్చింది. ఒకవేళ డల్లేవాల్‌కు జరగరానిదేమైనా జరిగితే, పూర్తి బాధ్యత సంయుక్త్ కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నాయకులదేనని వ్యాఖ్యానిస్తున్నది. సుప్రీం కోర్టు సైతం డల్లేవాల్ ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసింది. ఆయనకు వైద్య సేవలను అడ్డుకోవద్దంటూ రైతు సంఘాల నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది సమస్యను పక్కదారి పట్టించడానికి మోదీ సర్కారు వేసిన ఎత్తు. డల్లేవాల్ నిరశ దీక్ష ఎందుకు చేపట్టాల్సి వచ్చిందో కేంద్రానికి తెలుసు. రైతుల డిమాండ్లు ఏమిటో కూడా తెలుసు. వాటిని ప్రస్తావించకుండా, ఇతరత్రా అంశాలను తెరపైకి తీసుకురావడం మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలో ఓ భాగం. నిజంగానే డల్లేవాల్ ఆరోగ్యంపై చిత్తశుద్ధి ఉంటే, రైతుల సంక్షేమాన్ని ఆకాంక్షి స్తే, సుప్రీం కోర్టులో స్పష్టమైన హామీ ఎందుకు ఇవ్వడం లేదు? గతంలో రైతులకు ఇచ్చిన హామీలను సుప్రీం కోర్టు ముందు ఎందుకు ఒప్పుకోవడం లేదు? కేంద్ర ప్రభుత్వ డ్రామాలు తెలియంది ఎవరికి!

## పర్యావరణం



ప్రపంచ వ్యాప్తంగా జల వనరులు గణనీయంగా తగ్గుతుంటే, విద్యుత్ లేదా శక్తికి డిమాండ్ విపరీతంగా పెరుగుతున్నది. పునరుత్పాదక ఇంధన ఆవశ్యకతను ఐక్యరాజ్య సమితి నేతృత్వంలోని పర్యావరణ నిపుణుల బృందం మరోసారి తెరపైకి తెచ్చింది. అటు వ్యవసాయానికి, ఇటు తాగునీటికి కూడా చాలా ప్రాంతాల్లో కొరత ఏర్పడుతున్నది. ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం కింద ప్రపంచ వాతావరణ సంస్థ పలు అంశాలను పరిశీలించి, సమర్పించిన నివేదికను అనుసరించి గ్రీన్‌హౌస్‌వాయువులే కాలుష్యానికి ప్రధాన కారణం. దీని కారణంగానే ఉష్ణోగ్రతలు గతంలో ఎన్నడూ లేని తీవ్ర స్థాయికి చేరుతున్నాయి. నీటి కొరత అనివార్యమైంది. నీటి లభ్యతకు, శక్తికి ఉన్న డిమాండ్‌కు ఎక్కడా పొంతన ఉండడం లేదు. ఈ రెంటి మధ్య సమన్వయం సాధించడం అసాధ్యమవుతున్నది. వాతావరణ మార్పు విద్యుత్ లేదా శక్తి డిమాండ్‌ను ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు గ్రీన్‌హౌస్ ఉద్గారాల కారణంగా గ్లోబల్ వార్మింగ్ ఏర్పడుతున్నది. దీనితో, ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషనర్లు, ఫ్యాన్లు వంటి శీతలీక



నీటి అవసరాలు కూడా పెరుగుతాయి. ఒకవైపు తగ్గుతున్న నీటి వనరులు... మరోవైపు పెరుగుతున్న నీటి డిమాండ్... ప్రపంచ వ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల్లోనూ ఇదే పరిస్థితి. గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఏర్పడుతున్న కరువు, తగ్గుతున్న వర్షపాతం వంటి అంశాలు తాగు, సాగు నీటి అవసరాలనేగాక విద్యుత్ ఉత్పాదన అవసరాలను కూడా సంక్షోభంలోకి నెడుతున్నాయి. బయోఎనర్జీ కోసం పండించే రాప్‌సీడ్, సన్‌ఫ్లవర్, సోయాబీన్, పామ్, ఆముదం వంటి పంటలు నీటి వనరులపై అదనపు ఒత్తిడిని కలిగిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే, 2040 నాటికి కనీసం 33 దేశాల్లో నీటి ఎద్దడి తారస్థాయికి చేరుతుంది. అక్కడి నీటి వనరుల్లో 80 శాతం తగ్గుదల కారణంగా, మనిషి

# తగ్గుతున్న జలవనరులు

రణ వ్యవస్థల నుంచి విద్యుత్‌కు అధిక డిమాండ్ ఏర్పడుతున్నది. ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఇఎ) డేటా ప్రకారం , వాతావరణ మార్పు 2050 నాటికి ప్రపంచ ఇంధన డిమాండ్‌ను 25 శాతం నుండి 58 శాతం వరకు పెంచుతుంది. ఇది ఎక్కువగా శీతలీకరణ అవసరాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. శిలాజ ఇంధన ఆధారిత శక్తికి డిమాండ్ పెరుగుదల అనేది వాతావరణ మార్పులపై ఆధారపడింది.



నీటిపై ఎక్కువగా ఆధారపడే పెట్రోలియం శుద్ధి, జీవ ఇంధన ఉత్పత్తి వంటి పరిశ్రమలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నీటి వనరులు తగ్గడం ఈ పరిశ్రమలకు శరాఘాతమవుతున్నది. ప్రపంచ శక్తి ఉత్పత్తిలో దాదాపు 80 శాతం వాటా శిలాజ ఇంధనాలదే. ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లైమేట్ ఛేంజ్ అంచనా ప్రకారం 73 శాతం గ్రీన్ హౌస్‌వాయు ఉద్గారాలకు శిలాజ ఇంధనాలు కారణమవుతున్నాయి. ఒక కిలోవాట్‌గంట విద్యుత్ కోసం నదులు లేదా సరస్సుల నుంచి సుమారు 25 గ్యాలన్ల నీరు అవసరం. డిమాండ్ పెరుగుతున్న కొద్దీ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. పశుపక్షాదుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 2030 నాటికి కరువులు 30 శాతం పెరుగుతాయని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్ అంచనా వేసింది. ప్రపంచ వాతావరణ సంస్థ గత 50 సంవత్సరాలలో వాతావరణ సంబంధిత విపత్తులలో ఐదు రెట్లు పెరిగినట్లు నివేదించింది. ఈ అంశాలు కూడా ప్రపంచ నీటి ఒత్తిడిని పెంచుతుతాయి. యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుంది. సాంప్రదాయిక నీటి శుద్ధి, నీటిపొదుపు పద్ధతులు ఉపయోగించడం ప్రస్తుతావసరం. బిందు సేద్యం, మురుగునీటి శుద్ధి వంటి సమర్థవంతమైన నీటిపారుదల వ్యవస్థలు సహజంగానే విద్యుత్ లేదా శక్తి వినియోగాన్ని, నీటి వృథాను తగ్గిస్తాయి. గ్రే వాటర్, ఇండస్ట్రియల్ వాటర్ రీసైక్లింగ్ చేయడం వల్ల వ్యవసాయం మరియు పరిశ్రమలలో మంచి నీటి డిమాండ్ బాగా తగ్గుతుంది. సౌర, వాయు వంటి వికేంద్రీకృత వ్యవస్థలు కనీస నీటిని వినియోగిస్తాయి. మరో రంగా చెప్పాలంటే, శిలాజ ఇంధనాలు ఉపయోగించే నీటిలో 1 శాతం కంటే తక్కువగా నీటి వినియోగం జరుగుతుంది. ఈ విధానాలను అవలంబించడం ఉత్తమం. చిత్తడి నేలలు , అడవులు, వాటర్ షెడ్‌లు వంటి పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించడం వలన నీటి భద్రత పెరుగుతుంది. కృత్రిమ నీటి నిర్వహణ వ్యవస్థలతో సంబంధం ఉన్న శక్తి డిమాండ్లను తగ్గిస్తుంది. స్థిరమైన శక్తి, నీటి వ్యవస్థలను రూపొందించడానికి, అమలు చేయడానికి, నిర్వహించడానికి అవసరమైన సామర్థ్యాన్ని పెంపొందించడం కోసం స్వల్పకాలిక విధానాలతోపాటు, దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేయాలి. ఈ దిశగా ఆలోచించి, చర్యలకు ఉపక్రమించడం ప్రస్తుతావసరం.

## వేతనాలు పెంచే వరకూ సమ్మె

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** హెచ్‌పిసిఎల్ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్లు, హెల్పర్‌ల వేతనాలు పెంచే వరకు సమ్మెను కొనసాగిస్తామని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని ఇమాంపే ట హెచ్‌పిసిఎల్ ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్లు, హెల్పర్‌ల సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. నాలుగు రోజులుగా కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నా యాజమాన్యం స్పందించకపోవడం సరైంది కాదన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో కార్మికులు చాలిచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాలకు ఒకసారి వేతన సవరణ చేయాల్సిన యాజమాన్యం మూడు సంవత్సరాలు గడుస్తున్న వేతన సవరణ చేయకపోవడంతో కార్మికులు సమ్మెకు దిగినట్లు తెలిపారు. యాజమాన్యం వెంటనే స్పందించి వేతన సవరణ చేసి డ్రైవర్లకు రూ. 1000, హెల్పర్లకు రూ. 700లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను కొనసాగిస్తూ కార్మికలోకం మద్దతును కూడగడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గుగులోతు రాజారాం నాయక్, జిల్లా నాయకులు చామల అశోక్ కుమార్, అనుబంధ సంస్థ హెచ్‌పిసిఎల్ ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్స్, హెల్పర్ యూనియన్ అధ్యక్షులు ఎండి బాబా, ప్రధాన కార్యదర్శి నిమ్మల ప్రభాకర్, కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, గౌరవ అధ్యక్షులు రాచకొండ సాయిబాబా, మధుసూదన్, రాములు, నగేష్, లింగయ్య, సైదులు, హలీం, శివరాజు, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

## సిద్ధాంతమే ఊపిరిగా జీవించిన పాడిమల్లారెడ్డి, పాడిచంద్రారెడ్డి

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో గురువారం దివంగత సిపిఐ నాయకులు కామ్రేడ్ పాడి మల్లా రెడ్డి 44వ వర్ధంతి, పాడి చంద్రారెడ్డిల వర్ధంతిలను నాయకులు పాడి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి కర్రే బిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మల్లారెడ్డి, చంద్రారెడ్డిల ఫోటోలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కర్రె బిక్షపతి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాన్ని నమ్ముకుని పార్టీ సిద్ధాంతమే ప్రాణంగా జీవించిన వ్యక్తులు పాడి మల్లారెడ్డి, చంద్రా రెడ్డిల దని అన్నారు. తమ చివరి శ్వాస వరకు కమ్యూనిజం వర్ధిల్లాలని, కమ్యూనిజమే మానవాళి మనుగడకు దిక్సూచి లాంటిదని ఆరాట పడిన వ్యక్తులు పాడి మల్లారెడ్డి, చంద్రారెడ్డిలని అన్నారు.అలాంటి మహనుభావులు మన మధ్యలో లేకపోవచ్చు కానీ భావితరాలకు తగిన స్ఫూర్తి నిచ్చారని, ఆ స్ఫూర్తి తో రాష్ట్రంలో సిద్ధాంత రూపంలో వారు మన మధ్యలోనే ఉన్నారని వారి త్యాగానికి రెడ్ సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పాడి రామకృష్ణారెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, మండల కార్యదర్శి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, నాయకులు రేణికుంట్ల రాజయ్య, గ్రామ కార్యదర్శి షేక్ బాబు, కల్వ చర్ల సుదర్శన్, నేదునూరు సునీల్, సాంబయ్య, గంగిళ్ళ భాస్కర్ రెడ్డి, ఎలబాక శ్రీధర, ప్రవీణ్, వీరబోయిన తిరుపతి, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, సానుభూతిపరులు పాల్గొన్నారు.




## రామనర్సయ్యనగర్‌ను సందర్శించిన సిపిఐ బృందం

పారిశుద్ధ్య పనులు తక్షణమే చేపట్టాలి

సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం

**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని రామనర్సయ్యనగర్‌లో సిపిఐ బృందం పర్యటించింది. గ్రామంలో వయసుతో సంబందంలేకుండా జబ్బులు వస్తున్న విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయసమితి సభ్యులు బాగం హేమంతురావు ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించారు. గ్రామం మొత్తం కలియతిరిగి ఎవ రకాల జబ్బులతో ప్రజలు బాధపడుతున్నారనే విషయాన్ని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా కిడ్నీసమస్యలు, బిపి, షుగర్‌తో పాటు మోకాళ్ల నొప్పులు వస్తున్న విషయాన్ని గమనించారు. వైద్యాధికారులు, ఆర్‌డబ్ల్యుఎతోస్ మాట్లాడి గ్రామంలో ఇలాంటి జబ్బులు ఎందుకు వస్తున్నాయనే విషయాన్ని తెలుసుకోవాలని అన్నారు. తాగునీరును కూడా పరీక్షలు చేయించాలన్నారు. ఈ సందర్భంగా హేమంతురావు మాట్లాడుతు గ్రామంలో పారిశుద్ధ్య లోపం ఉన్నదని, అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. తాగునీటిని శాంపుల్స్ ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. డ్రైనేజీ వ్యవస్థలేకపోవడంతో పారిశుద్ధ్యం లోపం బాగా ఉందన్నారు. ఆయా వ్యాధులకు సంబందించి నిపుణలచే వైద్యపరీక్షలు చేయించాలని పేర్కొన్నారు. వ్యాధులు నియంత్రణ జరిగేవరకు పూర్తిస్థాయిలో వైద్యశిబిరాన్ని నిర్వహించాలని అన్నారు. గ్రామంలో పల్లె దవాఖానా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి యర్రా బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, గ్రామమాజీ సర్పంచ్ కంపసాటి వెంకన్న, గిరిజన సంఘం నాయకులు గుగులోత్ శ్రీను, ఆంగోత్ మంగీలాల్, సిపిఐ మండల నాయకులు మునిగె కోటేశ్వరరావు, గడల శ్రీనువాసరావు, అజ్మీర బాలాజీ, లకావత్ సలీం తదితరులు పాల్గొన్నారు.



## పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషిచేయాలి

● స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి ● ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే ● సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ పిలుపు




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సిపిఐ బలోపేతానికి నాయకులంతా సమన్వయంతో పనిచేయాలని సిపిఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావి నారాయణ రెడ్డి భవన్ లో సిపిఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశం సిపిఐ పార్టీ కౌన్సిలర్ నూకల భూలక్ష్మి చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ నాయకులకు భవిష్యత్ కర్తవ్యాలపై దిశా నిర్దేశం చేశారు. ముందుగా ఇటీవలే అకాల మరణం చెందిన వారికి సంతాపాన్ని తెలియజేశారు ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో 11 మండలాల్లో పార్టీ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కంకణ బద్ధులై పని చేయాలని అన్ని మండలాల్లో పార్టీ ప్రజాసంఘాల కమిటీలు వేయాలన్నారు. ప్రజా సంఘాల కార్మిక సంఘాల తోనే పార్టీ బలోపేతం అవుతుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ తప్పకుండా పోటీ చేస్తుందని, పోటీ చేసే వ్యక్తుల గెలుపు కోసం అందరూ సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. అట్లాగే పార్టీ సభ్యత్వం 25 శాతం పెంచి వెంటనే పూర్తి చేసి రాష్ట్ర పార్టీకి అందజేయాలన్నారు. సిపిఐ వంద సంవత్సరాల ఆవిర్భావ వేడుకలు జిల్లా వ్యాప్తంగా సంవత్సరం పాటు నిర్వహించాలని అన్నారు. ఈనెల 24న భగత్ సింగ్ కాలనీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావులు హాజరు కానున్నారని, కావున పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొరిమి సుగుణ, క్యాతరాజు సతీష్, జిల్లా సమితి నాయకులు రమేష్ మామిడాల సమ్మిరెడ్డి, పెంట రవి, అన్నారపు రాజేందర్, నబి, రాజయ్య, కుమార స్వామి, మాతంగి రామచందర్, ఎం.విజేందర్, శ్రీనివాస్ కుదుదుల వెంకటేష్, వేముల శ్రీకాంత్,జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## 25న మానుకోటలో సిపిఐ శతవార్షికోత్సవ సభ

తీగల సత్యనారాయణ విగ్రహం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 25న సిపిఐ శత వార్షికోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు, అదేరోజు సాయుధ పోరాట స్ఫూర్తి చిహ్నం, తీగల సత్యనారాయణ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిపిఐ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి తెలిపారు. గురువారం సిపిఐ జిల్లా పార్టీ కార్యాలయం వీర భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100సంవత్సరాలు అయిన సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో వేలాది మందితో మానుకోటలో సిపిఐ శత వార్షికోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్రానికి పూర్వం నుండి దేశంలో పేదల పక్షాన నిలిచి వారి సమస్యల పరిష్కారం కోసం కొట్లాడిన పార్టీ సిపిఐ అని అన్నారు. ఈ సందర్భంగా దేశంలో 100సంవత్సరాల ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. దేశంలో త్యాగాలు చేసిన పార్టీ ఏదైనా ఉందంటే అది సిపిఐ అన్నారు. పేద ప్రజల కోసం దోపిడీలేని సమ సమాజ స్థాపన కోసం సిపిఐ అనేక పోరాటాలు చేసిందన్నారు. ఈసందర్భంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించి వేలాది మందిని రక్తదర్పణం చేసిన పార్టీ సిపిఐదే అన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్మృతి చిహ్నాన్ని ఈ సందర్భంగా మానుకోట జిల్లా కేంద్రంలో ఆవిష్కరించనున్నట్లు విజయసారథి తెలిపారు. అలాగే తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మానుకోట నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే తీగల సత్యనారాయణ విగ్రహం ఆవిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలకు సిపిఐ రాష్ట్ర నేతలు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని, సిపిఐ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొని సిపిఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని విజయసారథి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వరిపల్లి వెంకన్న, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, మేక వీరన్న,ఆబోతు అశోక్,మాలోతు రవీందర్, వికాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఉద్యోగుల ప్రక్షాళన

ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్



**ప్రజాపక్షం/భువనగిరి:** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో 24 గంటల అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు సరైన వైద్యం అందలేదన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సరైన మందులు లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రభుత్వం మారి సంవత్సరం గడుస్తున్నా ప్రాథమిక కేంద్రాలలో ఇదే వైఖరి కొనసాగడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. సాధారణ మందులు లేక పోవడం వల్ల ప్రైవేట్ మెడికల్‌లో కొనాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ఒకపక్క అనేకమైన విషజ్వరాలు, కరోనా లాంటి ప్రమాదకరమైన వైరస్‌లు పుట్టుకొస్తున్న పరిస్థితులలో సరైన ఆధునాతనమైన యంత్రాలు లేకపోవడంతో ప్రజలు తీవ్రమైన ఆందోళన చెందవలసి వస్తుందన్నారు. వెంటనే మేజర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో దయాగ్నోస్టిక్ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది కూడా సమయ పాలన లేకుండా ఇష్టారీతిలో హాజరవుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి మేజర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సిబ్బందిని ప్రక్షాళన చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎండి నయీమ్, సుద్దాల సాయికుమార్, ఎండి షాబుద్దీన్, ఉన్నారు.

## కూనంనేని చిత్రపటానికి పాలాభిషేకం



### కార్పొరేషన్ ఏర్పాటుతో నియోజకవర్గం సమగ్రాభివృద్ధి : పల్లపోతు సాయి

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలు, సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామపంచాయతీలతో కార్పొరేషన్ ఏర్పాటులో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషిని ప్రతిఒక్కరూ అభినందించాల్సిందేనని, కార్పొరేషన్ ఏర్పాటుతో అభివృద్ధిలో తడబడుతున్న కొత్తగూడెం మరింత అభివృద్ధి సాధిస్తుందని యునైటెడ్ మర్చంట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పల్లబోతు సాయి అన్నారు. పట్టణంలోని పెద్ద బజారులో మర్చంట్ అసోసియేషన్, ఏఐటియుసి అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కూనంనేని సాంబశివరావు చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటు కొత్తగూడెం ప్రాంత ప్రజలకు, వ్యాపారులకు ఊహించని కానుకని, అభివృద్ధి కాముకుడు కూనంనేని ముందుగాని ఆలోచించి కార్పొరేషన్ సాధించిపెట్టాడని తెలిపారు. అనతికాలంలో కొత్తగూడెం ప్రాంతం నగరాలకు ధీటుగా అభివృద్ధి సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. త్వరలో విమానాశ్రయం, హరిత హోటల్ అందుబాటులోకి రానున్నాయని, ఇది మరింత అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చారుగుండ్ల మురళి, ప్రేమ్‌కుమార్, కాండేల్వాల్, దామోదర్‌దాస్, అతసీనియా, మనీష్ అగ్రవాల్, పల్లపోతు శ్రీనివాస్, కాపుగంటి శ్రీనివాస్, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, తరాల రాజు, మొగలి తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబికి చిక్కిన ప్రిన్సిపాల్

### పట్టించిన కళాశాల పంతులమ్మ



**ప్రజాపక్షం/ఖమ్మం :** తనకు రావాల్సిన నెలవారి వేతనాన్ని ఇచ్చేందుకు లంచం అడిగిన ఓ ప్రిన్సిపాల్‌ను అదే కళాశాలలో పని చేసే పంతులమ్మ పట్టించిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ఇల్లందు మైనార్టీ గురుకుల కళాశాలలో ఏసిబి డిఎస్‌పి రమేష్ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించి అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుని నుంచి లంచం తీసుకుంటుండగా ప్రిన్సిపాల్ కృష్ణ, అటెండర్ రామకృష్ణలను ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కళాశాలలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుని సంధ్యారాణికి జీతం ఇవ్వాలంటే రూ.10వేలు లంచం ఇవ్వాలని ప్రిన్సిపాల్ డిమాండ్ చేసి చివరకు రెండు వేల రూపాయలకు ఒప్పుకున్నారు. దీనితో సదరు ఉపాధ్యాయుని ఎసిబి అధికారులను సంప్రదించింది. ఈ నేపథ్యంలో రెండు వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ప్రిన్సిపాల్, అటెండర్లు పట్టుబడ్డారు. వారిరువురిని అదుపులోకి తీసుకున్నారు.

## పండుగ వేళ పహారా ముమ్మరం

### ఊరికి వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలి, నగర వాసులకు సిపి సూచన



**ప్రజాపక్షం/ఖమ్మం, క్రైం :** సంక్రాంతి పండుగకు చాలా వరకు ప్రజలు తమ తమ స్వగ్రామలకు వెళ్తారని అటువంటి సమయంలో తాళం వేసిన ఇళ్లను దుండుగులు రెక్కి వేసి చోరీలకు పాల్పడుతారని దీని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా నగరంలో రాత్రి వేళ పోలీసు పహారా ముమ్మరం చేస్తున్నట్లు పోలీసు కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఊరు వదిలి వెళ్లేవారు విలువైన అభరణాలు, నగదు ఇంటి వద్ద ఉంచకుండా వెంట తీసుకుని వెళ్లాలని లేదా బ్యాంకులో భద్రపరుచుకోవాలని సూచించారు. ఈమేరకు గురువారం ఆయన ఊరు విడిచి వెళ్లేవారికి పలు సూచనలు చేశారు. ఊరికి వెళ్లే కుటుంబాల వారు ఇంటికి తాళం వేసినప్పుడు కనిపించకుండా పరద అడ్డు ఉంచాలన్నారు. చుట్టుపక్కల వారికి, సమీప పోలీసు స్టేషన్‌లో ఊరు వెళ్తున్న విషయాన్ని తెలియపరచాలన్నారు. ఇంటి ఆవరణలో సిసి కెమెరాలు ఉన్నవారు తరచూ సెల్‌ఫోన్‌లో గమనిస్తూ ఉండాలన్నారు. ఇతరులకు అనుమానం రాకుండా ఇంట్లో ఒక గదిలో లైటు వేసి ఉంచాలన్నారు. కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. దొంగతనాలు నివారించేందుకు రాత్రి సమయంలో పెట్రోలింగ్ పెంచుతున్నట్లు తెలిపారు. ముందుగా సమాచారం ఇచ్చిన వారి నివాస ప్రాంతాల్లో పోలీసు గస్తీ పెంచడమే కాకుండా సదరు ఇళ్లపై శ్రద్ధ చూపుతామన్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, ఆటోల అడ్డాలను తనిఖీలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించామని ఆయన పేర్కొన్నారు.

## నిబద్ధతగల కమ్యూనిస్టు లాలయ్య



**ప్రజాపక్షం/చింతకాని :** సీపీఐ సీనియర్ నాయకులు ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన చేబ్రోలు లాలయ్య నిబద్ధత గల కమ్యునిస్టు అని సీపీఐ రాష్ట్రసమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు అన్నారు. బుధవారం రాత్రి అనారోగ్యంతో లాలయ్య మృతి చెందడంతో ఆయన మరణవార్త తెలుసుకున్న కొండపర్తి ప్రొద్దుటూరులోని ఆయన నివాసానికి వెళ్లి లాలయ్య మృతదేహంపై పార్టీ జెండా ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ లాలయ్య బ్రతికినంతకాలం ఎర్రజెండాని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు. ఈ ప్రాంతంలో కమునిస్టు ఉద్యమం బలపడటానికి లాలయ్య పాత్ర ఎనలేనిదన్నారు. లాలయ్య కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వేపూరి రవీంద్రబాబు, ఎర్రా బాబు, శివరామకృష్ణ, మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జునరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇటికల రామకృష్ణ, గ్రామ శాఖ కార్యదర్శి తాళ్లపల్లి అజయ్, పుల్లా సాహెబ్, ఇంద్రసేనా, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, కాంగ్రెస్ నాయకలు కూరపాటి కిషోర్, మడుపల్లి భాస్కర్ తదితరులు ఉన్నారు.

## పాఠశాల ఏర్పాట్లను పరిశీలించిన డిఇఓ

**ప్రజాపక్షం/కరకగూడెం :** ప్రభుత్వం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మంజూరు చేసిన నవోదయ పాఠశాలను వచ్చే విద్యాసంవత్సరం నుండి ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లను జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకటేశ్వరాచారి గురువారం పరిశీలించారు. డిఇఓ వెంకటేశ్వరాచారి, ఏఎంఓ నాగరాజశేఖర్ కరకగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నవోదయ పాఠశాలను తాత్కాలికంగా ఏర్పాటు చేస్తే అవసరమైన సదుపాయాల కల్పన కోసం తీసుకొవాల్సిన చర్యలను వారు అంచనా వేశారు. జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ మంజులను పాఠశాల భవనాలు, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం వచ్చే విద్యాసంవత్సరం జూన్ నాటికి నవోదయ పాఠశాలను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశాల జారీ అయ్యాయన్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు ప్రాంగణంలో గల భవనాలను, గదులను పరిశీలించారు. ప్రాంగణంలో గల భవనాల్లో కేజిబివి పాఠశాల కొనసాగేదని, హెచ్ఎం మంజుల తెలిపారు.

# నైపుణ్యమైన ఉపాధ్యాయులను అందించండి



### తొలి ఏడాది 11వేలకు పైగా ఉపాధ్యాయుల భర్తీ : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్/తల్లాడ :** డైట్ కళాశాల నైపుణ్యత గల ఉపాధ్యాయులను తయారుచేసి సమాజానికి అందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని ఏడవ డివిజన్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి డైట్ అడ్మినిస్ట్రేటీవ్ భవన ఆధునీకరణ, అదనపు సదుపాయాల ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ 70 సంవత్సరాలలో అనేక కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ఆశించిన స్థాయిలో విద్యను అభివృద్ధి చేయలేకపోయామన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా కీలకమైందని దీని వల్ల అద్భుతమైన మార్పులు సాధ్యమవుతాయని మంత్రి తెలిపారు. జీవితంలో ఏదో ఒక స్థాయిలో ఉన్న ప్రతి వ్యక్తికి ఏదో ఒక దశలో ఒక ఉపాధ్యాయుడు మార్గం చూపే ఉంటారని మంత్రి తెలిపారు. మనం ప్రస్తుతం మంత్రులుగా, ఉన్నతాధికారులుగా ఉండటానికి మన గురువులు మూలమని మంత్రి అన్నారు. ప్రస్తుతం డైట్ కళాశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప ఉపాధ్యాయులుగా తయారు కావాలని మంత్రి ఆకాంక్షించారు. నైపుణ్యత ఉన్న ఉపాధ్యాయుల కొరత ఉండడం వల్ల విద్యా ప్రాముఖ్యత ప్రమాణాలు తగ్గుతున్నాయని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో పిల్లలకు పూర్తి పరిజ్ఞానంతో సంపూర్ణ విద్యను అందించేలా డైట్ కళాశాల నుంచి ఉపాధ్యాయులు బయటకు రావాలన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలోనే 11 వేలకు పైగా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేశామని, ప్రతి ఏడాది ఖాళీ అవుతున్న ఉపాధ్యాయ పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తామన్నారు. డైట్ కళాశాల ఆవరణ గ్రీనరీతో పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండే విధంగా తయారు చేయాలన్నారు. డైట్ కళాశాలలో ఎటువంటి మొక్కలు నాటాలో ప్రిన్సిపాల్, సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుని విద్యార్థుల సహకారంతో పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రజల శ్రేయస్సు కోరకు సమన్వయంతో పని చేయాలన్నారు. అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ మాట్లాడుతూ ప్రస్తుత యువతలో ఉపాధ్యాయ వృత్తి పట్ల ఆసక్తి వ్యక్తం చేసే వారి సంఖ్య తగ్గుతుందన్నారు. ఖమ్మం డైట్ కళాశాల నుంచి అద్భుతమైన ఉపాధ్యాయులు తయారయ్యారని ఆమె తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిని ప్రోత్సహించాలంటే నాణ్యమైన ఉపాధ్యాయులను తయారు చేయాల్సిన అవసరం ఉంటుందని ఇందులో భాగంగా డైట్ కళాశాల పరిపాలన భవన ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా మంచి పరిణామమన్నారు. ఖమ్మం డైట్ కళాశాల వద్ద ఏర్పాటు చేసే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అనేక వసతులు ఉంటాయని వీటిని ఉపయోగించుకోవాలని ఆమె తెలిపారు. డైట్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య పెరగాలని ఇక్కడ మౌలిక వసతులను వీలైనంత త్వరగా అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ, డిఈవో సోమశేఖర శర్మ, ఖమ్మం ఆర్డివో జి.నర్సింహారావు, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, కార్పొరేటర్లు దొంగల సత్యనారాయణ, లకావత్ సైదులు, కమర్తపు మురళి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వివిపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదుబాబు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**గోదావరి జలాలతో జిల్లాను సస్యశ్యామలం చేస్తాం**



గోదావరి జలాలతో ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే దిశగా సీతారామ ఎత్తిపోతల పథకం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎంఎల్ఏ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి తల్లాడ మండలం నూతనకల్ గ్రామంలో నాబార్డు నిధులతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయ భవనం, గోదాంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ తల్లాడ మండలంతో తనకు చాలా ఏళ్లుగా అనుబంధం ఉందని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రాధాన్యతగా ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలిపారు. సాగర్‌పై లిఫ్టులు పెట్టి చివరి భూముల వరకు సాగునీటిని తీసుకు వచ్చామని, చెక్‌డ్యాంలు నిర్మించామని తన చిరకాల కోరిక అయిన గోదావరి జలాలు కూడా రైతుల పొలాలకు త్వరలో రాబోతున్నాయని మంత్రి తెలిపారు. గోదావరి జలాలు ఖమ్మం జిల్లాకు రావాలని తాను ఆకాంక్షించానని, కృష్ణా జలాలు రాని పరిస్థితిలో కూడా గోదావరి నీటితో ఖమ్మం జిల్లాకు సాగునీరు అందాలని, ఈ ప్రాంతం పచ్చగా ఉండాలని సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నీటిని తీసుకు వస్తున్నామన్నారు. రాబోయే కాలంలో కృష్ణా జలాలు రావడం ఆలస్యమైన గోదావరి నీటితో రైతులకు సకాలంలో సాగునీటిని అందిస్తామని మంత్రి తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 నియోజకవర్గాల పరిధిలో సాగునీటికి సంపూర్ణ భరోసా అందించేలా సీతారామ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయన్నారు. రాబోయే సంవత్సరానికి సత్తుపల్లి, వైరా నియోజకవర్గాలకు గోదావరి జలాలు చేరుతాయని మంత్రి తెలిపారు. సొసైటీల ద్వారా రుణాలు తీసుకుని మాఫీ కానీ అర్హులైన రైతులు ఉంటే వివరాలు అందించాలని వారికి కూడా రుణమాఫీ చేస్తామని తెలిపారు. రైతును ఆదుకోవాలనే ఉద్దేశంతో రూ. 12వేల రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. వివిధ కారణాలతో రైతు మరణిస్తే ఆ కుటుంబానికి వారం రోజుల్లో ఐదు లక్షలు చేరేవిధంగా రైతు బీమా పథకాన్ని కొనసాగిస్తున్నామన్నారు. రాబోయే ఖరీఫ్ నుంచి ప్రతి పంటకు బీమా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. దిగుమతి తగ్గితే, పంట రాని పక్షంలో ఆలోటును రైతు బీమా కంపెనీల ద్వారా భర్తీ చేసే విధంగా పంట బీమా పథకాన్ని రూపొందిస్తున్నామన్నారు. రైతులు వరి పంట మాత్రమే కాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని ఆయిల్ పాం, జాజి, వక్క వంటి పంటలను సాగు చేయాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను పెంచేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందని రైతులకు, పరిపాలన పరంగా వెసులుబాటు ఉండేవిధంగా నూతన సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. సత్తుపల్లి ఎంఎల్ఏ రాగమయి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే పరమావధిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాయకత్వంలో వ్యవసాయ శాఖ పని చేస్తుందని ఆమె తెలిపారు. రెండు లక్షల వరకు రైతుల రుణమాఫీ ప్రక్రియ పూర్తయిందని సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానీ రైతులకు త్వరలో మాఫీ అవుతుందని ఆమె తెలిపారు. వరి పంటకు మద్దతు ధరతో పాటు సన్న రకం ధాన్యానికి రూ. 500 బోనస్ అందించడం పట్ల రైతులు సంతోషంగా ఉన్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా సహకార అధికారి గంగాధర్, డిసిసిబి సిఈవో వెంకట ఆదిత్య, సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, డైరెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

## పర్యాటక ప్రాంతంగా ఖమ్మం ఖిల్లా అభివృద్ధి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం ఖిల్లా పైకి వెళ్లేందుకు ఏర్పాటు చేయనున్న రోప్‌వే, జాఫర్ బావి అభివృద్ధితో ఖమ్మం పర్యాటక ప్రాంతంగా మారుతుందని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం ఖమ్మం ఖిల్లా ప్రాంతం పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడంలో భాగంగా జాఫర్‌బావి పునరుద్ధరణతో పాటు పర్యాటకులు సురక్షితంగా ఆహ్లాదకర వాతావరణంలో ఖిల్లా పైకి వెళ్లి సందర్శించే విధంగా రోప్‌వే ఏర్పాటుకు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఖిల్లా మెట్ల మార్గం ద్వారా అధికారులతో కలిసి ఖిల్లాపైకి వెళ్లి క్షేత్రస్థాయిలోలో పరిశీలించారు. ఖమ్మం ఖిల్లాకు రోప్‌వే ఏర్పాటుకు అనువుగా ఉండే మార్గం, ఎక్విప్‌మెంట్ ఖిల్లాకు రావడానికి రోడ్డు అనుకూలత, పార్కింగ్, టాయిలెట్స్ ఏర్పాట్లపై పరిసరాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. జాఫర్ బావి వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖిల్లాపై పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మంత్రుల ఆదేశాల మేరకు ప్రజలకు అనుకూలంగా, ఖిల్లాకు పూర్వ వైభవం తీసుకు వచ్చేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. సందర్శకులకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలుగకుండా ఖిల్లాకు వచ్చేలా ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రత్యేక హంగులతో లైటింగ్, అనువైన పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖాధికారి సుమన్ చక్రవర్తి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, కార్పోరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలి



**ప్రజాపక్షం/మణుగూరు :** సిపిఐ పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నుంచి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, సిపిఐ ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిందని దీనిని ఎవరు మర్చిపోకూడదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య అన్నారు. గురువారం సిపిఐ కార్యాలయంలో జరిగిన మండల కార్యదర్శులు మరియు మణుగూరు మండల పట్టణ, కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా ఈ సమావేశానికి రాయల బిక్షం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా బి. అయోధ్య హాజరై మాట్లాడుతూ పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అయిన సందర్భంగా పార్టీ పేద ప్రజల పక్షపాతి అని, కార్మిక, కర్షక, అణగారిన వర్గాల కోసం నిరంతరం పాటుపడే పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని, అధికారం ఉన్నా లేకున్నా పేద ప్రజల కోసం వారి అభ్యున్నతి కోసం నిరంతరం వారితో ఉంటూ వారి కష్టసుఖాలలో భాగస్వామ్యం అవుతూ పోరాటం నిర్వహిస్తున్న సిపిఐ (ఎర్రజెండా) శతజయంతి ఉత్సవాలు దేశ వ్యాప్తంగా జరపడం మామూలు విషయం కాదని, అధికారం లేకుంటే కనుమరుగైపోతున్న అనేక పార్టీలు ఇవాళ మనం కళ్ళకు కట్టినట్లు చూస్తున్నామని, ఈ దేశంలో ఇంకా అధికారంలో లేకున్నా 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని, నిజాం నవాబును ఎదురించి దొరల గడీలను బద్దలు కొట్టి, తెలంగాణ సాయుధ పోరాటం నడిపి వేలాది ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అన్నారు. సిపిఐ పార్టీ ని పినపాక నియోజకవర్గంలో అన్ని గ్రామాలలో పార్టీని బలోపేతం చేయాలని, కొంత మంది కేవలం ఏ పార్టీ అధికారంలో ఉంటే వారికి తొత్తులుగా పని చేస్తున్నారని ఇది సరైన విధానం కాదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మి కుమారి, మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, అశ్వాపురం మండల కార్యదర్శి అనంతనేని సురేష్, బూర్గంపాడు మండల కార్యదర్శి ముచ్చా వెంకటేశ్వరరావు (లడ్డా), పినపాక మండల కార్యదర్శి పద్మనాభ రాజు, జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాస్, గడ్డం మనోహరా చారి, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్ మాజీ ఎంపీటీసీ కామిశెట్టి రామారావు, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్షులు రాయల బిక్షం, కార్యవర్గ సభ్యులు ఆధర్ల రాములు, జక్కుల రాజబాబు, కన్నెబోయిన ప్రసాద్, వజ్జ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకొని నిరంతరం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తహసిల్దార్ పి.వి.రామకృష్ణ, ఎంపీడీవో ఎస్ కే.సిలార్ సాహెబ్, ఎంపీఓ సూర్యనారాయణ అన్నారు. సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ వసుంధర సిబ్బందితో కలిసి బీరోలు సబ్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. మొదట సబ్ సెంటర్‌ను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని అనంతరం ఓపి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది నిరంతరం గ్రామాలలో వ్యాధులను ముందే గుర్తించి తగు చర్యలు చేపట్టాలని, ప్రజలను ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించే విధంగా సూచనలు చేయాలని ఆయన తెలిపారు. గ్రామాలలో నివాస గృహాలను మరియు పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించే విధంగా ప్రజలను చైతన్య పరచాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సదుపాయాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అందేవిధంగా చూడాలని డాక్టర్ వసుంధరకి సూచనలు చేశారు. ఆశ వర్కర్లు నిరంతరం గ్రామాల్లో గర్భిణీ స్త్రీలను గుర్తించి వారికి మెరుగైన సేవలు అందించి సాధారణ కాన్పులు అయ్యే విధంగా చూడాలని ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు అయ్యేటట్టు ప్రోత్సహించాలని వారు సూచించారు. గత సంవత్సరం సెప్టెంబర్ వారంలో వచ్చిన భారీ వరదలకు తిరుమలాయపాలెం మండలంలో వైద్య సిబ్బంది ఎంతో ఉత్తమ వైద్య సేవలు అందించారని అభినందించారు. అనంతరం పలు గ్రామాల్లో సబ్ సెంటర్‌లను పల్లె దావకానాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసుంధర ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వీరయ్య పాల్గొన్నారు.

## వాలీబాల్ పోటీలు ప్రారంభం



**ప్రజాపక్షం/లక్ష్మీ - దేవిపల్లి :** లక్ష్మీ దేవి పల్లి మండలంలోని మైలారం గ్రామం నందు గురువారం వాలీబాల్ పోటీలను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాస రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహపూర్వక సంబంధాలను పెంపొందిస్తాయని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలని అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలను నిర్వహించడం పట్ల నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు దీటి లక్ష్మీ పతి, సొసైటీ డైరెక్టర్ కంటెం సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి దారా శ్రీనివాస్, జలీల్‌పాషా, రాజబాబు, బైకాని, కృష్ణ, పారిపర్తి రాజు, మారినేని మాధవరావు, నరేష్, లాలు, గోపాల్ పాల్గొన్నారు.

# ప్రకృతి అందాల ఒడిలో కిన్నెరసాని




**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్ :** కిన్నెరసాని తెలంగాణలో అద్భుత పర్యాటక కేంద్రం. కిన్నెరసాని ప్రకృతి అందాలను మాటల్లో వర్ణించలేం. అక్షరాల్లో రాయలేం. ఇక్కడికెళ్లే ఆహ్లాదం, ఆనందం లభిస్తాయని పర్యాటకులు చెబుతారు. అలాంటి టూరిజం స్పాట్‌పై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తెస్తోంది. కిన్నెరసాని ప్రకృతి అందాలు పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే ప్రదేశం కిన్నెరసాని. ఇక్కడికి వచ్చే టూరిస్టులను మరింత ఆకర్షించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ పర్యాటకులతో మాట్లాడి... అభిప్రాయాలు సేకరించారు. అధికారులతో సమీక్షించి కార్యాచరణ ప్రారంభించారు. ప్రకృతి అందాలకు మరిన్ని సొబగులు జోడిస్తున్నారు. కిన్నెరసాని ద్వీపంలో కాటేజీ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఇటీవలే హైదరాబాద్ నుండి వచ్చిన ఓ సంస్థ బృందం దీనిపై పరిశీలన జరిపింది. వెదురుతో కాటేజీ నిర్మించడానికి అవకాశం ఉన్నట్లు తేల్చింది. వీటిని నిర్మిస్తే పర్యాటకుల చిరకాల కోరిక నెరవేరినట్లే. ఆనంద ద్వీపం దగ్గరకు వెళ్లాలని పర్యాటకులు ఉత్సాహపడతారు. కాటేజీలు నిర్మిస్తే అక్కడి అందాలను వీక్షించడానికి మార్గం సుగమం అవుతుంది. కిన్నెరసాని పర్యాటక కేంద్రం ప్రధాన ద్వారానికి కొత్త కళ తెచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. టోల్‌గేట్ సమీపంలో వెదురుతో రెండు వంతెనలు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇది కూడా త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశముంది. కిన్నెరసాని సమీపంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనువుగా కళా వేదిక నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. వెదురు కళాకృతులతో వేదిక ప్రాంతాన్ని తీర్చిదిద్దనున్నారు. కిన్నెరసాని పర్యాటక కేంద్రంలోని షెడ్‌ను క్యాంటీన్‌గా మార్చాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. దీని నిర్వహణ భాద్యతలను మహిళలకు అప్పగించాలని భావిస్తున్నారు. ఇక్కడా వెదురుతో తయారు చేసిన బల్లలకే ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించారు. కిన్నెరసాని కాలువకు రెండు పక్కలా రెయిలింగ్ ఏర్పాటు చేయనున్నారు. పర్యాటకులు కూర్చునేందుకు వీలుగా బల్లలను వేయనున్నారు. ఇక్కడ నీటి ప్రవాహంపై విహరించేందుకు నాటు పుట్టీలు ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఈ పనులు జరిగితే పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినట్టు అవుతుంది. తద్వారా టూరిస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్ కిన్నెరసానిపై ఫోకస్ పెట్టారు. ఇక్కడ పనులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన నిధులు, అనుమతులు తొందరగా మంజూరు అయ్యేలా చొరవ చూపిస్తున్నారు.





## సమసమాజ స్థాపనకు కృషి చేద్దాం

సిపిఐ జిల్లా కార్యదర్శి సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** సమసమాజ స్థాపనకు కృషి చేద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ కెఆర్.విజ్జు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. 2025 జనవరి 7న హైదరాబాద్‌లో జరిగిన ఎఐడిఆర్‌ఎం రెండవ జాతీయ మహాసభలలో పాల్గొన్న కేరళకు చెందిన సిపిఐ నాయకుడు కెఆర్.విజ్జు గుండెపోటుతో మృతి చెందటం బాధాకరమన్నారు. కెఆర్.,విజ్జు కేరళ రాష్ట్రంలో ఆర్టీసీ కండక్టర్‌గా ఉంటూ ఎఐటియుసి ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకుడిగా, రాష్ట్రంలో అణగారిన వర్గాల కోసం పోరాడుతూ దళిత సంఘం నాయకుడిగా ఉంటూ అనేక సేవలు అందించారన్నారు. ఆయన కోరుకున్నా సమసమాజం కోసం అందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఓమయ్య, కమలాపురం రాజయ్య, నాయకులు సక్కి సురేష్, అజీజ్, ఆనంద్ పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కుల పంపిణి



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలో పాటు మండలంలోని లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గురువారం పంపిణీ చేశారు. 37మంది లబ్ధిదారులకు 11 లక్షల 50వేల రూపాయలను చెక్కుల రూపంలో అందజేశారు. కార్యక్రమంలో బైంసా పట్టణ బిజెపి అధ్యక్షుడు ఎను పోతుల మల్లేష్, కౌన్సిలర్లు తోట విజయ్, రావుల సువర్ణ పోశెట్టి, సీనియర్ నాయకులు సోలంకే భీమ్రావ్, బిజెపి మండల అధ్యక్షుడు భూమేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు సిరం సుష్మ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ తోటలింగురాం, నాయకులు అనిల్, గిలి రాజు, కాసారోళ్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అటవీ హక్కుల చట్టాలపై అవగాహన

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** అటవీ హక్కు చట్టలపై నాగార్జునసాగర్ జరిగిన అవగాహన శిక్షణ శిభిరంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బోజ్జు పటేల్ పాల్గొన్నారు. అటవీ హక్కు చట్టాల పై ప్రసంగించి శిక్షణ తరగతులకు హాజరైన వారికి తగు విషయాలపైన అవగాహన కల్పించారు. అటవీ చట్టాలపై అందరూ బాధ్యతయుతంగా ఉండాలని అడవుల గురించి ఆదివాసుల గురించి సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత కాంగ్రెస్ ఎస్సి డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు, ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు పలువురు మేధావులు పాల్గొన్నారు.

## ట్రెసా క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా)2025 క్యాలెండర్ ను గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారి, ఎం. డేవిడ్‌లతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి మధుకర్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి

**ప్రజాపక్షం/బోథ్ :** గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు కేటాయించిందని బోథ్ నియోజకవర్గ ఇంచార్జి ఆడె గజేందర్ అన్నారు. మండలంలోని నాగాపూర్ గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఆ గ్రామంలో పర్యటించి గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సిసి రోడ్లు, మురుగు నీటి నిర్వహణకు డ్రైన్‌లు,నీటి వసతి కోసం బోరు బావుల నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. హనుమాన్ మందిరాన్ని జగదంబ దేవి ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ఇంచార్జి మంత్రి దృష్టికి గతంలో సమస్య తీసుకు వెళ్లగానే నూతన గ్రామ పంచాయితీకి అనుమతులు ఇచ్చిందని త్వరలోనే గ్రామానికి సంబందించిన రోడ్డుకు బీటి వేయిస్తామని తెలిపారు. గ్రామంలో ఉన్న పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలు పెంచే విధంగా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబ్యాసం చేయించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుపుల చంటి, నాయకులు కాశీరాం, మాజీ ఉప సర్పంచ్ బలిరాం, రాజేష్ పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగుపై అవగాహన

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ, వ్యవసాయ శాఖ లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన సదస్సు నిజాంపేట్ రైతు వేదికలో గురువారం జరిగింది. కార్యక్రమానికి ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ మండల వ్యవసాయ అధికారి సోమ లింగారెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఆయిల్ పామ్ విస్తరణ అధికారుల మండల రైతులు హాజరయ్యారు. ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని, దీని వలన రెట్టింపు ఆదాయం పొందవచ్చన్నారు. పంటకు కోతుల బెడద ఉండదన్నారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు మొక్కలపై రాయితీతో పాటు నాలుగు సంవత్సరములు తోట నిర్వహణ అంతర పంటల సాగు కొరకు రాయితీ జమ చేయబడుతుందన్నారు. రైతులు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన పెంచుకొని అధిక విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగు చేపట్టి ఇతర పంటల కంటే అధిక దిగుబడి లాభం పొందాలని కోరారు.

## పంటపొలం ధ్వంసం..ముగ్గురిపై కేసు

**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఎడపల్లి మండల కేంద్రం రెవెన్యూ పరిధిలోని సాటాపూర్ గేట్ సమీపంలో గ్రామానికి చెందిన జమీల్ అనే వ్యక్తికి చెందిన పంట పొలాన్ని ధ్వంసానికి పాల్పడిన అశ్వక్, అతిక్, తమీమ్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు తెలిపారు. ఈఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సాటాపూర్ గేట్ సమీపంలోని ఓ పంట భూమిని ఓ రైతు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించారు. ఈ క్రమంలో ఆ సర్వే నంబర్‌కు అనుకొని ఉన్న తన భూమిలో జమీల్ అనే రైతు వరి పంట నాటారు. అయితే ఆ భూమి తమదంటూ ఆ రియల్ వ్యాపారులు కొంతమందిని వెంట పెట్టుకొని నాటిన వరి పంటను జెసిబితో ధ్వంసం చేశారు. దీంతో జమీల్ పోలీసులను ఆశ్రయించగా స్పందించిన రూరల్ సిఐ విజయ్‌బాబు ఘటన స్థలానికి వచ్చి పంట ధ్వంసం చేస్తుండటాన్ని అడ్డుకొని పోలీస్ ఫికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ చర్యకు పాల్పడ్డ వారిని ఫిర్యాదుదారులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పంట పొలంలోకి అక్రమంగా చొరబడి ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేశారు. జెసిబిని సీజ్ చేశారు. అధికారులు సర్వే నిర్వహించే వరకు ఆ స్థలంలోకి ఇరువురు వెళ్లరాదని సూచించారు.

# అభివృద్ధి పనులకు భూసేకరణ ప్రక్రియ వేగవంతం

ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లాలో వివిధ అభివృద్ధి పనులలో భాగంగా చేపట్టే భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి నీటిపారుదల, రోడ్లుభవనాలు, సింగరేణి, రైల్వే, రెవెన్యూ శాఖల అధికారులతో జిల్లాలోని వివిధ ప్రాజెక్టులు, చెరువులు, కాలువలు, వంతెనలు, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, సింగరేణి, రైల్వే లైన్లో విస్తరణలో అవసరమైన భూముల సేకరణ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులైన కుమ్రంభీమ్ ప్రాజెక్టు, జగన్నాథపూర్ ప్రాజెక్టు, పిపి రావు ప్రాజెక్టు, చెరువుల నిర్మాణం, కాలువల నిర్మాణం, రైల్వేలైన్ల ఏర్పాటులో సింగరేణి ఉపరితల గనుల ఏర్పాటుకు అవసరమయ్యే భూముల కొరకు భూసేకరణ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం త్వరగా చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, భూసేకరణపై కోర్టులలో ఉన్న కేసులను సత్వరమే పరిష్కారమయ్యే విధంగా కోర్టులకు నివేదికలు సమర్పించాలని తెలిపారు. సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు గుణవంత్‌రావు, ప్రభాకర్, సింగరేణి సంస్థ బెల్లంపల్లి ఏరియా జిఎం. శ్రీనివాస్‌తో పాటు రెవెన్యూ, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలి

జిల్లాలో చేపట్టిన రహదారి భద్రత మాసోత్సవాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా రహదారుల భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి పోలీస్, రెవెన్యూ, రవాణా, రోడ్లుభవనాలు, గ్రామీణాభివృద్ధి, గిరిజన ఇంజనీరింగ్, విద్య శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు నియంత్రించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, రహదారి ప్రమాదాలపై గ్రామాలు, మండల కేంద్రాలు, పట్టణాలలో అవగాహన సదస్సులు నిర్వహించి రహదారి భద్రత నియమ నిబంధనలపై విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని 45 ప్రాంతాలలో ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించడం జరిగిందని, ఆయా ప్రాంతాలలో ప్రమాదాల నివారణ కొరకు వేగ నియంత్రణ సూచిక బోర్డులు ఏర్పాటు సంబందిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో రోడ్లు భవనాలశాఖ ఇఇ సురేష్, జిల్లా రవాణాశాఖ అధికారి రామ్‌చందర్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సీతారాం, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతితో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థ బలోపేతానికి చర్యలు

కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/పాపన్నపేట :** విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకే ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటుందని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పాపన్నపేట మండలం చికోడు జిల్లా పరిషత్ హైస్కూల్, షెడ్యూల కులాల బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. విద్యార్థుల భోజనశాలను, స్టోర్ రూములు పరిశీలించారు. మెనూ అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో కలెక్టర్ టీచర్‌గా పాఠాలు బోధించి ప్రశ్నలతో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నదని, అందులో భాగంగానే మెనూ సమర్థవంతంగా అమలు చేసున్నామని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట చీకోడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు, సంబంధిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చేయూత

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ప్రజాపక్షం/నస్పూర్ :** స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధి దిశగా ప్రభుత్వం చేయూత అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ (ఆర్ఎస్ఇటిఐ) ఉట్నూర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూట్ బాగ్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కిషన్, ఆర్ఎస్ఇటిఐ సంచాలకులు మహమ్మద్ గౌస్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్ఎస్ఇటిఐ ఉట్నూర్ ఆధ్వర్యంలో 2 బ్యాచ్‌లకు జూట్ బాగ్ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. జన్నారం మండలంలో 35 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ ఇచ్చి వారికి టూల్ కిట్లు, ధృవపత్రాలు అందజేసినట్లు తెలిపారు. లక్షెట్టిపేట మండలంలో 35 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలను ప్రోత్సహిస్తూ వ్యాపార అభివృద్ధికి ప్రభుత్వం తరుపున బ్యాంక్ ద్వారా రుణ సదుపాయం కల్పించడం జరుగుతుందని, ఉత్పత్తులను తయారు చేసి నిర్ణీత ధరతో విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఏకరూప దుస్తులను తయారు చేసేందుకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ జెడిఎం రాంచందర్, శిక్షకులు శ్రీనివాస్, ఆశన్న, సతీష్, స్వర్ణలత, గురువయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### వైద్యసేవలు వేగవంతంగా అందించేందుకు చర్యలు

**మంచిర్యాల ప్రతినిధి :** ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల ద్వారా వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలను కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్తో కలిసి ఆకస్మికంగా సందర్శించి కళాశాలలోని వివిధ విభాగాలు, కళాశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరిగిందని, పరిశోధనకు అవసరమైన సామాగ్రి, పరికరాలు అందుబాటులో ఉంచడం జరిగిందని, నిష్ణాతులైన ప్రొఫెసర్లచే విద్యాబోధన జరుగుతుందని తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జాగ్రత్తలతోనే రోడ్డుప్రమాదాల నివారణ

అవగాహన ర్యాలీలో జిల్లా జడ్జి, కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జాగ్రత్తలతోనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, ప్రమాదాల బారిన పడకుండా ఎంతో విలువైన ప్రాణాలను కాపాడుకునేందుకు వాహనాలు నడిపే సమయంలో ప్రతిఒక్కరూ హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల, కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సూచించారు. నిర్లక్ష్యం బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. శిరస్త్రాణం ధరించాల్సిన అవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన ఈ ర్యాలీని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద జిల్లా జడ్జి, కలెకర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతివేగంగా వాహనాలు నపడటం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవటం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయన్నారు. ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నావారు నిండు ప్రాణాలను కోల్పోతుండగా వారి కుటుంబాలకు కూడా తీరని నష్టం కలిగిస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, చిన్నచిన్న సరదాలకు పోయి నిర్లక్ష్యంతో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చవద్దని హితవు పలికారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే దాదాపు 90 శాతం వరకు ప్రాణాపాయం బారి నుండి తమకు తాము కాపాడుకునేందుకు ఆస్కారం ఉంటుందని సూచించారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించటాన్ని అలవాటుగా చేసుకోవాలని, దీనిని కనీస బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ప్రమాదాల నియంత్రణ కోసం వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనల మేరకు జరిమానాలు విధించడం వంటివి చేస్తున్నప్పటికీ ఎవరికి వారు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించినప్పుడు ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. అనంతరం గాలిపటాలు ఎగురవేసే సమయంలో ప్రాణాంతకంగా పరిణమిస్తున్న చైనా మాంజా నిషేధం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీలుగా ముద్రించిన పోస్టర్లు జిల్లా జడ్జి , కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు డిసిపి బస్వారెడ్డి, సీనియర్ సివిల్ జడ్జి పి.పద్మావతి, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి గోపికృష్ణ, జడ్జిలు ఖుష్బూ, శ్రీనివాస్‌రావు, దుర్గాప్రమీల, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




## ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు : కలెక్టర్ అభిలాష



**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇసుక అక్రమ రవాణ నియంత్రణ, ధరణి దరఖాస్తుల పరిష్కారం, తదితర రెవిన్యూ అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. మండలాల వారీగా ఇసుక అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తించాలని, రహదారులు, భవనాలు, సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు వంటి వాటికి ప్రభుత్వ రికార్డులను పరిశీలించి ఇసుక అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణా జరుగకుండా ప్రధాన రహదారులపై తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయాలన్నారు. అలాగే ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల వారీగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ప్రజావాణి, సిఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్‌డిఒలు రత్నాకళ్యాణి, కోమల్‌రెడ్డి, ఎడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ సుదర్శన్, ఇడిఎం నదీమ్, తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

## సెంట్రల్ జైలును సందర్శించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



**ప్రజాపక్షం/కంది :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ సెంట్రల్ జైలును తనిఖీ చేసారు. సెంట్రల్ జైలులో ఉన్న బెరక్‌లు, గదులు, వంట గది, బాత్రూంలు, జైలు ఆవరణ పరిశీలించారు. ఖైదీలను జైలులో ఉన్న సదుపాయాలను భోజనం గూర్చి అడిగి తెలుసుకున్నారు. జైలులో వారికి కావాల్సిన అవసరాలు, సదుపాయాలు అందించేలా చూడాలని జైలు సూపరింటెండెంట్ కోరారు. కేసులు పరిష్కరించేందుకు న్యాయ సేవలు పొందేందుకు ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని ఖైదీలకు తెలిపారు. ఖైదీలకు పెడుతున్న భోజనం రుచి చూశారు. కూరగాయాలు, బియ్యం, ఉన్న రూమ్‌ను తనిఖీ చేశారు. జైల్లో ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్ పరిశీలించారు. తనిఖీలో జిల్లా న్యాయ సేవాదికార సంస్థ అధికారులు, సిబ్బంది జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ అనుబంధ రుణాలకు ప్రాధాన్యం

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా వ్యవసాయ వ్యవసాయేతర అనుబంధ రుణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సాంకేతిక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. డిస్ట్రిక్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు లిమిటెడ్ ఉమ్మడి మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 2025–2026 సంవత్సరానికి పంట రుణాల జారీకి వివిధ వ్యవసాయ ఉద్యాన పంటలకు వాస్తవిక స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఫిక్స్ చేయడం, రికవరీకి గడువు తేదీని ఖరారు చేయడం తదితరు అంశాలను సమావేశంలో చర్చించారు. 2025–26 సంవత్సరానికి డెయిరీ ఫిష్ పౌల్ట్రీ రుణాల జారీకి వివిధ డెయిరీ గొర్రెలు, పౌల్ట్రీ యూనిట్‌లకు ఫైనాన్స్ రికవరీకి గడువు తేదీని సమావేశంలో నిర్ణయించారు. సహకార బ్యాంకులు నూతన రుణాలు అందజేయలని కమర్షియల్ బ్యాంకులతో పోటీ పడి రైతులకు సేవలు అందించాలని కలెక్టర్ బ్యాంకు అధికారులకు విజ్ఞప్తి చేశారు. రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు డిపాజిట్ల సేకరణ జరపాలన్నారు. సహకార బ్యాంకుల ద్వారా రైతులకు గృహ నిర్మాణ రుణాలు లాంటి వినూత్న పథకాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిఇఒ శ్రీనివాస్ ఎల్డిఎం గోపాల్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

గణతంత్ర దినోత్సవం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్రాంతి వల్లూరు అధ్యక్షతనగణతంత్ర దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారుల నుద్దేశించి మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకలకు పరేడ్, భద్రతా చర్యలు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, శకటాల ప్రదర్శన, ముఖ్య అతిథుల ఆహ్వానం తదితర ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి శాఖ తన పనిని సమయానికి పూర్తి చేసి నిర్దేశిత సమయానికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ పద్మజ రాణితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలి

ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్

**ప్రజాపక్షం/బైంసా :** ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల హామీలను నెరవేర్చి అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అధికాలను కోరారు. గురువారం బాసర మండల కేంద్రంలో కళ్యాణలక్ష్మి, షాది ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్దిదారులకు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. బాసర అభివృద్ధికి నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉపాధి హామీ నిధులు 11 లక్షల రూపాయలతో బాసరలో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం టాక్లి గ్రామంలో 10 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. బాసరలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం దృష్టి సారించిన ఎమ్మెల్యే, త్వరలో విద్యాలయాన్ని ప్రారంభించేందుకు తాత్కాలిక భవనాలను పరిశీలించారు. విద్యార్థులకు అనువుగా ఉండే విధంగా భవన ఎంపిక చేసేందుకు ఆయన రెండు చోట్లకు వెళ్లి భవనాన్ని పరిశీలించి, అధికారులకు,స్థానిక నాయకులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, మాజీ జెడ్పిటిసి సావలి రమేష్, మాజీ ఎంపీపీ విశ్వనాథ్ పటేల్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి పాండే, నాయకులు ప్రతాప్ రావ్, బిద్దు రమేష్, నారాయణరెడ్డి, మధు పటేల్, యోగేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయాలు విజ్ఞానకేంద్రాలు

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** గ్రంథాలయాల విజ్ఞాన కేంద్రాలని, ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు టివైఆర్ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్‌లో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది తలకొక్కుల రాజుతో కలిసి ఆయన ప్రసంగించారు. మారుతున్న పరిస్థితుల్లో సత్తా చాటే విద్యార్థులకే భవిష్యత్తు ఉండగా, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న లైబ్రరీల ద్వారా విద్యతోపాటు పోటీ పరీక్షల్లో సైతం నైపుణ్యత ప్రదర్శించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ విద్యార్థులకు సాంప్రదాయక విద్యపై మంచి పట్టు ఉంటుందని, ఈ గ్రామీణ లైబ్రరీలతో పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, వివిధ కోర్సులు, ఉద్యోగ నోటిఫికేషన్లు, గ్రూప్ పరీక్షలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం తదితర ప్రపంచస్థాయి అంశాల పట్ల గ్రామీణ విద్యార్థులకు అవగాహన కలుగుతుందని తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ రాజు మాట్లాడుతూ చిన్నతనంలో పడిన కష్టాలు నేటి తరం యువత, విద్యార్థులు పడకుండా ఉండాలన్నదే తన లక్ష్యం అన్నారు. విజ్ఞాన కేంద్రంలో హైటెక్ టెక్నాలజీతో అన్నిరకాల వసతులు అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు



# క్రీడ



## రెచ్చిపోయిన షమీ

### బిసిసిఐకి స్ట్రాంగ్ మెసేజ్!!

సీనియర్ పేసర్ మహ్మద్ షమీ టీమిండియాలో పునరాగమనానికి సై అంటున్నాడు. తాజాగా తన ప్రదర్శనతో మరోసారి బీసీసీఐ సెలక్టరకు గట్టి సవాల్ విసిరాడు. దాదాపు 14 నెలల నుంచి అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీ రోజురోజుకూ మరింత ప్రమాదకరమైన బౌలర్‌గా మారిపోతున్నాడు. ఫిట్‌నెస్‌ను సాధించి ఛాంపియన్స్ ట్రోఫీకి నేను రెడీ అంటూ తన ప్రదర్శనతోనే బిసిసిఐ సెలక్టర్లకు గట్టి సవాల్ విసురుతున్నాడు. తనను కచ్చితంగా ఎంచుకుని తీరాల్సిందే అంటూ.. తన ఆటతీరుతో సెలక్టర్లకు గట్టి సందేశాన్ని పంపుతున్నాడు. ఈ క్రమంలోనే తాజాగా మరోసారి తన అద్భుత ప్రదర్శనతో చెలరేగి ఆడాడు.

**10 ఓవర్ల స్పెల్, 3 వికెట్లు, 61 పరుగులు**

నిన్నటి వరకు షమీ ఫిట్‌నెస్ పై ఎంతో కొంత ఆందోళన నెలకొనే ఉంది. కానీ ఇప్పుడు అది అమానుల్లో పూర్తిగా తొలిగిపోయే దిశగా వచ్చేసింది. ఎందుకంటే విజయ్ హాజారే ట్రోఫీలో మళ్లీ అద్భుత ప్రదర్శనతో షమీ రెచ్చిపోయాడు. బెంగాల్ జట్టు తరపున బరిలోకి దిగిన షమీ, హరియాణాతో జరిగిన మ్యాచ్‌లో మూడు వికెట్లు పడగొట్టాడు. పది ఓవర్ల స్పెల్ వేసిన అతడు 61 పరుగులు ఇచ్చాడు. అంతకుముందు రౌండ్ 7 మ్యాచ్‌లో కూడా మధ్యప్రదేశ్‌పై 42 పరుగులు చేసిన అతడు, ఎనిమిది ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీశాడు.



## ఆసీస్‌కు బిగ్ షాక్!

టీమిండియాపై బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో విజయం సాధించిన ఆస్ట్రేలియా జట్టుకు బ్యాడ్ న్యూస్ అందింది. ఇటీవలే ముగిసిన బోర్డర్‌గావస్కర్ ట్రోఫీలో విజయం సాధించి ప్రస్తుతం ఫుల్ జోష్ మీదుంది ఆస్ట్రేలియా జట్టు. అయితే ఇప్పుడా జట్టుకు ఓ షాక్ తగిలింది! ఆ జట్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులో ఉంటాడా లేదా అనేది అనుమానంగా మారింది. తాజాగా ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డ్. లంకతో జరగబోయే రెండు టెస్ట్ మ్యాచుల సిరీస్ కోసం జట్టును ప్రకటించింది. ఇందులో కమిన్స్ పేరు లేదు. వ్యక్తిగత కారణాలతో అతడు అందుబాటులో ఉండట్లేదని తెలిపింది. ఎందుకంటే లంకతో సిరీస్ జరిగే సమయానికి కమ్మిన్స్ భార్యకు రెండో డెలివరీ అయ్యే అవకాశం ఉంది. దీంతో పాటే కమ్మిన్స్‌కు ప్రస్తుతం చీలిమండ గాయమైంది. ఈ విషయాన్ని ఆస్ట్రేలియా చీఫ్ సెలక్టర్ జార్జ్ బెలీ చెప్పాడు. కమిన్స్‌కు త్వరలోనే గాయం తీవ్రత తెలుసుకోవడానికి స్కానింగ్ చేస్తారని చెప్పుకొచ్చాడు. దీంతో, ప్యాట్ కమిన్స్ ఛాంపియన్స్ ట్రోఫీకి అందుబాటులో ఉంటాడా లేదా అనేది ప్రస్తుతం అనుమానంగా మారింది. ఎందుకంటే గాయం తీవ్రత ఎక్కువ ఉంటే అతడు ఈ మెగా టోర్నీకి దూరమయ్యే అవకాశం ఉందని ఇంగ్లీష్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. కాగా, ఆస్ట్రేలియా జట్టు ఛాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్ బీలో ఉంది. ఈ కేటగిరీలో అఫ్గానిస్థాన్, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా జట్లు ఉన్నాయి. ఈ మెగా టోర్నీలో ఆస్ట్రేలియా తన తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 22న లాహోర్‌లోని గడాఫీ స్టేడియంలో ఇంగ్లాండ్‌తో తలపడనుంది.



## ఆ ఒక్కటి చేస్తే .. బుమ్రాకు ఛాన్స్!

**వచ్చే నెలలో ప్రారంభం కానున్న ఛాంపియన్స్ ట్రోఫీలో బుమ్రా ఆడతాడా? లేదా? అనే సందేహం ప్రస్తుతం క్రికెట్ ప్రియుల్లో ఉత్కంఠ రేపుతోంది.**

రీసెంట్‌గా ముగిసిన ఆస్ట్రేలియా పర్యటనలో అదిరే ప్రదర్శన చేసిన బుమ్రా 32 వికెట్లతో టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును కూడా దక్కించుకున్నాడు. కానీ, సిడ్నీ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో వెన్ను నొప్పి కారణంగా బౌలింగ్ చేయలేదు. దీంతో మరోసారి భారత క్రికెట్‌లో జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై తీవ్ర చర్చ సాగడం మొదలైంది.
ఇప్పటికే బుమ్రా.. బిసిసిఐ మెడికల్ టీమ్‌తో కలిసి స్కానింగ్‌కు కూడా వెళ్లొచ్చాడు. కానీ, అతడి గాయం తీవ్రతపై బిసిసిఐ ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. అయితే ఇంగ్లాండ తో టీ20, వన్డే సిరీస్‌లకు బుమ్రా విశ్రాంతి తీసుకుంటాడని, అతడిని కేవలం ఛాంపియన్స్ ట్రోఫీ ఆడించేలా టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు కథనాలు వచ్చాయి. అయితే దీనికోసం బీసీసీఐ ఓ షరతును పెట్టినట్లు సమాచారం అందింది. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఆడే జట్టును జనవరి 12లోగా ప్రకటించాలి. అయితే ఆ తర్వాత కూడా జట్టులో మార్పులు చేసుకునే ఛాన్స్ ఉంటుంది. అందుకే 15 మందితో కూడిన జట్టులో మొదట బుమ్రా పేరు ప్రకటిస్తారట. ఆ తర్వాత టోర్నీ ప్రారంభం (ఫిబ్రవరి 19 నుంచి మొదలు) నాటికి బౌలింగ్ వేసేంత ఫిట్‌నెస్ అతడు సాధిస్తేనే, తుది జట్టులో అవకాశం కల్పిస్తామని మేనేజ్‌మెంట్ ఫిక్స్ అయిందట. కాబట్టి బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం నాటికి ఫిట్ నెస్ సాధిస్తే, మెగాటోర్నీ ఆడే అవకాశం ఉంటుంది.

**న్యూజిలాండ్ వైద్యుడితో చికిత్స**

వెన్నునొప్పితో బాధపడుతోన్న జస్‌ప్రీత్ బుమ్రా, చికిత్స కోసం న్యూజిలాండ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రోవన్ స్కాటెన్‌ను సంప్రదించినట్లు తెలిసింది. ప్రస్తుతం బుమ్రా గాయం పరిస్థితిని డాక్టర్ రోవనే పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

# రీల్



## బర్త్‌డే గిఫ్ట్

### –ప్రగ్యా జైస్వాల్

టాలీవుడ్ హ్యాట్రిక్ హిట్స్‌తో గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ సాలిడ్ హిట్ స్ట్రీక్‌కి మైంటైన్ చేస్తూ ఈ సంక్రాంతి కానుకగా జనవరి 12న 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కాబోతుంది. ఈ క్రమంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన కథానాయిక ప్రగ్యా జైస్వాల్. పుట్టినరోజు ప్రతి ఏడాది వస్తుంది. కానీ బాలకృష్ణ సినిమా అనేది ఒక సెలబ్రేషన్ లాంటిది. ఆయనతో కలిసి నేను నటించిన సినిమా నా బర్త్ డేకి విడుదల కావడం నా అదృష్టం. ఇది నా పుట్టినరోజుకి ఒక పెద్ద బహుమతిగా భావిస్తున్నాను. అలాగే నేను నటించిన సినిమా సంక్రాంతి లాంటి పెద్ద పండుగకు విడుదలవుతుండటం కూడా ఎంతో సంతోషంగా ఉంది. ఇందులో నేను కావేరి పాత్ర పోషించాను. నటనకు ఆస్కారమున్న మంచి పాత్ర ఇది. డీ గ్లామరస్ రోల్ చేశాను. నేను ఇప్పటివరకు పోషించిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. కావేరి పాత్రను బాబీ గారు డిజైన్ చేసిన తీరు బాగుంది. ఈ పాత్ర నాకు నటిగా ఛాలెంజింగ్ గా అనిపించింది. కావేరి పాత్రతో పాటు ఈ సినిమాలోని ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది. మా డాకు మహారాజ్‌తో పాటు ఈ సంక్రాంతికి విడుదలవుతున్న గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు కూడా విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని ప్రగ్యా జైస్వాల్ చెప్పుకొచ్చారు.



## విమర్శల నుంచి ఎవరూ తప్పించుకోలేరు

### – దర్శకుడు శంకర్

'గేమ్ ఛేంజర్'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు ప్రముఖ దర్శకుడు శంకర్. రామ్‌చరణ్ హీరోగా నటించిన ఈ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈనేపథ్యంలో శంకర్ వరుస ప్రమోషన్‌లతో బిజీగా ఉన్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'ఇండియన్ 2' గతేడాది ప్రేక్షకుల ముందుకువచ్చి ఆశించిన స్థాయిలో అలరించలేకపోయింది. దీంతో సోషల్ మీడియాలో ఆయన్ని కొందరు విమర్శించారు. తాజా ఇంటర్వ్యూలో వీటిపై శంకర్ మాట్లాడారు. ''విమర్శలను ప్రతిఒక్కరూ జీవితంలో ఏదోఒక సమయంలో ఎదుర్కోవాల్సిందే. వాటినుంచి ఎవరూ తప్పించుకోలేరు. ఎవరైనా.. దేనినైనా విమర్శించొచ్చు. అయితే, వాటినుంచి మనం ఏం నేర్చుకున్నామనేది ముఖ్యం. ఆ విమర్శలను సవాలుగా తీసుకొని తర్వాత ప్రాజెక్ట్‌ను మెరుగ్గా తీయాలి. ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్'తో నేను బిజీగా ఉన్నాను. ఈ చిత్రం రిలీజ్ అయిన తర్వాత 'భారతీయుడు 3' పనులు ప్రారంభిస్తాను'' అని చెప్పారు. ఇక తాను భవిష్యత్తులో బయోపిక్ అంటూ తీస్తే రజనీకాంత్ జీవిత చరిత్రనే తెరకెక్కిస్తానని శంకర్ స్పష్టంచేశారు. ''రజనీకాంత్ గొప్ప వ్యక్తి. ఈ విషయం ఎంతో మందికి తెలుసు. నాకు ప్రస్తుతానికి బయోపిక్‌ను తెరకెక్కించాలనే ఆలోచన లేదు. ఒకవేళ భవిష్యత్తులో ఆ ఆలోచన వస్తే రజనీకాంత్ బయోపిక్‌నే తీస్తాను'' అని చెప్పారు. ఈ కామెంట్స్ సినీప్రియుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఫ్యూచర్‌లో శంకర్ దర్శకత్వంలో రజనీకాంత్ బయోపిక్ వస్తే అది సూపర్ హిట్ అవుతుందని వారంతా భావిస్తున్నారు.

## ఊరి రక్షణ కోసం చిన్నారి సాహసం

### 'గాంధీ తాత చెట్టు' ట్రైలర్ రిలీజ్

సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ సంస్థల సంయుక్త నిర్మాణంలో తెరకెక్కిన సినిమా 'గాంధీ తాత చెట్టు'పై సినీ ప్రపంచంలో మంచి ఆసక్తి నెలకొంది. జాతీయ అవార్డులు గెలుచుకున్న దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి ప్రధాన పాత్రలో నటించడం ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణ. అప్పుడెప్పుడో 100% లవ్ స్టోరీలో హీరోయిన్ ఇంట్రో షాట్‌లో పసిపాపగా కనిపించిన సుకృతి మళ్ళీ ఇప్పుడు ఒక డిఫరెంట్ ఏమోషనల్ కంటెంట్ ఉన్న సినిమాలో నటించడం విశేషం. ఇటీవలే ఈ చిత్రం పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లలో ప్రదర్శించబడి ప్రశంసలు అందుకుంది. జనవరి 24న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, సూపర్‌స్టార్ మహేష్‌బాబు సోషల్ మీడియాలో ట్రైలర్‌ను విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. ట్రైలర్ విషయానికి వస్తే, గాంధీ సిద్ధాంతాలను అనుసరించే పదమూడేళ్ల అమ్మాయి తన గ్రామాన్ని రక్షించడానికి చేసే ప్రయాణం ఈ కథాంశం అని తెలుస్తుంది. సుకృతి ఇందులో నిజంగా గుండులో కనిపించడం మరో ఆసక్తికరమైన విషయం. సుకృతి వేణి తన సహజ అభినయంతో ఆ పాత్రను ప్రాణం పోసింది. ట్రైలర్ హృదయాన్ని హత్తుకునే సన్నివేశాలతో నిండిఉంది. ఈ సందర్భంగా మహేష్‌బాబు తన ట్విట్టర్‌లో 'ఇది అందరి హృదయాలను హత్తుకునే సినిమా, గాంధీ తాత చెట్టు ట్రైలర్ విడుదల చేయడం సంతోషంగా ఉంది. సుకృతికి, ఈ సినిమా టీమ్ అందరికి నా అభినందనలు' అంటూ ప్రశంసలు కురిపించారు.






## జిహెచ్ఎంసి కాంట్రాక్టర్ల మెరుపు ధర్నా

**ఇద్దరు కాంట్రాక్టర్లు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం అడ్డుకున్న ఇతర కాంట్రాక్టర్లు**
**చర్చలకు పిలిచిన జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి**
**బిల్లులు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమణ**

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మహనగర పాలక సంస్థ (జిహెచ్ఎంసి) ప్రధాన కార్యాలయం వద్ద కాంట్రాక్టర్లు మెరుపు ధర్నాకు దిగారు. గురువారం పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టారు. ప్రధాన కార్యాలయం కమిషనర్ ద్వారం ముందు బైఠాయించి, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ వారు డిమాండ్ చేశారు. తక్షణమే తమకు రావాల్సిన బకాయలు రూ.1100 కోట్లు చెల్లించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో ఇద్దరు కాంట్రాక్టర్లు ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న ఇతర కాంట్రాక్టర్లు వారి ప్రయత్నాన్ని అడ్డుకొన్నారు. దీంతో అక్కడ కొంత ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన కాంట్రాక్టర్లను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వారిద్దరి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ఇతర కాంట్రాక్టర్లు తెలిపారు. జిహెచ్ఎంసి బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల బాధతో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అప్రమత్తమైన జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి కాంట్రాక్టర్లను చర్చలకు పిలిచారు. పెండింగ్ బిల్లులపై కమిషనర్ ఇలంబర్తి కాంట్రాక్టర్లతో చర్చలు జరిపారు. త్వరలోనే బిల్లులను క్రమంగా ఇస్తామని హామీనివ్వడంతో కాంట్రాక్టర్లు ఆందోళన విరమించారు. కాంట్రాక్టర్ల ఆందోళనల నేపథ్యంలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్ సింగ్, ప్రతినిధులు హనుమంత్ సాగర్, జి.ఎస్.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.





## నేత్రపర్వంగా రాములోరి తెప్పోత్సవం

ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామివారి తెప్పోత్సవ వేడుక గురువారం కనుల పండువగా సాగింది. కార్యక్రమానికి ముఖ్యాతిథిగా భద్రాచలం ఎంఎల్‌ఏ డా. తెల్లం వెంకట్రావు హాజరయ్యారు. ఇందులో భాగంగా అంతరాలయంలో స్వామివారికి పూజలు చేసిన అనంతరం నూతన వస్త్రాలు అలంకరించి వేధఘోష నడుమ ప్రత్యేక పల్లకీలో మంత్రోశ్చరణలు, మేళతాళాలతో గోదావరి తీరానికి తోడుకొచ్చారు. అప్పటికే సిద్ధం చేసి ఉన్న హంసవాహనంలోని ప్రత్యేకవేదికపై సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను ఆశీలను చేసి స్వామివారికి పూజలు చేసి హారతులు పట్టారు. అనంతరం స్వామివారు గోదావరి తీరంలో హంస వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఐదు సార్లు నదీ తీరంలో స్వామివారు కలియతిరుగుతుండగా అర్చక స్వాములు మంత్రపఠనం చేశారు. నదీతీరంలో వివిఐపి, విఐపిలతో పాటు తదితర గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్ జితేష్ వి మిశ్రా నేతృత్వంలో ఎస్‌పి ఆధ్వర్యంలో గట్టిపోలీస్ బందోబస్తు నిర్వహించారు. గోదావరి తీరంలో ఏర్పాటు చేసిన విడిధి ఇళ్లతో పాటు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా చేసిన ఏర్పాట్లు భక్తులకు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. గిరిజన సాంప్రదాయ వంటకాలు, ఆహార పదార్థాలు భక్తులకు అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్, ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్‌డి దామోదర్ రావు, దేవస్థానం ఇఓ ఎల్ రమాదేవి, తహశిల్దార్ శ్రీనివాస్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## విస్తరించిన దావానలం

(మొదటి పేజీ తరువాయి)

లిడియాలో 350 ఎకరాలు, సన్‌సెట్‌లో 20 ఎకరాల ప్రాంతాలను కార్చిచ్చు ఆహుతిచేసింది. ఊడ్‌లీ, ఓలివేస్‌లలో మాత్రం మంటలను అదుపు చేస్తున్నారు. శాధ్యక్షుడు జో బైడెన్ ఈ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆయన ఇటలీ పర్యటనను కూడా రద్దుచేసుకున్నారు. హాలీవుడ్ హిల్స్‌లో ఇళ్ళు ఖాళీచేసిన సెలబ్రిటీలు వీధుల్లోకి వచ్చి ఎటు వెళ్ళాలో తెలియక అటూ ఇటూ దిక్కులు చూస్తున్నారు. మంగళవారం సాయంత్రం చిన్నగా ప్రారంభమైన దావానలం విపరీతమైన కొండగాలుల కారణంగా గురువారంనాటికి ఆరు ప్రాంతాలలో వేరువేరుచోట్ల తీవ్ర దావాగ్ని పుట్టించింది. దావానలంలో పది ఐదుగురు మరణించినట్లు లాస్ ఏంజెల్స్ అధికార వర్గాలు ధృవీకరించాయి. గగనతల మార్గం ద్వారా కార్చిచ్చు మంటలను అదుపుచేసేందుకు అగ్నిమాపకదళాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. అగ్నిమాపకదళ సిబ్బందికి నీటి కొరత పెద్ద సమస్యగా మారడంతో వారు మంటలను అదుపుచేయలేకపోతున్నారు. గత ఏడాది సమ్మర్‌లో అగ్నిమాపకదళ విభాగానికి 17 మిలియన్ డాలర్లు నిధుల్లో కోత విధించిన లాస్‌ఏంజెల్స్ మేయర్ కరెన్ బాస్ ఇప్పుడు ఈ విలయపరిస్థితుల్లో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు.

**రేపు, ఎల్లుండి 'క్రెడాయ్ వరంగల్' ఆధ్వర్యంలో**

## ప్రాపర్టీ షో




ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : తెలంగాణలో రెండవ అతి పెద్ద నగరమైన వరంగల్‌లో క్రెడాయ్ వరంగల్ చాప్టర్ ఆధ్వర్యంలో ఈనెల 11,12 తేదీలలో ప్రాపర్టీ షో హనుమకొండలోని పిజిఆర్ గార్డెన్‌లో నిర్వహించబడుతుందని క్రెడాయ్ వరంగల్ ప్రతినిధులు తెలిపారు. గురువారం హనుమకొండలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నూతనంగా లేదా ఇల్లు లేదా విల్లా, అపార్ట్ మెంట్ కొనుగోలు చేయాలను కొనే వారు, స్వంతంగా ఇల్లు నిర్మించుకునే వారికి సౌకర్యంగా ఉండేందుకు నగరంలో నిర్మాణమవుతున్న అన్ని అపార్ట్ మెంట్స్, విల్లాల, లే అవుట్‌ల సమాచారంతో పాటు ఇంటి నిర్మాణానికి కావలసిన అన్నింటి సమాచారం తెలుసుకో దానికి, లోన్ సౌకర్యం కోసం వివిధ బ్యాంకులను ఒకే వేదిక పైకి తీసుకు ఇచ్చి ఈ ప్రాపర్టీ షో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కావున హనుమకొండ, వరంగల్, కాజీపేట నగర ప్రజలు పెద్ద ఎత్తున దీనిలో పాల్గొని సద్విని యోగం చేసుకోవాలని క్రెడాయ్ వరంగల్ కోరుతున్నదని వారు తెలిపారు. ఈ విలేఖరుల సమావేశంలో క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షులు ఈ.ప్రేమ్ సాగర్ రెడ్డి, వరంగల్ చాప్టర్ అధ్యక్షులు ఎర్రబెల్లి తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు ఎన్.అమరేందర్ రెడ్డి, ఎస్.అమర లింగేశ్వర్ రావు, ఎం.రవిందర్ రెడ్డి, వరంగల్ చాప్టర్ కార్యదర్శి జే.మనోహర్, సంయుక్త కార్యదర్శులు జి.రాజేందర్ రెడ్డి, ఎల్.రజినీకాంత్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎ.నాగరాజు, యూత్ వింగ్ నాయకులు డి.హరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు

## ఇద్దరు అధికారులపై వేటు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చారు. రేణిగుంట విమానాశ్రయం నుండి నేరుగా తొక్కిసలాట జరిగిన పద్మావతి పార్క్ వద్దకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం నేరుగా పద్మావతి వైద్య కళాశాల వద్దకు వెళ్లి గాయపడిన వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం టీటీడీ పరిపాలన భవనంలో మంత్రులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. మతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షలు ఆర్థిక సాయం, కాంట్రాక్టు ప్రాతిపదికన ఇంటికొక ఉద్యోగం కల్పిస్తామని చెప్పారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరికీ రూ.5లక్షలు వంతున, స్వల్పంగా గాయపడిన వారికి రూ.2లక్షల చొప్పున సాయం అందిస్తామన్నారు. గాయపడిన వారందరికీ వైకుంఠ ద్వార దర్శనం చేయిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోలీసులు, టీటీడీ అధికారులు సమన్వయంతో పనిచేసుంటే ఈ ఘటన జరిగి ఉండేది కాదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పద్మావతి పార్కు లోపల భక్తులను ఉంచడం సరైన నిర్ణయం కాదన్నారు. ఒకరోజు వైకుంఠ ద్వార దర్శనాన్ని పది రోజుల పాటు కల్పించడంపై ఆగమ పండితులు నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లోనూ క్యూ లైన్లు, వసతులు, ప్రసాదాలు వంటి వాటిపై సమీక్షిస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా టీటీడీ సమీక్ష సమావేశాలు నిర్వహించి భవిష్యత్తులో కొన్ని కీలక నిర్ణయాలు చేయాలని సూచించారు. భక్తుల దర్శనం మరింత సులభతరం చేసుకునేందుకు సాంకేతికతను ఉపయోగిస్తామన్నారు.

**బాధితులకు పరామర్శ**

సీఎం చంద్రబాబు... తొక్కిసలాటలో గాయపడి చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరి దగ్గరికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే తొక్కిసలాటకు గల కారణాలను ఆరా తీశారు. వైకుంఠ ఏకాదశి టోకెన్లు తిరుపతిలో ఇవ్వడం బాగుందా? తిరుమలలో ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన సందర్భంగా సీఎం చంద్రబాబు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానంగా ఏర్పాట్లపై టీటీడీ ఈవో శ్యామలరావు, ఎస్పీ సుబ్బరాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్‌లపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. పరిమితికి మించి పార్కు లోపలికి భక్తులను ఎలా అనుమతించారంటూ అధికారులను నిలదీశారు. టికెట్ల కోసం వచ్చే భక్తులు ఆత్రుతగా ఉంటారనే విషయాన్ని గ్రహించలేక పోవడం బాధాకరమన్నారు. ఇది క్షమించాల్సిన తప్పు కాదన్నారు. కొత్త పద్ధతులతో పనిచేస్తారని పంపిస్తే... ఇదేనా మీరు చేసేది అంటూ అధికారులపై సీరియస్ అయ్యారు. ఆన్‌లైన్‌లో ఎన్ని టోకెన్లు ఇచ్చారు, ఆఫ్ లైన్ లో ఎన్ని కేటాయించారు జాబితా ఇవ్వండి అంటూ ముఖ్యమంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్ధతిగా పనిచేయడం నేర్చుకోవాలంటూ చురకలు అంటించారు. భక్తుల రద్దీ పెరుగుతుంటే టీటీడీ అధికారులు ఏం చేస్తున్నారు? ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకున్నప్పుడు దాన్ని సక్రమంగా నెరవేర్చాలని... తమాషా అనుకోవద్దు అంటూ అధికారులను హెచ్చరించారు. జేఈఓగా మీ బాధ్యత ఏంటి? ఏం చేస్తున్నారు అంటూ జేఈవో గౌతమిని నిలదీశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా జాగ్రత్త పడాలన్నారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, వంగలపూడి అనిత, సత్య కుమార్, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రథమ వర్ధంతి



మంచికి మారుపేరుగా నిలిచి, ఆప్యాయతానురాగాలతో మా అందరి హృదయాలలో సుస్థిర స్థానం పొందిన మీరు మా నుండి దూరమై సంవత్సర కాలం గడిచిననూ మీ జ్ఞాపకాలు, మధుర స్మృతులు మాలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ శ్రీమతి భూతం విమల గారు
జననం: 12.06.1977, మరణం: 26.01.2024
గ్రా॥ తిరుమలగిరి, మం॥ నాంపల్లి, జిల్లా: నల్లగొండ.

భర్త: భూతం ముత్యాలు ప్రధానోపాధ్యాయులు (కవి, రచయిత)
కుమారుడు: భూతం జయప్రకాష్
కూతురు - అల్లుడు చామల జ్యోతి - పవన్
మరియు బంధుమిత్రులు

కార్యస్థలం: ఇంటి నెం. 4-11-117/1, చైతన్యపురి కాలనీ, రోడ్ నెంబర్ - 2, జిఎం ఫంక్షన్ వెనుక, డివికె రోడ్, గంధం వారి గూడెం రోడ్, నల్గొండ, తెలంగాణ -508001

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com